thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 124 | కరీంనగర్ ఆదివారం, 13 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## రైల్వేలో 6,374 పోస్టుల భర్తీకి చర్యలు

న్యూఢిల్లీ : రైల్వేలో ఖాళీగా ఉన్న 6,374 టెక్నీషియన్ పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభమయ్యాయి. సిగ్నల్, టెలికమ్యూనికేషన్ సహా 51 కేటగిరీల్లోని గ్రేడ్-సి పోస్టులు భర్తీ కానున్నాయి. దేశంలోని 17 జోన్లు, ఉత్పాదక యూనిట్లలో ఈ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. ప్రస్తుతం పేర్కొన్న పోస్టుల సంఖ్య కన్నా ఇంకా ఎక్కువ ఖాళీలు ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి. సిగ్నల్, టెలికాం విభాగంలో చివరిసారిగా 2017లో పోస్టుల భర్తీ జరిగింది.




# 'బీసీ బిల్లు' పాసవుతుందా!?

## సస్పెన్స్‌లో బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్..!

## గవర్నర్‌దే తుది నిర్ణయం...!!

హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చే ఆర్డినెన్స్‌పై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వైఖరి ఎలా ఉంటుంది? ఆర్డినెన్స్‌పై ఆయన సంతకం చేస్తారా? లేకపోతే వెనక్కి పంపుతారా? లేదంటే తన వద్దే పెండింగ్‌లో పెడతారా? అనే చర్చ మొదలైంది. మార్చిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో బీసీలకు రాజకీయంగా, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆమోదించిన రెండు బిల్లులను గవర్నర్ రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. వాటిపై కేంద్రం ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో కొత్తగా పంచాయతీ రాజ్ చట్టం-2018ను సవరిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చే ఆర్డినెన్స్ విషయంలో గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని ఆసక్తి సర్వత్రా నెలకొన్నది.

**గవర్నర్ నిర్ణయం ఏంటి?...** కులగణన ప్రకారం బీసీ కులాలకు స్థానిక సంస్థల్లో, విద్యా, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే 2 బిల్లులను బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ ఆమోదించింది. వాటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూలులో పెట్టాలని కేంద్రాన్ని కోరింది. దీనితో ఆ బిల్లులు రెండింటినీ గవర్నర్ రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. కానీ, ఇంతవరకు రాష్ట్రపతి వాటిని ఆమోదించలేదు. అలాగని తిరస్కరించలేదు. దీంతో పంచాయతీ రాజ్-2018 చట్టంలోని రూల్ 285... ను సవరించి.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. ముందుగా ఆర్డినెన్స్ రూపంలో తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నది. ఆ ఆర్డినెన్స్‌పై గవర్నర్ ఏం నిర్ణయం తీసుకుంటారోనని చర్చ మొదలైంది. వెంటనే తుది నిర్ణయం తీసుకుంటారా? లేక న్యాయ సలహాలు తీసుకున్నాకే ఓ నిర్ణయానికి వస్తారా? అనే చర్చ జరుగుతున్నది. కానీ, ఆర్డినెన్స్‌లో న్యాయ, రాజకీయ అంశాలు ఉన్నందున అన్ని కోణాల్లో ఆలోచించిన తర్వాతే ఆయన తుది నిర్ణయానికి వస్తారని అధికారులు భావిస్తున్నారు.

**బీజేపీ గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందా?...** రాజకీయపరమైన అంశాల్లో గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ డైరెక్షన్ ప్రకారం నడుచుకుంటారని టాక్. లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చే ఆర్డినెన్స్‌పై గవర్నర్ స్వతహాగా నిర్ణయం తీసుకుంటారా? లేక కేంద్ర బీజేపీ నాయకుల సలహా మేరకు ముందుకు వెళ్తారా? అనే చర్చ జరుగుతున్నది. ఒకవేళ ఢిల్లీ నాయకత్వం గైడెన్స్ ప్రకారం గవర్నర్ బిల్లును రిజక్ట్ చేసినా, ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టినా ఆ ప్రభావం రాష్ట్ర బీజేపీపై పడటం ఖాయం. ఎందుకంటే బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచేందుకు తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ అడ్డుకుందని కాంగ్రెస్ పార్టీ ఎటాక్ చేయనుంది. దీంతో రిజర్వేషన్ల పెంపు విషయంలో బీజేపీ అడుగులు ఎటువైపు అనేది ఆసక్తికరంగా మారింది.

**కోర్టుల్లో చాలెంజ్ చేస్తే ఎలా?...** ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించినా కోర్టులో ఎవరైన చాలెంజ్ చేస్తే ఎంటీ? అనే ఆందోళన అధికారుల్లో నెలకొన్నది. ఎందుకంటే లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటుతాయి. ఇది సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధం. ఎవరైన ఆర్డినెన్స్‌ను చాలెంజ్ చేస్తే న్యాయపరంగా ఇబ్బందులు తప్పవనే చర్చ అధికార వర్గాల్లో ఉంది.

**కొత్త సిఫారసులు చేయండి...** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయం ప్రకారం డెడికేషన్ కమిషన్ నుంచి కొత్త సిపారసులు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం డెడికేషన్ కమిషన్‌కు కొత్త విధివిధానాలు ఇచ్చినట్లు తెలుస్తున్నది. కులగణన ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే విధంగా సిఫారసులు ఉండాలని, అందులో పేర్కొన్నట్లు సమాచారం. గతంలో కమిషన్‌కు ప్రభుత్వం ఇచ్చిన విధివిధానాల్లో రిజర్వేషన్లు 50 శాతంలోపు ఉండాలని సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావించారు. దీనితో కమిషన్ సమర్పించిన రిపోర్టులో బీసీలకు కేవలం 22 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సిఫారసు చేసింది. అందుకని మళ్లీ కొత్తగా రికమెండేషన్ తీసుకుని, ఆ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. అయితే, హైకోర్టు ఇచ్చిన గడవులోపు రిజర్వేషన్ల ఖరారును పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నది. ఒకవేళ ఆర్డినెన్స్ ఆమోదానికి ఇబ్బందులు వస్తే ఆ విషయాన్ని కోర్టుకు వివరించి మరింత గడువు కోరాలని భావిస్తున్నట్లు తెలుస్తున్నది.




## రాజా సింగ్ ముందున్న దారేది..?

### బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో చేరుతారా..!

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ తో పాటు గోషామహల్ కు బైపోల్ అంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో....రాజాసింగ్ భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. అయితే తాను ఏ పార్టీలో చేరాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని రాజాసింగ్ ప్రకటించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో చేరుతారంటూ వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. తన కార్యకర్తలు, అభిమానులతో చర్చించిన తర్వాతే ఏ నిర్ణమైనా తీసుకుంటానని తెలిపారు. అయితే రాజాసింగ్ కు గోషామహాల్ కంచుగోటగా మారింది. దీంతో రాజాసింగ్ ను తమపార్టీలోకి తీసుకుంటే... గోషామహాల్ సీటును ఎప్పటికి తమదగ్గరే ఉంటుందని పార్టీలు భావిస్తున్నాయి. ఈ టైంలో రాజాసింగ్ ను తమపార్టీలోకి చేర్చుకునేందుకు రెండు పార్టీలు మంతనాలు జరిపేందుకు రెడీ అవుతున్నాయి. అయితే రాజా సింగ్ మనస్తత్వం ప్రకారం ఆయనకు బీజేపీ వంటి హిందూత్వ పార్టీనే కరెక్ట్ అనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆ పార్టీ కాకుండా ఆయన వేరే పార్టీలో ఇమడలేరు. అసలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వంద శాతం హిందూత్వ అని చెప్పి రాజకీయాలు చేసే రాజా సింగ్ ను చేర్చుకుంటాయని అనుకోలేదు. ఇక గోషా మహల్ నియోజకవర్గ విషయాని కొస్తే.. బీజేపీ ఇమేజ్ కు తోడుగా రాజా సింగ్ హిందూత్వ యాడ్ అయిన హైదరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం కంచుకోటగా మారింది. అయితే బీజేపీ పార్టీని విడిచి పెట్టిన కొంత మంది హిందూ నేతల విషయాలను కొంత మంది ప్రస్తావిస్తున్నారు. ఒకప్పటి ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా.. ఆపై రాజస్థాన గవర్నర్ గా పనిచేసిన కళ్యాణ్ సింగ్ వంటి నేత కూడా వేరే పార్టీ పెట్టుకున్నారు. కానీ చివరకు బీజేపీలోనే పునరాగమనం చేశారు. తెలంగాణలో అలె నరేంద్ర అటు కర్ణాటకలో యడ్యూరప్ప వంటి బలమైన నేత.. మధ్య ప్రదేశ్ నుంచి ఉమా భారతి, గుజరాత్ రాష్ట్రానికి చెందిన శంకర్ సింగ్ వాఘేలా, కేశూభాయ్ పటేల్ వంటి నేతలు కూడా బీజేపీ వీడిన తర్వాత ఏమి చేయలేకపోయారు. అంతేకాదు వారి రాజకీయ భవిష్యత్తు అగమ్య గోచరంగా మారింది. మరి బీజేపీ వంటి క్యాడర్ బేస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన రాజా సింగ్ .. పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చనేది విశ్లేషకులు చెబుతున్న మాట.




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం కొనసాగుతుంది. ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. ఎగువున్న ఉన్న ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరుకి భారీగా నీరు చేరడంతో గోదావరి ప్రవాహం గంట గంటకి పెరుగుతోంది. భద్రాచలం వద్ద స్థాన ఘాట్లకు వద్దకు నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే అధికారులు ముంపు ప్రాంత గ్రామాల ప్రజలను అలర్ట్ చేస్తున్నారు. వరద పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జీతిష్ వి పాటల్ హెచ్చరికలు జారీ చేశారు. అటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద గోదావరి నది ప్రవాహం పెరుగుతంది. కాళేశ్వరం పుష్కర ఘాట్లను తాకుతూ గోదారమ్మ ఉరకలేస్తోంది. దీంతో మేడిగడ్డ బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో, 5 లక్షల 25 వేల క్యూసెక్కులుగా ఉంది. మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీ 85 గేట్లు ఎత్తి ఉంచడంతో నీరు మొత్తం దిగువకు వెళుతోంది. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి నది 9.700 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

13 మీటర్లు దాటితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. అయితే గోదావరిలో వస్తున్న ప్రవాహం అంతా ప్రాణహిత నది ప్రవాహమే. మహారాష్ట్రలో కురుస్తున్న వానలతో ప్రాణహిత నది ప్రవహిస్తోంది. ప్రాణహిత నది ప్రవాహం కాళేశ్వరం వద్ద గోదావరి నదిలో కలవడం వల్ల గోదావరి నదికి జలకళ వచ్చింది. ఎగువన గోదావరి నదిలో మాత్రం ప్రవాహం లేదు. అటు కోనసీమ జిల్లాలో వరద పోటెత్తింది. దీంతో పలు లంక గ్రామాలకు వరద కష్టాలు మొదలయ్యాయి. పి.గన్నవరం మండలం గంటిపేదపూడిలో నదీపాయకు వేసిన తాత్కాలిక గట్టు తెగిపోవడంతో నాలుగు లంక గ్రామాల్లో అంధకారం నెలకొంది. నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లంక గ్రామాల ప్రజలు పడవపైనే ప్రయాణాలు చేస్తున్నారు.




# నో డౌట్... మోదీకి తిరుగులేదు!

## మోదీ అనుకున్నప్పుడే రిటైర్మెంట్ !

"75 ఏళ్లు వచ్చాయని చెప్పి ఎవరైనా వచ్చి శాలువా కప్పితే అది మనకు ఇక సేవలు చాలు" అని చెప్పినట్లేనని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు దేశంలో కొత్త చర్చకు కారణం అయ్యాయి. అవి మోదీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలేనని కాంగ్రెస్ పార్టీ చెప్పింది. అయితే ఆరెస్సెస్ వేగంగా స్పందించింది. మోదీకి ఆ వ్యాఖ్యలకు సంబంధం లేదని స్పష్టం చేసింది. కానీ అంతకు ముందే బీజేపీలో మోదీకి వారసులెవరు అన్న అంశంపై చర్చ కూడా ప్రారంభమయింది. అమిత్ షా నోట కూడా రిటైర్మెంట్ మాట వినిపించింది. కానీ మోదీని రిటైర్మెంట్ అడిగే ధైర్యం ఎవరికీ లేదు. ఆయన అనుకున్నప్పుడు మాత్రమే రిటైర్ అవుతారనేది అందరికీ తెలిసిన నిజం.

**బీజేపీలో 75 ఏళ్లకు రిటైర్మెంట్ రూల్...** భారతీయ జనతా పార్టీలో ఓ అప్రకటిత రూల్ అమల్లో ఉంది. సీనియర్లు ఎవరైనా 75 ఏళ్ల వరకే రాజకీయాలు చేయాలి. ఆ తర్వాత రిటైర్మెంట్ తీసుకోవాలి. బీజేపీలో మోదీ, అమిత్ షా శకం ప్రారంభమైన తర్వాత మెల్లగా సీనియర్లు అందర్నీ ఈ కారణంగా ఇంటికి పంపేశారు. బీజేపీకి ఓ రూపం తెచ్చిన అద్వానీ, జోషి, ఉమాభారతి లాంటి వాళ్లను కూడా వదల్లేదు. అలాంటి వారంతా మెల్లగా కనుమరుగు అయ్యారు. వెంకయ్యనాయుడును కాస్త ముందుగానే ఉపరాష్ట్రపతి ఇచ్చి పంపేశారు. ఆ పదవి అయిన తర్వాత ఆయన రిటైర్మెంట్ లైఫ్ గడుపుతున్నారు. ఇటీవల యడ్యూరప్పకూ వర్తింప చేశారు. కానీ ఈ రూల్ మోదీకి వర్తిస్తుందా అని ఇతర పార్టీలు ప్రశ్నిస్తూంటాయి కానీ... బీజేపీలో ఎప్పుడూ అలాంటి చర్చలు జరగవు.. జరగలేవు కూడా.

**సెప్టెంబర్ 17కి మోదీకి 75 ఏళ్లు !...** ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సెప్టెంబర్ 17న 75వ ఏట అడుగుపెడతారు. బీజేపీ రూల్ ప్రకారం 75 పూర్తి అయి 76లోకి అడుగు పెట్టే సరికి ఆయన రిటైర్మెంట్ ప్రకటించాలి. కానీ బీజేపీలో నరేంద్రమోదీకి ఎదురు లేదు. ఆయన మాటే శాసనం. ఆయనను శాసించేవారు ఎవరూ లేరు. చివరికి బీజేపీ సిద్ధాంతకర్త అయిన ఆరెస్సెస్ పెద్దలు కూడా మోదీని దిగిపోవాలని చెప్పే సాహసం చేయరు. ఆయన అంత పట్టు సాధించారు. ప్రధాని మోదీ శారీరకంగా ఎంతో ఫిట్ గా ఉంటారు. ఆయనకు వాజ్ పేయి తరహాలోనే కుటుంబం లేదు. పూర్తిగా దేశానికే అంకితమయ్యారు. అందుకే ఆయనకు రిటైర్మెంట్ అనేది ఉండదని బీజేపీ వాదించే అవకాశం ఉంది.

**మోదీ అనుకున్నప్పుడే రిటైర్మెంట్...** ప్రధాని మోదీ ఇక పదవి చాలు అనుకున్నప్పుడు మాత్రం అందరూ అంగీకరిస్తారు.

గతంలో ప్రధాని మోదీ మూడో టర్మ్ పూర్తి అయిన తర్వాత.. వారసుడికి పగ్గాలు ఇచ్చి.. తాను రాష్ట్రపతిగా వెళ్లాలనే ఆలోచనల్లో ఉన్నారన్న ప్రచారం జరిగింది. అదే నిజం అయితే వచ్చే పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆయన అమిత్ షాను తన వారసుడిగా ప్రకటించి.. ఆయన రాష్ట్రపతిగా వెళ్లవచ్చు. ప్రస్తుతానికి మోదీ తర్వాత బీజేపీలో అమిత్ షాక్ పవర్ ఫుల్. ఆదిత్యనాథ్ కూడా రేసులో ఉంటారు కానీ.. అమిత్ షా తర్వాత ఆయనకు చాన్స్ లభించవచ్చు. మొత్తంగా.. మోదీ రిటైర్మెంట్ జరిగే చర్చలన్నీ బీజేపీపై ఎలాంటి ప్రభావం చూపవు .. మోదీ అనుకున్నప్పుడు మాత్రమే ఆయన రిటైర్ అవుతారు.

చురకలు





## సీఎంతో ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ భేటీ

హైదరాబాద్, జులై 12: సీఎం రేవంత్ రెడ్డిని ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్.మహేంద్ర దేవ్ ఇవాళ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో ఈ భేటీ జరిగింది. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లే అంశంపై ఇరువురి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలన్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న ముఖ్యమంత్రి.. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతో పాటు సేవా రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా కూడా పాల్గొన్నారు.




## న్యాయవాద వృత్తి సవాళ్లతో కూడుకున్నది

హైదరాబాద్: న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి జస్టిస్ బీఆర్ గవాయ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్‌పాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ.. "న్యాయవాదులు నిరంతరం తమను తాము నిరూపించుకోవాలి. కోర్టు తీర్పులకు సంబంధించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలి. ప్రస్తుత న్యాయవాద విద్యలో ప్రవేశించేవారి సంఖ్య పెరుగుతోంది. ఏఐ, డేటా ప్రైవసీ విషయంలో అనుకూల, ప్రతికూల ప్రయోజనాలు ఉన్నాయి. సరైన మార్గదర్శకత్వం ఉంటేనే.. నైపుణ్యం సాధించగలం. మెంటార్‌షిప్‌ను ఒక బాధ్యతగా భావించాలి. వృత్తిని, చేసే పనిని ప్రేమించాలి. అప్పుడే సరైన ఫలితాలు పొందగలుగుతాం. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కొన్ని కేసుల విచారణ దశాబ్దాల పాటు సాగటం ఆందోళనకరం" అని పేర్కొన్నారు.




## సింగరేణిలో మహిళా రెస్క్యూ టీమ్.. 136 ఏళ్ల చరిత్రలో తొలిసారి

**తెగువ మగవారికే సొంతం కాదు. మాలోనూ ఆ సత్తా ఉందంటున్నారు ఈ అమ్మాయిలు. 136 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణిలో తొలి మహిళా రెస్క్యూ బృందంగా శిక్షణ తీసుకున్నారు. బొగ్గు బావిలోకి నీళ్లొచ్చినా, విషవాయువు కమ్మినా, ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా.. ఆపత్కాల సేవలు అందించేలా రాటు దేలారు. 14 రోజుల పాటు కఠోర తర్ఫీదు పొందిన వీరికి సింగరేణి యాజమాన్యం రెస్క్యూ పట్టాలు ప్రదానం చేసింది.**



## సీతారామ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలి

**హైదరాబాద్: సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. రైతుల విజ్ఞప్తి మేరకు సీతారామ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలపై నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్లతో తుమ్మల మాట్లాడారు. నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదల ఆలస్యమవుతోందని, సీతారామ ప్రాజెక్టు నుంచి విడుదల చేయాలని కోరారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లా కలెక్టర్లతోనూ మంత్రి తుమ్మల మాట్లాడారు. ఇవాళ సమీక్ష తర్వాత నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ తెలిపారు.**

## రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు: మంత్రి ప్రభాకర్



నల్లగొండ: తెలంగాణలో రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. ఇవాళ(శనివారం) నల్లగొండలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణలో 17 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు మంత్రి పొన్నం ప్రభాకర్. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్‌కి వెళ్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. రాష్ట్రం వాహన సారథిలోకి ఎంట్రీ అయిందని చెప్పారు. వాహనాల ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్నీ వాహన సారథిలో చూసుకోవచ్చని తెలిపారు. ఏఐ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చేలా చేస్తున్నామని అన్నారు. యాక్సిడెంట్‌లు చేస్తే లైసెన్స్‌లు వెంటనే రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్, స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీ తీసుకువచ్చామని నొక్కిచెప్పారు. డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు వస్తున్నాయని%ౌ%అక్కడ ట్రైనింగ్ తీసుకున్న తర్వాతనే లైసెన్స్‌లు వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

**రిజర్వేషన్ల విషయంలో పొన్నం ప్రభాకర్ కొట్లాడారు: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి...** నల్గొండ జిల్లాలో రూ. 8 కోట్లతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇది తెలంగాణలోనే రెండవ ATS సెంటర్ అని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్‌లో కొట్లాడారని గుర్తుచేశారు. నిజాం కాలంలో మొదటి డిపో నార్కెట్‌పల్లి అని ఇప్పుడు 60 బస్సులు ఉన్నాయని.. ఇంకో 20 బస్సులు కావాలని సూచించారు. నల్లగొండ డిపోను నూతనంగా నిర్మించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## మరోసారి బీసీలని మోసం చేస్తున్న రేవంత్ సర్కార్.. లక్ష్మణ్ ఫైర్



ఢిల్లీ: బీసీలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి మోసం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్ ఆరోపించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో తీర్మానం చేయడం అంటే బీసీలను మరోసారి మోసగించడమేనని విమర్శించారు. ఇవాళ(శనివారం) ఢిల్లీ వేదికగా లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఆ బిల్లుపై ఏమి తేల్చకుండా ఆర్డినెన్స్ తీసుకురావడంలో ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి పూర్తి స్వేచ్ఛ ఆయా రాష్ట్రాలకు ఉందని నొక్కిచెప్పారు లక్ష్మణ్. రిజర్వేషన్లు కల్పించేందుకు ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఏ కులానికి సంబంధించిన జనాభా ఎంత ఉందో లెక్కలు తెలిస్తే న్యాయస్థానాల్లో వాదన నిలబడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లలో వివిధ కులాలకు సంబంధించిన గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బయట పెట్టడం లేదని నిలదీశారు. కులాలకు సంబంధించిన జనాభా ప్రామాణిక గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తే కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదన నిలబడే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బుర్ర వెంకటేశం ఆధ్వర్యంలో కమిషన్ బాధ్యతలను ఎందుకు సరిగ్గా నిర్వర్తించలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వివిధ కులాలకు సంబంధించిన ప్రామాణిక గణాంకాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు లక్ష్మణ్. 2021లో వికాస్ కిషన్‌రావు వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన కేసులో స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించినప్పుడు 50 శాతానికి మించకూడదనే నిబంధనను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాటించిందా అని నిలదీశారు. బీఆర్ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు రిజర్వేషన్ల పేరుతో బీసీలను గతంలో వంచించాయని మండిపడ్డారు. ఇప్పుడు ఇదేవిధంగా రేవంత్‌రెడ్డి బీసీలను దగా చేసి ఓట్లు దండుకొనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు లక్ష్మణ్. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిలపెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటి వరకు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో బీసీ డిక్లరేషన్‌కు సంబంధించిన కనీస ప్రస్తావన ఎందుకు చేయలేదని నిలదీశారు. సెప్టెంబర్‌లోపు బీసీ రిజర్వేషన్లను తేల్చాలని తెలంగాణ హై కోర్టు ఆదేశించిందని.. కాబట్టే ఎన్నికలు త్వరగా నిర్వహించి మరోసారి బీసీలని మోసం చేయడానికే రేవంత్‌రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని విమర్శించారు. రాష్ట్రపతి దగ్గర 42శాతం రిజర్వేషన్‌లకు సంబంధించిన బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఆర్డినెన్స్ తీసుకువస్తే.. ఆ బిల్లుకి గవర్నర్ ఎలా ఆమోదం తెలుపుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి కనీస ఇంగిత జ్ఞానం లేదని, బీసీల జీవితాలతో చెలగాటం ఆడుతూ వారిని రాజకీయ అస్త్రాలుగా మార్చుకునే ప్రయత్నం చేస్తోందని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సీఎం రేవంత్ రాష్ట్రంలో ఉండేది తక్కువ.. ఢిల్లీలో ఎక్కువ: కవిత ఫైర్



రంగారెడ్డి, జులై 12: జిల్లాలోని కేశంపేట మండలం కాకునూర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గృహలక్ష్మి పథకాన్ని వెంటనే ప్రారంభించాలంటూ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉండేది తక్కువని.. ఢిల్లీలోనే ఎక్కువగా ఉంటారని వ్యాఖ్యలు చేశారు. చదువుకునే విద్యార్థినులకు ఇస్తానన్న స్కూటీలు ఎక్కడ అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే ఆడపిల్ల పెళ్ళికి లక్ష నగదుతో పాటు తులం బంగారం అన్నారని.. ఈ 18 నెలల్లో ఎక్కడైనా ఇచ్చారా అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డికి కేసీఆర్ జపం చేయడం తప్ప పాలన తెలీదంటూ విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలల్లో మొత్తం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే ఉన్నారని అని ఆరోపించారు. సీఎం సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్‌లో అంబులెన్సులలో కనీసం డీజిల్ పోసే పరిస్థితి లేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే రెండు లక్షల కోట్ల అప్పు చేసిందని తెలిపారు. రేషన్ షాప్‌ల్లో ఇస్తున్న సన్న బియ్యంలో 50 శాతం దొడ్డు బియ్యమే అని నిరూపిస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరారు. ఫ్రీ బస్సు పేరున గ్రామాలకు బస్సులు తగ్గించారని ఫైర్ అయ్యారు. ఈ ప్రభుత్వం పని చేసే ప్రభుత్వం కాదని.. వెంటపడి పని చేయించుకోవాలని ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు చేశారు.



## బోనాల చెక్కుల పంపిణీలో బీఆర్ఎస్ VS కాంగ్రెస్ మధ్య తోపులాట

హైదరాబాద్, జులై 12: సికింద్రాబాద్‌లో బోనాల చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రొటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ముందే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోటా పోటీ నినాదాలు చేశారు. చెక్కులు పంపిణీ చేస్తుండగా స్టేజ్‌పై కరెంట్ కట్ చేశారు బీఆర్ఎస్ నేతలు. బీఆర్ఎస్ నేతల తీరుపై వేం నరేందర్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ప్రొటోకాల్ పేరుతో ఎమ్మెల్యే పద్మారావు వివాదం సృష్టిస్తున్నారంటూ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పద్మారావు, కాంగ్రెస్ ఇంఛార్జ్ సంతోష్ అనుచరుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పరస్పరం నినాదాలు చేసుకున్నారు. దీంతో సికింద్రాబాద్ కట్టమైసమ్మకు సంబంధించిన బోనాలు వేడుక చెక్కుల పంపిణీ వివాదాస్పదంగా మారింది. ప్రొటోకాల్ ప్రకారం అన్నీ జరిగాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ప్రొటోకాల్ కోసమే తప్ప ఎమ్మెల్యే అసలు తమకు అందుబాటులో ఉండటం లేదంటూ హస్తం నేతలు ఆందోళనకు దిగారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో వెంటనే పోలీసులు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలను చెదరగొట్టారు.

## కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా స్పష్టత ఉందా?: మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్: కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కీలకమైన ఈ నిర్ణయాలను అభినందించేందుకు కూడా భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. విపక్షాల తీరుపై విమర్శలు గుప్పించారు. "గతంలో ఎన్నో బిల్లుల విషయంలో భారత రాష్ట్ర సమితి.. భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చింది. బీసీలకు మేలు జరిగే నిర్ణయంపై మాత్రం కేసీఆర్ నోరు విప్పడం లేదు. కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్నట్లుగా విపక్షాల ధోరణి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఏనాడూ దృష్టి పెట్టలేదు. మేం సాధించిన రిజర్వేషన్ల పెంపును.. కవిత తన విజయంగా చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను మేము చేపట్టినప్పుడు కవిత జైలులో ఉన్నారు. తిహాడ్ జైలులో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారో చెప్పాలి. ఆమె మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటోంది. కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా స్పష్టత ఉందా?" అని ఎద్దేవా చేశారు.



## కుర్చీ దొరికితే వదలొద్దు..

బెంగళూరు: కర్ణాటకలో నాయకత్వ మార్పుపై ఊహాగానాలకు ఇప్పట్లో తెరపడేలా కనిపించడం లేదు. ఐదేళ్లూ సీఎంగా కొనసాగుతానంటూ సిద్ధరామయ్య పదేపదే చెబుతుండగా, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పరోక్షంగా సీఎం కుర్చీపై తనకున్న ఆశలను చెప్పకనే చెబుతున్నారు. బెంగళూరు అడ్వకేట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కేంపేగౌడ్ జయంతి ఉత్సవాల్లో డీకే శివకుమార్ తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కుర్చీ దొరికితే వదలొద్దు' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో పలువురు లాయర్లు సీట్లు ఖాళీగా ఉన్నా కూర్చోకపోవడాన్ని డీకే ప్రస్తావిస్తూ... 'ఇక్కడ చాలా మంది లాయర్లు సీట్లు ఖాళీగా ఉన్నా కూర్చోవడం లేదు. మేమంతా ఒక కుర్చీ కోసం తీవ్ర పోరాటాలు చేస్తుంటాం. కుర్చీ సంపాదించడం అంత సులభం కాదు. మీకు కూర్చునే అవకాశం వస్తే అందులో కూర్చోవాలి. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. కర్ణాటకలో అధికార పోరాటం అంశాన్ని డీకే నేరుగా ప్రస్తావించనప్పటికీ 'చైర్' అనే పదాన్ని సందర్భోచితంగా ప్రస్తావించడంతో ఆడిటోరియంలో నవ్వులు వెల్లివిరిసాయి. కర్ణాటకలో 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు అధికార పంపకాల విషయంలో సిద్ధరామయ్య, డీకే మధ్య ఒక అవగాహన కుదిరిందనే వాదన మొదట్నించీ వినిపిస్తోంది. మొదటి రెండున్నరేళ్లు సిద్ధరామయ్య సీఎంగా పగ్గాలు పట్టుకుంటే, తక్కిన రెండున్నరేళ్లు డీకే పగ్గాలు చేపడతారనేది ఆ ఒప్పందం. అయితే దీనిపై కాంగ్రెస్ పార్టీ అవునని కానీ కాదని కానీ ఇంతవరకూ తేల్చిచెప్పలేదు. దీనిపై సిద్ధరామయ్య గురువారంనాడు సూటిగా స్పందించారు. సీఎం సీటు ఖాళీగా లేదని, తాను ఐదేళ్లు అధికారంలో ఉంటానని తేల్చిచెప్పారు. నాయకత్వం అంశం అధిష్ఠానం వద్ద లేదని, అది పరిష్కారమైందని, కాంగ్రెస్ అధిష్ఠానం తనకు పూర్తి బాసటగా ఉందని చెప్పారు. ఢిల్లీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన డీకే సైతం సిద్ధరామయ్య వ్యాఖ్యలపై ఆచితూచి స్పందించారు. 'హైకమాండ్ ఏమి చెప్పిందో సిద్ధరామయ్య ఇప్పటికే చెప్పారు. మీ ప్రశ్నలన్నింటికీ ఆయన సమాధానమిచ్చారు' అని డీకే అన్నారు. తనకు ఎలాంటి తొందరా లేదని, మీరెందుకు తొందర పడుతున్నారని మీడియాను ప్రశ్నించారు.

చురకలు



# "మౌన శిలలు - మానవ నాగరికతకు మూలస్తంభాలు"

## - జూలై 13...అంతర్జాతీయ రాక్ దినోత్సవం




ఈ భూమి చరిత్రను అక్షరాలుగా వాచకంగా మోస్తూ, మౌనంగా పలికించే జీవన శిలలే రాళ్లు. ప్రకృతి వైవిధ్యానికి ఆధారంగా నిలిచే ఈ ఘన పదార్థాలు, భూమి ఆకృతిలో మౌలిక పాత్ర పోషించడమే కాక, మానవ నాగరికత నిర్మాణానికి మూల స్తంభాలుగా నిలిచాయి. ప్రతి సంవత్సరం జూలై 13న అంతర్జాతీయ రాక్ దినోత్సవంగా నిర్వహించబడే ఈ సందర్భంగా, శిలల ప్రాముఖ్యతను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించి, వాటి పరిరక్షణపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యం. రాళ్లు అనేవి కొన్ని లక్షల నుండి కోట్ల సంవత్సరాల భూగర్భ ప్రక్రియల ఫలితంగా ఏర్పడిన సహజ ఘన పదార్థాలు. ఇవి భూమి లోపల నుండి వెలువడిన లావా చల్ల బడడం, వాతావరణం కారణంగా వేరు చేయబడిన అవశేషాల సమాహారం, లేదా అధిక ఉష్ణోగ్రత, పీడనాల వల్ల తాలూకు రూపాంతరాలే. భౌగోళికంగా రాళ్లను మూడుగా విభజిస్తారు ౹ ఆగ్నేయ శిలలు, అవక్షేప శిలలు, రూపాంతర శిలలు ఈ శిలలు మనకు భూమి చరిత్రను పఠించ గలిగే ఆధారాలను అందిస్తాయి. శిలాజాల్లో దాగి ఉన్న పురాతన జీవరాశుల అవశేషాలు, శిలా చిత్రాలు, రాతి లిపులు మానవ పరిణామ క్రమానికి దృశ్య రూపంగా మారాయి. ఈ కారణంగా శిలాజ శాస్త్రం, భూగోళ శాస్త్రం, ఖనిజ శాస్త్రం వంటి అనేక శాస్త్రీయ శాఖల అభివృద్ధికి శిలలు ప్రాథమికంగా ఉపయోగ పడుతున్నాయి. నిర్మాణ రంగంలో శిలల ప్రాధాన్యత అత్యంత ప్రాచీనమైంది. హరప్పా, మోహెంజొదారో నుండి ఖజురాహో, ఎలోరా, మహాబలిపురం వరకు ౹ భారత దేశపు నిర్మాణ వారసత్వానికి శిలలే పునాది. ఆధునిక యుగంలోనూ గ్రానైట్, మార్బుల్, బసాల్ట్ వంటి శిలలు ఇళ్ల నిర్మాణం, వంతెనలు, రహదారులు, మెట్రో నిర్మాణాల్లో విస్తృతంగా వినియోగించ బడుతున్నాయి. ఒక అంచనా ప్రకారం, ప్రపంచ నిర్మాణ రంగంలో దాదాపు 60 శాతం వరకు ప్రకృతి శిలలు ఉపయోగించ బడుతున్నాయి. ఆర్థిక పరంగా శిలలతో కూడిన ఖనిజ సంపద ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగం. యునైటెడ్ స్టేట్స్ జియాలాజికల్ సర్వే గణాంకాల ప్రకారం, ప్రపంచ ఖనిజ మార్కెట్ విలువ సుమారు 1.5 ట్రిలియన్ డాలర్లు. భారత్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గనుల పరిశ్రమ విలువ ?1.8 లక్షల కోట్లుగా నమోదైంది. బంగారం, వెండి, వజ్రాలు, రత్నాలు వంటి విలువైన ఖనిజాల ఎగుమతులు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదాయం రూపంలో తీసుకు వస్తున్నాయి. పరిశ్రమలలో సిమెంట్, గాజు, సిరామిక్, స్టీల్ తయారీ వంటి రంగాల్లో శిలలు ముడి సరుకులుగా కీలకంగా ఉంటాయి. వ్యవసాయ రంగంలో సున్నపురాయి వంటి శిలలు నేల ఆమ్లత్వాన్ని తగ్గించడంతో పాటు నేల సారాన్ని మెరుగు పరుస్తాయి. పర్యావరణ పరంగా, శిలల పొరలు నీటి వడపోతను నియంత్రిస్తూ భూగర్భ జల నిల్వలకు సహాయ పడతాయి. ఇది నీటి భద్రతకు కూడా మూలాధారంగా మారుతోంది. శిలలు కేవలం భౌతిక వనరులుగా మాత్రమే కాక, కళా వారసత్వానికి ప్రతీకగా కూడా నిలుస్తున్నాయి. భారతదేశ శిల్ప కళలో శిలలపై చెక్కిన దేవతా విగ్రహాలు, శిలా రూపాలు, ఆలయ నిర్మాణాలు ప్రపంచ కళా రంగానికి గర్వకారణంగా నిలిచాయి. యునెస్కో గుర్తించిన వారసత్వ క్షేత్రాలలో చాలా శిలా నిర్మాణాలే. రత్న శిల్పం, శిలాజ చిత్రలేఖనం వంటి కళారూపాలు భారత దేశానికే ప్రత్యేకమైనవి. ఒక్కో రత్నం ఒక తాత్విక భావనను, ఒక నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. ఇటీవలి కాలంలో శిలల వినియోగం అనియంత్రితంగా పెరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 55 బిలియన్ మెట్రిక్ టన్నుల శిలలు తవ్వబడు తున్నాయి. ఇందులో అత్యధిక భాగం నిర్మాణ రంగం కోసం వినియోగించ బడుతోంది. ఈ విపరీత తవ్వకాలు భూమి వైవిధ్యాన్ని భంగపరిచే ప్రమాదం కలిగిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నియంత్రణలు లేవడం, అక్రమ మైనింగ్ పెరుగుతుండటం పర్యావరణాన్ని తీవ్రమైన ముప్పుకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ రాక్ దినోత్సవం మానవాళికి శిలా సంపదపై చైతన్యం కలిగించే సందేశంగా మారుతుంది. విద్యా సంస్థలు శిలాజాల ప్రదర్శనలు, వర్క్ షాప్‌లు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో శాస్త్రీయ దృష్టిని పెంపొందించ వచ్చు. పాలకులు శిలా పరిరక్షణకు నిబంధనల రూపకల్పన చేయడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు మద్దతు ఇవ్వాలి. ప్రపంచంలోని ఐస్‌లాండ్, ఆస్ట్రేలియా, అమెరికా వంటి దేశాల్లో ప్రకృతి శిలా నిర్మాణాలను రక్షిత జియోపార్కులుగా అభివృద్ధి చేస్తూ వాటిని విద్య, పర్యాటక కేంద్రాలుగా తీర్చి దిద్దుతున్నారు. భారత్ లోనూ ప్రస్తుతం రెండు గ్లోబల్ జియోపార్కుల ప్రాజెక్టులు యునెస్కో పర్యవేక్షణలో ప్రారంభ దశలో ఉన్నాయి. ఇవి భవిష్యత్తులో శిలా సంరక్షణకు ఆదర్శంగా మారే అవకాశం ఉంది. ఈ సమగ్ర దృష్టితో చూస్తే, శిలలు మన మౌలిక అస్తిత్వానికి మూలంగా ఉన్న శాశ్వత ఆధారాలే. అవి భూమి చరిత్రను తెలియజేసే మూగ వచనాలు, మన సంస్కృతికి ప్రతీకలు, మానవ అభివృద్ధికి మార్గదర్శకాలు. అంతర్జాతీయ రాక్ దినోత్సవం ఈ అర్థాలను గుండె నిండా గుర్తుచేసే సందర్భం. ఈ రోజును మనం ఒక పరివర్తనా దినంగా మార్చాలి - శిలలను కాపాడుదాం, అవగాహన పెంచుదాం, భవిష్యత్తును పరిరక్షిద్దాం. శిలలు... నిశ్శబ్దంగా మాట్లాడే భూమి జీవగాథలు. వాటిని అర్థం చేసుకుని, భవిష్యత్తు తరాలకు వినిపించేలా చేయడం మన బాధ్యత.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# 10 వేల జనాభా లేని దేశాలకు పర్యటనలా?... మోడీకి సెటైర్లు!



ప్రధాని మోడీ ఐదు దేశాల (ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా) పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఆయా దేశాల పార్లమెంట్లను ఉద్దేశించి ప్రసంగించారు. అయితే... మోడీ విదేశీ పర్యటనలపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలో పంజాబ్ సీఎం భగవంత్ మాన్.. ప్రధాని పర్యటనలపై కీలక వ్యాఖ్యలు చేశారు. అవును... ప్రధాని వరుస విదేశీ పర్యటనలపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇంటిని చక్కబెట్టుకోకుండా ఊరిని చక్కబెడతానన్నట్లుగా ప్రధాని వైఖరి ఉందనే అర్థం వచ్చేలా వారు విమర్శిస్తున్నారు! 140 కోట్ల మంది ప్రజలు ఉన్న భారతదేశాన్ని, ఇక్కడి సమస్యలను వదిలేసి.. కేవలం 10 వేల మంది జనాభా ఉన్న దేశాల్లో మోడీ పర్యటిస్తున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ సందర్భంగా స్పందించిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్... ప్రధాని ఘనా అని ఎక్కడికో వెళ్లారు.. స్వదేశానికి తిరిగివస్తున్న ఆయనకు స్వాగతం అని అన్నారు. ఈ నేపథ్యంలో... ప్రధాని ఏయే దేశాలకు వెళ్తున్నారో ఆ దేవుడికే తెలియాలని.. 140 కోట్ల మంది జనాభా ఉన్న దేశంలో ప్రధాని ఉండరు కానీ, పది వేల మంది జనాభా ఉన్న దేశాలను మాత్రం సందర్శిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. అక్కడ ఆయనకు అత్యున్నత అవార్డులు కూడా అందుతున్నాయని మాన్ వ్యాఖ్యానించారు. మరోవైపు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా మోడీ విదేశీ పర్యటనలపై విమర్శలు చేశారు. ఇందులో భాగంగా... ప్రధాని మరో పర్యటనకు వెళ్లేలోపు ఓ మూడు వారాలు మన దేశంలో ఉంటారేమో అంటూ.. ఇప్పుడైనా మణిపూర్ వెళ్లడానికి ఆయనకు తీరిక దొరుకుతుందో లేదో అంటూ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో పహల్గాం ఉగ్రదాడి దోషులను ఇప్పటివరకు న్యాయస్థానం ముందు ఎందుకు నిలబెట్టలేదో కూడా ఆయన సమీక్ష చేయొచ్చని అన్నారు. దీంతో.. ఈ కామెంట్లు వైరల్ గా మారుతున్నాయి. ఇంటిని చక్కబెట్టుకోవడం కూడా ముఖ్యమేగా అనే స్పందనలు వినిపిస్తున్నాయి. ఈ సమయంలో విదేశాంగ శాఖ స్పందించింది. ఇందులో భాగంగా... ప్రధాని విదేశీ పర్యటనలపై రాష్ట్రంలోని ఉన్నతస్థానంలో ఉన్న వ్యక్తి చేసిన వ్యాఖ్యలు తమ దృష్టికి వచ్చాయని మాన్ పేరును ప్రస్తావించకుండా పేర్కొంది. అవి పూర్తిగా బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని తెలిపింది. భారత్ తో స్నేహపూర్వకంగా మెలిగే దేశాలను తక్కువ చేసి మాట్లాడటం సబబు కాదని చెప్పుకొచ్చింది! కాగా... ప్రధాని మోడీ పర్యటించిన దేశాల జనాభాలు ఈ విధంగా ఉన్నాయి! ట్రినిడాడ్ అండ్ టొబాగో - 13.7 లక్షలు, నమీబియా - 27.7 లక్షలు, అర్జెంటీనా - 4.55 కోట్లు, ఘనా - 3.38 కోట్లు, బ్రెజిల్ - 21.11 కోట్లు.

# ఐటీ, రియల్ ఎస్టేట్ బూమ్‌తో ఈ జిల్లాకు వలసల వెల్లువ



రంగారెడ్డి జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతుండగా జిల్లా జనాభా గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్రంలో పారిశ్రామికంగా, రియల్ ఎస్టేట్ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో రంగారెడ్డి ముందు వరుసలో నిలుస్తోంది. ఇదే కారణంగా ఇక్కడ నివాసానికి వచ్చే వారి సంఖ్య కూడా ఎక్కువవుతోంది.

**2011 నుంచి ఇప్పటి దాకా జనాభా పెరుగుదల...** 2011 జనాభా లెక్కల ప్రకారం రంగారెడ్డి జిల్లాలో మొత్తం 24,46,265 మంది నివసించేవారు. వీరిలో 12,54,184 మంది పురుషులు కాగా, 11,92,081 మంది మహిళలు. కానీ ఆ తర్వాతి సంవత్సరాల్లో జిల్లా అభివృద్ధి చెందడం, ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల జనాభా విపరీతంగా పెరిగింది. 2023 నవంబర్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తాజా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 18 ఏళ్లు పైబడిన ఓటర్ల సంఖ్య ఏకంగా 35,23,219 కు చేరింది. ఇది చూసినప్పుడు మొత్తం జనాభా 48 లక్షల వరకు చేరిందని జనగణన నిపుణులు అంచనా వేస్తున్నారు.

**-వలసలతో వేగంగా పెరుగుతున్న జిల్లా...** హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న ఈ జిల్లాలో ఐటీ కంపెనీలు, పరిశ్రమలు పెరిగాయి. దీంతో ఉద్యోగ అవకాశాల కోసం రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు ఇక్కడకు వలస వస్తున్నారు. అంతేకాదు హౌసింగ్ ప్రాజెక్టులు, అపార్ట్‌మెంట్ల బూమ్ కారణంగా రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. ఇవన్నీ కలిసే జిల్లాలో జనాభా వేగంగా పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

**- నగరీకరణతో కొత్త డెవెలప్మెంట్...** రంగారెడ్డి జిల్లా కొన్ని ప్రాంతాలు ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి చేరగా మరికొన్ని పట్టణాలుగా రూపాంతరం చెందుతున్నా యి. రోడ్లు, ట్రాన్స్‌పోర్ట్, విద్యా, వైద్య రంగాల్లో అభివృద్ధి చూస్తుంటే, జనాభా పెరగడం సహజమనే చెప్పాలి. జనాభా పెరుగుదలతో జిల్లా అభివృద్ధి నిరూపితమవుతుంది. అయితే ఈ వేగం కొనసాగితే మౌలిక సదుపాయాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అందువల్ల పాలకులు ముందుగానే ప్రణాళికలు రచించి, మౌలిక వసతులను మెరుగుపరచాలి. కానీ ఒక సంగతి మాత్రం స్పష్టంగా చెప్పవచ్చు రంగారెడ్డి జిల్లాకు "తగ్గేదేలే!" అన్నట్టుగా దూసుకుపోతోంది..

# వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థిక వ్యవస్థను ఐసీయూలోకి తీసుకొచ్చాం: మంత్రి నిమ్మల




పాలకొల్లు: వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఐసీయూలోకి తీసుకొచ్చామని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వ్యవసాయశాఖను నిర్వీర్యం చేశారని విమర్శించారు.

కష్టపడి పండించిన పంట విలువ జగన్‌కు ఏం తెలుసు?అని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సూపర్ సిక్స్ హామీలు నెరవేరుస్తున్నామన్నారు.

# న్యూడ్ క్రూయిజ్ షిప్ జర్నీ న్యూడ్ గా వారం పాటు ఎంజాయ్?

మియామీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ప్రసిద్ధ "న్యూడ్ క్రూయిజ్" ఇప్పుడు కరీబియన్ దీవుల వైపు తన సాహసోపేత ప్రయాణాన్ని ప్రారంభించింది. ఈ వినూత్న ప్రయాణంలో పాలుపంచుకోవడానికి మీకు కావలసింది దుస్తులు కాదు.. కేవలం ధైర్యం, ఆత్మవిశ్వాసం మాత్రమే! బేర్ నెసెసిటీస్ అనే సంస్థ ఈ ప్రత్యేకమైన క్రూయిజ్‌ను నిర్వహిస్తుంది. ఇది ప్రతి సంవత్సరం జరిగే అతిపెద్ద, పెద్దల కోసం మాత్రమే ఉద్దేశించిన విహారయాత్రల్లో ఒకటి. ఈ క్రూయిజ్ యొక్క ప్రధాన ప్రత్యేకత ఏమిటంటే.. ఇది "క్లోథింగ్-ఆప్షనల్" (వస్త్రధారణ తప్పనిసరి కానిది).

అంటే మీరు పూర్తిగా న్యూడ్‌గా అయినా ఉండొచ్చు, లేదా స్వల్పంగా వస్త్రాలు ధరించినా సరే, ఇది పూర్తిగా మీ వ్యక్తిగత స్వేచ్ఛపై ఆధారపడి ఉంటుంది. ఈ క్రూయిజ్‌లో ప్రయాణీకులు ఒక వారం పాటు అపరిమితమైన స్వేచ్ఛా వాతావరణంలో విశ్రాంతి తీసుకోవచ్చు, వినోదించవచ్చు. సూర్యరశ్మిని ఆస్వాదించవచ్చు. సముద్ర తీరాల వద్ద న్యూడ్ ఫ్రెండ్లీ ఎక్స్కర్షన్లు, పూల్ సైడ్ పార్టీలు, ఉత్సాహభరితమైన డాన్సింగ్ ఈవెంట్‌లు, ప్రత్యేక ప్రదర్శనలు.. ఇలా ఎన్నో ఆహ్లాదకరమైన



కార్యక్రమాలు ఈ ప్రయాణంలో భాగంగా ఉంటాయి. ఇది కేవలం సాధారణ సెలవులు మాత్రమే కాదు. ఇది మీ శరీరాన్ని దాని సహజ రూపంలో స్వీకరించడంలో, మనసులోని అన్ని అడ్డంకులను అధిగమించడంలో ఒక సాహసిక యాత్ర. బహుశా, ఈ ప్రయాణం తర్వాత "స్వేచ్ఛ అంటే ఏమిటి?" అనే ప్రశ్నకు మీకు సరికొత్త అర్థం లభించవచ్చు. కాబట్టి మీ బట్టల బ్యాగులు ప్యాక్ చేయాల్సిన పనిలేదు! ఒక చిన్న హ్యాండ్‌బ్యాగ్, సన్‌స్క్రీన్, బోలెడంత స్వేచ్ఛ, ధైర్యం తీసుకుంటే చాలు. అపరిమితమైన ఈ న్యూడ్ క్రూయిజ్‌కు స్వాగతం! ముఖ్య గమనిక: ఇది పూర్తిగా 18 సంవత్సరాలు నిండిన వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేయబడిన ప్రయాణం.

అన్ని భద్రతా మార్గదర్శకాలను పాటిస్తూ, ప్రతి ఒక్కరి హద్దులను గౌరవించడమే ఇందులో ప్రధాన ఉద్దేశ్యం.

# రూ.1.8 కోట్లతో మరణాన్ని మోసం చెయ్యొచ్చంట... ఎలాగో తెలుసా?

ఒక వ్యక్తి చనిపోయిన తర్వత మళ్లీ బ్రతకడం సాధ్యమేనా? ఒకటి రెండు సందర్భాల్లో గుండె ఆగిపోయిన కొన్ని నిమిషాల తర్వాత మళ్లీ బ్రతికారంటూ ఒకటి రెండు సంఘటనలు వినిపించినా.. పూర్తిగా మరణించిన రోజుల తర్వాత మళ్లీ బ్రతకడం సాధ్యమేనా? ఈ సమయంలో... మాగ్జిమం జనాలు చెప్పే సమాధానానికి భిన్నమైన సమాధానం చెబుతోంది జర్మన్ కు చెందిన స్టార్టప్ కంపెనీ! అవును... చనిపోయినప్పటికీ తిరిగి బతికించే అవకాశం కల్పిస్తానంటోంది జర్మన్ స్టార్టప్ కంపెనీ టుమారో బయో. వ్యక్తి చనిపోయిన తర్వాత వారి శరీరం, మెదడును క్రయోఫ్రీజరేషన్ ల్యాబ్ లో -196 డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో భద్రపరచడంతో ఇది సాధ్యమవుతుందని అంటున్నారు. మాజీ క్యాన్సర్ పరిశోధకుడు డాక్టర్ ఎమిల్ కెండ్జియోరా, ఇంజనీర్ ఫెర్నాండో అజెవెడో పిన్హీరో స్థాపించిన ఈ కంపెనీ.. చట్టబద్ధమైన మరణం తర్వాత అతి తక్కువ ఉష్ణోగ్రతల వద్ద నిల్వ చేయాలని



ఎంచుకునే వ్యక్తుల కోసం దీర్ఘకాలిక క్రయోప్రెజర్వేషన్ సేవలను అందిస్తుంది. అది ఎప్పటివరకూ అంటే... భవిష్యత్తులో మెడికల్ టెక్నాలజీ అభివృద్ధి చెంది జీవ పునరుద్ధరణకు అవకాశం కలిగే వరకూ! దీనికి సంబంధించి ధరల పట్టిక కూడా విడుదలై ఉంది. ఇందులో భాగంగా.. పూర్తి శరీరాన్ని ఫ్రీజర్ చేయాలంటే 2 లక్షల డాలరు (సుమారు రూ.1.8 కోట్లు) కాగా.. మెదడుకు 78వేల డాలర్లు (సుమారు రూ.67.2 లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది! ఈ సందర్భంగా స్పందించిన డాక్టర్ ఎమిల్ కెండ్జియోరా... కంపెనీ ఇప్పటివరకూ 20 మానవ మృతదేహాలను, 10 పెంపుడు జంతువులను క్రయోప్రిజర్వ్ చేసినట్లు తెలిపారు. అంతేకాదు.. ఇప్పటివరకూ సుమారు 800 కంటే ఎక్కువ మంది సైన్ అప్ చేశారు! ఇదే సమయంలో... అమెరికా, యూరప్ అంతటా 1,000 మంది సైన్ అప్ లను చేరుకునే దిశగా ముందుకు కదులుతున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో... ఎలుకలలో అవయవ పునరుజ్జీవనానికి కొన్ని ఆధారాలు కూడా ఉన్నాయని కెండ్జియోరా అన్నారు. 2023లో యూనివర్శిటీ ఆఫ్ మిన్నెసోటా ట్విన్ సిటీస్ పరిశోధకులు ఎలుక మూత్రపిండాలను క్రయోజెనిక్ గా సుమారు 100 రోజులు నిల్వ చేసి.. వాటిని తిరిగి వేడి చేసి, క్రయోప్రొటెక్టివ్ ద్రవాలను తొలగించి, వాటిని తిరిగి ఐదు ఎలుకలలోకి మార్పిడి చేయగా.. 30 రోజుల్లోపు అవి పూర్తి పనితీరు కనబరిచాయని తెలిపారు!

చురకలు

## సంపాదకీయం

### 'డీకే'కు ఎసరు పెడుతోన్న సీఎం సిద్ధరామయ్య

కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య కొనసాగుతున్న కోల్డ్ వార్ తదుపరి దశకు చేరినట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. తాజాగా డీకే శివకుమార్‌ను పీసీసీ (ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ) అధ్యక్ష పదవి నుంచి తప్పించేందుకు సిద్ధరామయ్య వర్గం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

**–అధిష్ఠానాన్ని ఒప్పించే ప్రయత్నాలు...** సిద్ధరామయ్య శిబిరం ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గేతో కీలక సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో డీకే శివకుమార్‌ను పీసీసీ చీఫ్ పదవి నుంచి తొలగించి, కొత్త నేతను నియమించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పబ్లిక్ వర్క్స్ మంత్రిగా ఉన్న సీనియర్ ఎస్టీ నేత సతీష్ జార్కిహోళి పేరును ఆ స్థానానికి సిఫార్సు చేశారు. కర్ణాటకలో ఎస్టీ ఓట్ల ప్రాధాన్య తను దృష్టిలో ఉంచుకొని జార్కిహోళిని ప్రొజెక్ట్ చేయాలని సిద్ధరామయ్య వర్గం భావిస్తోంది.

**"ఒకరికి ఒక పదవి" సూత్రంపై వాదన...** "ఒకరికి ఒకే పదవి" అనే కాంగ్రెస్ పార్టీ నియమాన్ని పునరుద్ఘాటిస్తూ డీకే శివకుమార్ ఇప్పటికే రెండు కీలక పదవులు ఉపముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ చేపట్టిన నేపథ్యంలో ఆయనను పీసీసీ చీఫ్ పదవి నుంచి తప్పించాలని సీఎం వర్గం బలంగా వాదిస్తోంది. ఒకవేళ జార్కిహోళికి పీసీసీ పదవి ఇస్తే, మంత్రి పదవిని వదులుకోవాలని ఆయనను ఒప్పించినట్లు కూడా తెలుస్తోంది.

**– డీకే అధికారాలకు కత్తెర వేయాలనే వ్యూహం...** డీకే శివకుమార్ పార్టీ అధ్యక్షుడిగా తన మద్దతుదారులుగా ఉన్న ఎమ్మెల్యేలను స్వతంత్రంగా ప్రభావితం చేయకుండా నియంత్రించేందుకు ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి. పార్టీ వ్యవస్థపై ఆయన ఆధిపత్యాన్ని తగ్గించే దిశగా సీఎం వర్గం వ్యూహరచన చేస్తోంది. ఈ మార్పులు ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో అమలయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి.

**–విభేదాల తారాస్థాయికి...** ముఖ్యమంత్రి పదవిని డీకే శివకుమార్‌కు ఇవ్వాలన్న వాదన, సిద్ధరామయ్య వైఖరితో తీవ్రంగా విభేదిస్తోంది. దీంతో, ఇద్దరు నేతల మధ్య అంతర్గత విభేదాలు పార్టీలో తీవ్ర రూపం దాల్చాయి. ఈ నేపథ్యంలో, వచ్చే లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీలో నాయకుల సమన్వయం లోపించే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలు డీకే శివకుమార్ రాజకీయ భవిష్యత్‌పై ఎంతమేర ప్రభావం చూపుతాయో చూడాలి. అధిష్ఠానం చివరికి ఎవరి వాదనను అంగీకరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పులు నిజంగానే జరుగుతాయా లేక ఇది కేవలం ఒత్తిడి రాజకీయమా అన్నది త్వరలోనే స్పష్టమవుతుంది.

# భూదానోద్యమ ఆద్యుడు రామచంద్రారెడ్డి - జూలై 13...వెదిరె రామచంద్రారెడ్డి జయంతి

భూమి కోసం జరిగిన భూ పోరాటాలు ప్రపంచ చరిత్రలో ఎన్నో ఉన్నాయి. పోరాటమే లేకుండా, రక్తపు బొట్టు చిందకుండా 58 లక్షల ఎకరాల భూమి పేద ప్రజలకు అంద జేయడం ఒక మహా అద్భుతం. 1951 సంవత్సరంలో గాంధీజీ ప్రియశిష్యుడైన ఆచార్య వినోబాభావే నేతృత్వంలో భూదాన్ ఉద్యమం మహా యజ్ఞంగా సాగింది. పోచంపల్లి భూదాన్ ఉద్యమానికి భూ పంపిణీకి స్ఫూర్తినిచ్చింది తెలంగాణకు చెందిన సామాజిక కార్యకర్త వెదిరె రామచంద్రా రెడ్డి. 1951, ఏప్రిల్ 18న పోచంపల్లి నుంచే ఆచార్య వినోబాభావే భూదాన్ ఉద్యమం ప్రారంభిం చారు. ఆయన చేపట్టిన పాదయాత్ర దేశంలో ఓ కొత్త శకానికి నాంది పలికింది. పోచంపల్లి వేదికగా నిలిచింది.

వినోబాభావే పిలుపుతో ఈ గ్రామానికి చెందిన వెదిరె రామచంద్రారెడ్డి హరిజనులకు తనకున్న వంద ఎకరాల భూమిని పంచేశారు. 14 ఏళ్ల పాటు దాదాపు 70వేల కిలోమీటర్లు కాలినడకన తిరిగి లక్షల ఎకరాల భూమిని సేకరించి రైతులకు పంచిన వినోబా భావే అడగగానే తొట్ట తొలి భూ దాతగా 100 ఎకరాల భూమిని పోచంపల్లికి చెందిన వెదిరె రామచంద్రారెడ్డి పేదలకు దానంగా ఇవ్వడం చరిత్రలో మరిచి పోలేని జ్ఞాపకం. వెదిరె రామచంద్రారెడ్డి (1905, జూలై 13 – 1986, డిసెంబరు 9) 1905, జూలై 13న నరసారెడ్డి – లక్ష్మి నరసమ్మ దంపతులకు తెలంగాణ రాష్ట్రం, యాదాద్రి భువనగిరి జిల్లా, పోచంపల్లిలో జన్మించాడు. 1935 – 1938 మధ్య కాలంలో పూణేలోని ఫెర్గూసన్ లా కాలేజీలో తన లా/బారిస్టర్ శిక్షణ పూర్తి చేశాడు. కొన్ని సంవత్సరాలు న్యాయవాద వృత్తిని చేపట్టి, తరువాత రాజీనామా చేసి, సంఘ సంస్కరణలో క్రియా శీలక పాత్ర పోషించాడు. రామచంద్రారెడ్డి చెల్లెలు సీతాదేవిని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి, వివాహం చేసుకున్నాడు. మహాత్మా గాంధీ మార్గదర్శకత్వంలో ఆచార్య వినోభా భావే 1951 ఏప్రిల్ 18 న పోచంపల్లి గ్రామానికి వచ్చి, అక్కడ భూదాన ఉద్యమాన్ని ప్రారంభించాడు. వినోభా భావే తొలి ప్రయత్నంగా రామచంద్రారెడ్డిని కలిసి భూమిని దానం చేయమని అభ్యర్థించగా, ఆయన వెంటనే స్పందించి తన తండ్రి నరసారెడ్డి జ్ఞాపకార్థం వందెకరాల భూమిని దానంగా ఇవ్వడానికి అంగీకరించాడు. ఈ గొప్ప త్యాగం భూదాన ఉద్యమానికి స్ఫూర్తిని ఇచ్చింది.



పోచంపల్లి గ్రామాన్ని భూదాన పోచంపల్లిగా నామాంకితను చేసింది. భూదాన ఉద్యమంలో మొట్టమొదటగా తన భూమిని దానం చేసినందుకు భూదాన్ అనే బిరుదును అందు కున్నాడు. అలా భూమిని దానంగా ఇచ్చి 'భూదాన్' రామచంద్రారెడ్డిగా చరిత్ర పుటల్లో వారు నిలిచిపోయాడు. రామచంద్రారెడ్డి 1986, డిసెంబరు 9న మరణించాడు. 2022 జూలై 17న రామ చంద్రారెడ్డి పేరు, ఫోటోతో పోస్టల్ కవర్ విడుదల చేయడం, రామచంద్రారెడ్డి జీవిత కథతో సినిమా తెరకెక్కిం చేందుకు రామచంద్రారెడ్డి మనవడు అరవింద్ రెడ్డి సమర్పణలో అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి నిర్మాతగా, దర్శకుడు నీలకంఠ దర్శకత్వంలో చిత్రాన్ని రూపొందించడం, ఆయన జీవిత చరిత్ర ఆధారంగా బయోపిక్ తీయడం నిజంగా ఆ భూ దాతకు లభించిన నిజమైన గౌరవం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# గుత్తి కథలు - అభ్యుదయ కథా సాహిత్యానికి మూల స్తంభాలు - జూలై 13... గుత్తి రామకృష్ణ జయంతి



తెలుగు సాహిత్య చరిత్రలో, ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో సామాజిక స్పందనను కేంద్రంగా చేసుకొని రచనా ధోరణిని అలవరచుకున్న అరుదైన రచయితల్లో గుత్తి రామకృష్ణ ప్రముఖులు. ఆయన ఒక కథకుడి గానే కాకుండా, పాత్రికేయుడు, ఉద్యమ కారుడిగా ప్రజల జీవితాల్లో మమేకమైన వ్యక్తి. కమ్యూనిస్టు ఆలోచనలకు ఆకర్షితుడై, రాయలసీమ ప్రాంతంలోని అణగారిన వర్గాల సంక్షేమాన్ని రచనల ద్వారా నిగూఢంగా ప్రతిబింబించిన ఆయన్ను అభ్యుదయ కథకుల కాంతివంతమైన ప్రదీప్తిగా పరిగణించ వచ్చు. గుత్తి రామకృష్ణ 1915, జూలై 13న అనంతపురం పాత వూరులో గుత్తి వెంకటప్ప, నారాయణమ్మ దంపతులకు జన్మించారు. ఆయన బాల్యం, విద్యాభ్యాసంపై విస్తృత సమాచారం లభించక పోయినా, ఆయన రచనలు, ఉద్యమాలలో పాల్గొనడం ద్వారా సమాజంపై ఆయనకు ఉన్న అవగాహన, బాధ్యత స్పష్టమవుతుంది. కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల ఆసక్తి, రాయలసీమలో పార్టీని స్థాపించడంలో పాల్గొనడం – ఇవన్నీ ఆయనలో ఉన్న సామాజిక స్పృహకు నిదర్శనం. ఆయన పాత్రికేయుడిగా చేసిన సేవలు, ఆ కాలంలో విలక్షణంగా నిలిచాయి. పత్రికా రచన ద్వారా ప్రజలలో చైతన్యం సృష్టించాలన్న తపన ఆయనకు ఉన్నది. ఆయన వ్రాసిన వ్యాసాలు సామాజిక అసమానతలపై ధీటుగా వ్యాఖ్యానించేవి. అన్యాయాలను విమర్శించడంలో, ప్రజల పక్షాన నిలవడంలో ఆయన నిబద్ధత స్పష్టంగా కనిపించేది. స్వాతంత్ర్యానికి పూర్వమే బ్రిటీష్ హయాంలోనే స్వతంత్ర భారత్, ఆకాశవాణి పత్రికలకు జిల్లా సమస్యల గురించి వ్యాసాలు, వార్తలు వ్రాస్తూ ప్రజా సమస్యలను ప్రతిబింబింప జేసేవాడు. ప్రజాశక్తి, విశాలాంధ్ర, దక్కన్ క్రానికల్, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ఈనాడు, జనశక్తి, ఉజ్వల, జనత మొదలైన పత్రికలకు తొలి విలేఖరిగా దాదాపు 70 సంవత్సరాలు పత్రికా విలేఖరిగా పనిచేశారు. భారత బంజార సంఘం ప్రోత్సాహంతో బంజారా పత్రికను అనంతపురం నుండి రెండేళ్లపాటు సంపాదకుడిగా ఉండి నడిపారు. జనప్రభ దినపత్రికకు కూడా సంపాదకుడిగా పనిచేశారు.స్వరాజ్య దీపిక, రాయలసీమ జాగృతి వంటి ముఖ్య తెలుగు పత్రికల్లో కూడా ఆయన రచనలు ప్రాచుర్యం పొందినవి. కథకుడిగా గుత్తి రామకృష్ణ చేసిన కృషి తెలుగు సాహిత్యానికి ఒక కొత్త దిశను చూపింది. ముఖ్యంగా రాయలసీమ గ్రామీణ జీవితం, ప్రజల కష్టనష్టాలు, వలసలు, ఆకలి తెగులు వంటి అంశాలు ఆయన కథల్లో ప్రధానంగా దృశ్యమాన మవుతాయి. ఆయన కథల్లో రాయలసీమ మాండలిక భాష, సామాజిక పరిస్థితుల చిత్తశుద్ధి ప్రతిబింబించేవి. హాస్యాన్ని ఆధారంగా చేసుకుని వ్యంగ్యాన్ని బలంగా ఉపయోగించి, తీవ్రమైన విషయాలపై పాఠకుల దృష్టిని సారించ గలిగారు. గుత్తి రామకృష్ణ తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా రాయలసీమలో, అభ్యుదయ భావజాల కథలకు దారితీసిన మార్గదర్శి రచయిత. ఆయన రాసిన కథలు, వ్యాసాలు అప్పటిదాకా కథలో కనిపించని శ్రమజీవుల జీవితాలను, సామాజిక అసమానతలను, వ్యవస్థ పట్ల తిరుగుబాటు ధోరణిని తీసుకు వచ్చాయి. ఇది ఆయన తరాన్ని దాటి, తరువాతి తరపు రచయితలపై స్థిరమైన ప్రభావాన్ని చూపింది. గుత్తి కథలు రాయలసీమను ఒక కథా సాహిత్య పీఠంగా తీర్చిదిద్దాయి. అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో రచనా అభిరుచితో ఉన్న యువతలో సామాజిక చైతన్యం కలిగించాయి. ముఖ్యంగా గ్రామీణ జీవితం, శ్రమజీవుల సమస్యలు, కులవ్యవస్థపై విమర్శాత్మక దృష్టితో కథ రాయాల్సిన అవసరాన్ని గుత్తి కథలే నేర్పాయి. ఆయన రాసిన కథా సంపుటుల్లో "వలస బాట", "సీతమ్మ వీధిలో", "చీకటి రేఖ" ప్రత్యేక ప్రాధాన్యం గలవిగా నిలిచాయి. "వలస బాట"లో వలస కూలీల బాధలను మానవీయ కోణంలో ఆవిష్కరించారు. "సీతమ్మ వీధిలో" సామాజిక అసమానతలపై ధీటుగా వ్రాసిన కథలు పొందు పరిచారు. "చీకటి రేఖ" వంటి రచనల్లో రాజకీయ అవగాహన, శాసన సభల పై విమర్శాత్మక దృష్టి కనిపిస్తుంది. ఆయన కథల్లో మానవతా భావన, సామాజిక చైతన్యం, నైతిక విలువలపై నమ్మకం ప్రధానంగా ప్రతిఫలించాయి. అవి నాటకీయ సంభాషణలు కాని, అలంకారాలు కాని కాకుండా – జీవితం పట్ల ఆయనకున్న అవగాహన, ప్రజల పట్ల ఉన్న ప్రేమ ప్రతిబింబించేవిగా ఉన్నాయి. వ్యాసకర్తగా ఆయన్ని విశ్లేషించినప్పుడు, ఆయన రచనల్లో భాష సరళంగా ఉంటూ కూడా భావంలో తీవ్రత కలిగి ఉంటుంది. ఆయన వ్యాసాల శైలి విమర్శాత్మకంగా ఉండేను గానీ, వ్యక్తిగత దూషణలకు దూరంగా, సామాజిక న్యాయంపై నిలబడేలా సాగుతుంది. వ్యంగ్యం ఆయన రచనా శైలిలో ప్రధాన సాధనం. ఆనాటి పాలకవర్గాలపై ప్రశ్నలు విసురుతూ, ప్రజల పక్షాన నిలిచే ధైర్యాన్ని ఆయన రచనలు కలిగి ఉండేవి. గుత్తి కథలు సాహిత్యవేత్తలకే కాక, సామాజిక శాస్త్రవేత్తలకు, చరిత్రకారులకు విలువైన పాఠ్య సామగ్రిగా నిలుస్తాయి. శిల్ప పరంగా కాకపోయినా, వాటిలోని జీవం, వాస్తవికత, అభ్యుదయ దృక్పథం వాటిని మేటి కథలుగా నిలబెట్టాయి. కమ్యూనిస్టు భావజాలాన్ని కథా వస్తువుగా మలచిన తొలి తరం కథకుల్లో ఆయన ప్రాముఖ్యం ప్రత్యేకమైనది. 2009, మే 12వ తేదీన ఆయన మృతి చెందినా, ఆయన రచనలు కాలపరిమితిని దాటి సమకాలీనతను పొందినవిగా ఉన్నాయి. ఆయన సాహిత్యం, పాత్రికేయ సేవలు, ఉద్యమాల పట్ల చూపిన నిబద్ధత భావితరాలకు ప్రేరణగా నిలుస్తాయి. కథను ఉద్యమంగా మలిచిన రచయితగా గుత్తి రామకృష్ణ పేరు తెలుగు సాహిత్య చరిత్రలో పదిలంగా నిలిచి పోతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# "100 సీట్లు మావే..." మూడు పార్టీల నోట అదే పాట

తెలంగాణ రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కింది. రాబోయే శాసనసభ ఎన్నికల కోసం మూడేళ్ల ముందు నుండే మూడు ప్రధాన రాజకీయ శక్తులు — కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ — ఒకే రాగాన్ని ఆలపిస్తున్నాయి: "100 సీట్లు మావే!". అసలు 119 స్థానాలున్న రాష్ట్రంలో ముగ్గురూ మెజారిటీ సాధిస్తామంటూ ధీమాగా ప్రకటించడమంటే ప్రజలను ప్రభావితం చేయాలన్న ప్రయత్నమా? లేక వాస్తవ రాజకీయ శక్తిని చూపించే వ్యూహమా? ఇప్పుడు ప్రధాన ప్రశ్న అదే. అయితే ఇది ఇక 119 సీట్లే గల రాష్ట్రం కాదు. ఓటర్ల సంఖ్య పెరగడం, నియోజక వర్గాల మధ్య జనాభా అసమతుల్యత, రాజ్యాంగం లోని 2002 మూడవ షెడ్యూల్ (84వ సవరణ) ప్రకారం (2002లో 84వ రాజ్యాంగ సవరణ ద్వారా, 2001 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ మరియు అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను 2026 వరకు స్తంభింప జేయ బడింది) 2026 తరువాత జనాభా లెక్కల ఆధారంగా తిరిగి నియోజక వర్గాల పునర్విభజన జరగవచ్చున్న అంచనాల నేపథ్యంలో తెలంగాణలో 153 నియోజకవర్గాలు ఉండే అవకాశంపైనే చర్చ మొదలైంది. కొన్ని అధికార పార్టీ నేతల ప్రకటనల ప్రకారం ఈ దిశగా కేంద్రం కూడా ఆలోచిస్తోందన్న సంకేతాలున్నాయి. 34 కొత్త నియోజకవర్గాలు వస్తే, సీట్ల సంఖ్యను దాటి అధిక మెజారిటీ సాధించడం రాజకీయ శక్తులకు మరింత ప్రాధాన్యం పొందిన లక్ష్యంగా మారుతుంది. ఈ నేపథ్యంలో "100 సీట్లు మావే" అన్న మాట ఒకప్పుడు ఊహా గానంగా కనిపించినా — ఇప్పుడు అనేక పార్టీలు తమ రాజకీయ వ్యూహాల ఆధారంగా వాస్తవంగా తలపోస్తున్న అంచనాలుగా మారింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఇది మొదటి ప్రభుత్వం. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చెదరగొట్టి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం, యవతను ఆకర్షించే శైలితో పాలన సాగిస్తోంది. బడ్జెట్ పరిమితులు, కేంద్ర మద్దతు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ, హామీల అమలు విషయంలో మొదటి ఏడాదిలోనే స్పష్టమైన సంకేతాలు ఇవ్వాలని ప్రయత్నిస్తోంది. పాఠశాలల పునర్నిర్మాణం (మనా ఊరు%-%మన బడి), విద్యుత్ సరఫరా, రైతు రుణమాఫీ, రైతు బందు మొదలైన వాటి అమలు ప్రారంభ దశలో ఉంది. అయితే గ్రామీణ స్థాయిలో పరిపాలన యంత్రాంగం సజావుగా నడవక పోవడం, రాజకీయ పదవుల నియామకాల్లో అసమతుల్యత — వీటిపై అసంతృప్తి కూడా ఉంది. అన్నింటినీ మించి వివిధ జిల్లాలలో నేతల మధ్య ఆధిపత్య పోరు, అంతర్గత అసమ్మతులు, అసంతృప్తులు రాష్ట్ర నాయకత్వానికి మింగుడు పడని అంశాలుగా మారాయి.అయినప్పటికీ, కాంగ్రెస్‌కు లభించిన ప్రజాదరణ రాజకీయంగా మరింత గట్టి పడాలంటే — అభివృద్ధి, సంక్షేమం, నియామకాల విషయంలో నిర్దిష్టత, పారదర్శకత ఉండాలి. అలాంటి ఫలితాలు కనబడితే — రాబోయే 153 సీట్లపై 100కు పైగా గెలుపు" అనే ధైర్యానికి వచ్చే ఆశావాదం ఉంది. మరోవైపు, ఓటమిని ఎదుర్కొని మళ్లీ దూకుడు పంథా లోకి దిగిన బీఆర్ఎస్ పార్టీకి ఇది ఓగొప్ప ఆత్మ పరిశీలనా దశ. రాష్ట్రం ఆవిర్భవానికి కారక శక్తిగా గుర్తింపు పొందిన ఈ పార్టీ, 2014, 2018లో ఘన విజయాల తరువాత 2023లో అధికారాన్ని కోల్పోయింది. ఎన్నికల సమయంలో "మళ్లీ మేమే" అని చెప్పిన పార్టీ అధినేతకు ఈ ఫలితాలు తీవ్రమైన వ్యక్తిగత, రాజకీయ ఎదురుదెబ్బ. అధినేత తనయ జైలు పాలు కావడం, కేసీఆర్, కెటిఆర్, హరీశ్ రావులపై విచారణల పర్వాలు భారసాను నిత్యం కలవర పెడుతున్న అంశాలు. వీటికి ప్రతిస్పందనగా పార్టీలో నేతల మధ్య స్థాయిని మళ్లీ నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా — గ్రామీణ స్థాయిలో ప్రజల్లో విస్తరించిన అసంతృప్తిని పరిష్కరించడమే ప్రధాన కర్తవ్యంగా మారింది. పునర్నిర్మాణంలో కేటీఆర్, హరీష్ రావు వంటి యువ నాయకత్వం పార్టీని నూతన దిశగా నడిపించాలనే శ్రమిస్తోంది. ఇది పూర్తిగా కార్యాచరణగా మారితే — బీఆర్ఎస్ మరోసారి ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉంది. పైగా, పునర్విభజన వల్ల కొత్త నియోజకవర్గాల రాకతో గ్రామీణ ప్రాబల్యాన్ని మళ్ళీ సంపాదించేందుకు బీఆర్ఎస్‌కు అవకాశం ఉంటుంది. అయితే ప్రజల్లో మళ్లీ విశ్వాసం పొందాలంటే, గత పాలన వైఫల్యాలపై స్పష్టమైన సమీక్ష, మార్పు ఉండాలి. లేకపోతే, "100 సీట్లు మాదే" అన్న నినాదం క్యాడర్ స్థాయిలో వినిపించినా, ఓటర్లను మోసగించ దగిన వాస్తవం కాదు. ఇక బీజేపీ విషయానికొస్తే, రాష్ట్రంలో ఇప్పటికీ ప్రాథమిక స్థాయిలో స్థిరమైన సామాజిక బలముండక పోవడం, నాయకత్వ నిర్దిష్టత లేకపోవడం సమస్యలు కావచ్చు. అయినా పార్టీ భావోద్వేగంతో నడుస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న స్థాయి, మోదీ నేతృత్వానికి ఉన్న ప్రజాదరణ, హిందుత్వ గణనీయత వంటి అంశాలతో రాష్ట్రంలో ప్రజా మద్దతు పొందే ప్రయత్నం కొనసాగుతోంది. మున్సిపల్, లోకసభ ఎన్నికలు, రాష్ట్ర శాసనసభ సాధారణ, ఉప ఎన్నికలు వంటి వాటిలో అనుకోని విజయాలతో పార్టీ ఆశావాదం పెరిగింది. బండి సంజయ్, ఈటల రాజేందర్, కిషన్ రెడ్డి, ధర్మపురి అరవింద్ వంటి నేతల, రాష్ట్ర నూతన అధ్యక్షుని మధ్య సమన్వయ లోపం, సంఘటిత, సుస్థిర కమాండ్ లేకపోవడం, పల్లె ఓటర్ల వద్ద పార్టీకి స్పష్టమైన హామీలు లేని పరిస్థితి — బీజేపీకి ప్రధాన సవాళ్లుగా నిలుస్తున్నాయి. కానీ, కేంద్ర పునర్విభజన దిశగా అడుగులు వేస్తే — బీజేపీకి 34 కొత్త నియోజకవర్గాల్లో ''కమల కదలిక'' సృష్టించే అవకాశాన్ని చూపించవచ్చు. అదే సమయంలో ప్రాంతీయ సమస్యలకు పునాదులపై గళమెత్త గలిగితే — కొత్త ఓటింగ్ బేస్‌ను సృష్టించేందుకు శ్రమించవచ్చు. ఇవన్నీ చూస్తే, మూడు ప్రధాన పార్టీలు ఒక్కొక్కటీ 100 సీట్లు అంటూ ప్రచారం చేస్తున్నప్పటికీ, ప్రజలు మాత్రం విభిన్నంగా ఆలోచిస్తున్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చని అనుభవం, ప్రాధాన్యత లేని అభ్యర్థుల ఎంపిక, నియోజకవర్గాల్లో ప్రజలకు కనిపించని నాయకత్వం వంటి అంశాలు గతంలో ఓటర్లను తీవ్రంగా నిరాశ పరిచాయి. ఇప్పుడు వారికి మాటలు కాదు, పని చేస్తేనే నమ్మకం. నియోజకవర్గ విభజన వల్ల వచ్చే మార్పులు, ప్రజాభిప్రాయ దిశలు — అన్నింటికీ మించి ప్రజలకు అనుభవం ముఖ్యం. కొత్త సీట్లు రావడం ఒక రాజకీయ అవకాశమైతే — ప్రజలకు ఇది ఓ కొత్త ఆశ. పాలన ఎలా ఉంటుందో, స్థానిక సమస్యల పరిష్కారం ఎటు పోతుందో అన్న అంచనాల ఆధారంగా ఓటింగ్ తీరును తీర్చిదిద్దే అవకాశం ఎక్కువ. అందుచేత, "100 సీట్లు మావే" అన్న నినాదం రాజకీయ నాయకులకు ధైర్యాన్ని నింపే మాట అయి ఉండొచ్చు. కానీ ప్రజలకు మాత్రం ఇది ఒకే మాట కాదు. వారికీ అవసరమైనది: ఆచరణలో మార్పు, పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో గమ్యం, నాయకత్వంలో నమ్మకం. 153 సీట్ల వేదికపైకి మారిన తెలంగాణ ఎన్నికల రాజకీయ యుద్ధంలో గెలుపు కేవలం నినాదాల ద్వారానే కాదు — ప్రగతిశీల ప్రజానీకానికి తగిన నాయకత్వాన్ని ప్రతిబింబించగల విశ్వసనీయత ద్వారానే సాధ్యమవుతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# సరిహద్దు మార్గం.. రాకపోకలకు నరకం

కోరుట్ల: రెండు జిల్లాలను కలిపే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో రాకపోకలకు అవస్థలు తీవ్రమయ్యాయి. విస్తరణ చేపట్టినా పనులు అర్ధంతరంగా వదిలేయడంతో వాహనదారులకు నరకప్రాయంగా మారింది. కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేట ప్రభుత్వ పాఠశాల నుంచి 100 మీటర్ల వరకు జిల్లా ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వస్తుంది. అక్కడి నుంచి నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామం సరిహద్దు ప్రారంభమై 4 కిలోమీటర్ల మేర ఆ జిల్లా ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వెళ్తుంది. రెండు జిల్లాలను కలిపే రహదారిని రెండు వరుసలుగా విస్తరించేందుకు మూడేళ్ల కిందట పనులు చేపట్టారు. కోనాపూర్ నుంచి భూషణ్‌రావుపేట శివారులోని సరిహద్దు వరకు సుమారు 4 కిలోమీటర్ల దూరం వరకు రెండు వరుసల రహదారి



పనులను వెంటనే ప్రారంభించారు. పాత రహదారికి ఇరువైపులా మట్టిని తవ్వి కంకర, రాతి మిశ్రమాన్ని పోసి రెండు వరుసలుగా విస్తరించారు. దానిపై తారు పోసి చదును చేయకుండా వదిలేశారు. దీంతో పాటు భూషణరావుపేట శివారులోని రహదారిపై తారు తవ్వి మట్టి పోసి రోడ్డు ఎత్తు పెంచారు. ఇంతలో 2023 చివరలో శాసనసభ ఎన్నికలు రావడంతో కొత్త ప్రభుత్వం వచ్చింది. గుత్తేదారు రహదారి విస్తరణ పనులను అర్ధంతరంగా వదిలేయడంతో భూషణ్‌రావుపేట శివారులోని రహదారి పూర్తిగా గుంతలతో బురదమయంగా మారింది. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు చొరవచూపి రహదారి విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయించాలని కోరుతున్నారు.

# చెరువుకు చేప.. రైతుకు రొక్కం

భానుపురి : చేపల పెంపకాన్ని రైతులు, మత్స్యకారులు కలిసి అభివృద్ధి చేసుకుంటున్నారు. స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకుంటూ గ్రామాల్లో యువతకు ఉపాధి కల్పిస్తున్నారు. జులై 10న జాతీయ చేపల రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్ఎఫ్‌డీబీ(జాతీయ చేపల పెంపకం మండలి) సహకారంతో స్థిరమైన నిల్వలు, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలను నిర్ధారించడానికి మత్స్య వనరులను నిర్వహించే విధానంలో మార్పులపై దృష్టిసారించడం కార్యక్రమ లక్ష్యం. ప్రొఫెసర్ డాక్టర్ హీరాలాల్, అతని సహోద్యోగి డాక్టర్ అలీకున్హి చేసిన కృషికి గుర్తుగా దీనిని జరుపుకుంటారు.

**కార్యకలాపాలివే**

చేపల పెంపకం, మార్కెటింగ్‌పై జిల్లాలోని మత్స్యకారులకు అధికారులు శిక్షణ కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు.

కొత్త మత్స్య సంఘాలు, మత్స్య మహిళా సంఘాల ఏర్పాటుకు కృషి.

ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం. పట్టణాలు, గ్రామాల్లో చేపల మార్కెట్లు స్థాపించేలా అవగాహన. మత్స్యకారుల సంక్షేమం కోసం జిల్లాలో కేంద్ర, రాష్ట్ర పథకాలను అమలు చేయడం.

మత్స్యకారులకు/మత్స్య రైతులకు సాంకేతిక సాయం అందించడం.

ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం.

విస్తరిస్తున్న మత్స్య సహకార సంఘాలు

ఉమ్మడి నల్గొండ జిల్లాలో చేపల రైతులు 344 మంది ఉన్నారు.



మత్స్యసహకార సంఘాలు 601 ఉండగా 54,250 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలోని జలాశయాల్లో చేపల వేట కొనసాగిస్తున్నారు. వీరికి ప్రభుత్వ పరంగా బీమా పథకాలు ఉన్నాయి. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో చెరువులు, మత్స్యకారులకు ఉపాధి, సొంత భూమిలో చేపల పెంపకానికి సహాయ సహకారాలు అందుతున్నాయి. మత్స్యకారులు ప్రమాదానికి గురైతే బీమా సదుపాయం వర్తిస్తుంది. శాశ్వత వైకల్యానికి రూ.5 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.2.5 లక్షలు అందజేస్తున్నారు.

**ఉత్పత్తి పెంపే లక్ష్యం**

నాగులు నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి, సూర్యాపేట

జిల్లాలో చేపల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో గతేడాది కంటే ఈసారి రెండింతలు చేపలు పెంచేలా కార్యాచరణ చేపడుతున్నాం. ప్రభుత్వపరంగా వచ్చే ఫలాలను మత్స్యకారులకు అందిస్తున్నాం. చేపల పెంపకం చేపట్టేందుకు రైతులు ముందుకురావాలి. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రైతులు తమ కమతాల్లో చేపల చెరువులు ఏర్పాటు చేసుకోవచ్చు.

# దోమల బాధ.. పట్టదా జనం వ్యథ



సిరిసిల్ల : జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నిధుల లేమితో గతంలోనే కొందరి పారిశుద్ధ్య కార్మికులను తొలగించారు. ఫలితంగా మురుగు కాలువల్లో పూడిక తీత, దోమల నివారణ చర్యలు చేపట్టలేకపోతున్నారు. చాలా గ్రామాల్లో రహదారులపై మురుగు నిల్వ అవుతోంది. ఇక గిరిజన తండాల విషయానికొస్తే మురుగు నీటి నిర్వహణకు సరైన సదుపాయాలు లేవు. వినియోగించిన తర్వాత వచ్చే వృథా జలాలు ఇళ్ల పరిసరాల్లోనే జమవుతున్నాయి. వాటితో కలిగే ముప్పు తెలియక బంజారాలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

**ప్రత్యేకాధికారులెక్కడా?**

గ్రామ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో సర్కారు తాత్కాలికంగా ప్రత్యేకాధికారుల పాలన తీసుకొచ్చినా క్షేత్రస్థాయిలో సత్ఫలితాలు ఇవ్వడం లేదు. ఆయా పల్లెలకు బాధ్యులుగా మెదలాల్సిన అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. నిధుల సమీకరణ, సమీక్షలు, పల్లెల్లో సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై ప్రణాళిక లేక పారిశుద్ధ్యం మరుగునపడింది. నిర్వహణ భారం పంచాయతీ కార్యదర్శులకు గుదిబండలా మారింది.

**వేధిస్తున్న నిధుల కొరత**

పంచాయతీ కార్యదర్శులు తమ వేతనాలతో ఇటీవల బ్లీచింగ్, మలాథిన్ కొనుగోలు చేశారు. జిల్లాలో 97 ఫాగింగ్ యంత్రాలు ఉండగా అందులో కొన్ని మరమ్మతులకు గురయ్యాయి.

ఒక్కో ఊరిలో ఫాగింగ్ చేపట్టాలంటే ఇంధనం, రసాయనంతోపాటు ఇతర అవసరాలకు రోజుకు సుమారు రూ.వెయ్యికి పైగా ఖర్చవుతుంది. ఇలా నెలలో సుమారు రూ.5 వేల ఖర్చవుతుంది. ఇప్పటికే పంచాయతీల ఖాతాలు ఖాళీగా మారడంతో అంతమొత్తంలో డబ్బు ఖర్చు చేయడం సమస్యగా మారింది.

జ్వరాలు విజృంభించిన సమయాల్లోనే మొక్కుబడిగా కాలువల్లో పూడిక తీసి, బ్లీచింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఇప్పుడిప్పుడే వానలు కురుస్తుండటం, వాతావరణంలో మార్పుల కారణంగా జనాలు జ్వరాల బారిన పడుతున్నారు. దీనికితోడు పారిశుద్ధ్యం పడకేయడం ఆందోళన కలిగిస్తోంది.

పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు రావడం లేదని జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్ తెలిపారు. వానాకాలంలో పారిశుద్ధ్య పనులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించామని.. ప్రస్తుతం పల్లెల్లో దోమల నివారణకు ఎలాంటి ఇబ్బందులు లేవని వెల్లడించారు. "ఏడాదికి పైగా పంచాయతీలకు నిధులు రావడం లేదు. మరే ఇతర ఆదాయ వనరులు లేక నిర్వహణ భారంగా మారింది. వారం క్రితమే జీతాలు జమయితే బ్లీచింగ్, మలాథిన్ కొనుగోలు చేశాం. వాటిని చల్లించాలన్నా, ఫాగింగ్ చేయాలన్నా ఖర్చు తప్పనిసరి. ఉన్నతాధికారుల ఆదేశాలతో సొంతడబ్బు ఖర్చు చేస్తున్నాం. ఒక్కో రోజు వీధుల్లో చెత్త సేకరణకు ట్రాక్టర్‌లు తిప్పాలంటే కనీసం రూ.500 అవసరమవుతాయి. ఇప్పటి వరకు పెట్టిన డబ్బులు వస్తాయో.. రావో తెలియదు. వానాకాలం దోమల నిర్మూలన పనులంటే పైసలెలా అనే భయమేస్తోంది."

జిల్లాలోని ఓ పంచాయతీ కార్యదర్శి ఆవేదన

# ఏడేళ్లయినా అసంపూర్తి నిర్మాణమే!



మెట్‌పల్లి : మెట్‌పల్లి ప్రభుత్వ కళాశాల నూతన భవన నిర్మాణం ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 2018లో రూ.2.63 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి 2023లో ఇంటర్ బోర్డు నుంచి రూ.60 లక్షలు మంజూరు చేశారు. మూడు అంతస్థుల భవనాన్ని నిర్మించి సుమారు 15 గదుల వరకు నిర్మించాల్సి ఉంది. ఏడేళ్లయినా పనులు పూర్తి కావడం లేదు.

**అసంపూర్తిగా పనులు**

భవన నిర్మాణ పనులు నిలిచిపోయి విద్యుత్తు, నీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు నిర్మించినా వినియోగంలో లేకుండా పోయాయి. తరగతి గదులకు కిటికీలకు బిగించక పోగా, కళాశాల చుట్టూ కోతులు తిరుగుతుండటంతో విద్యార్థులు భయంభయంగా పాఠాలు వినాల్సి వస్తోంది.

**పెరిగిన విద్యార్థులు.. అరకొర వసతులు**

ఈ ఏడాది కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్న లక్ష్యంతో అధ్యాపకులు ఇంటింటికీ తిరిగి చేర్పించారు. ప్రస్తుతం ఇంటర్ మొదటి, రెండో సంవత్సరాలకు సంబంధించి మొత్తం 535 మంది విద్యార్థులున్నారు. కొత్త భవనంలో మొత్తం 15 గదులకు 10 మాత్రమే నిర్మించారు. ఇందులో రెండింటిని ఉన్నత పాఠశాలకు కేటాయించడంతో 8 గదులను వినియోగిస్తున్నారు. వాటిలోనూ పనులు పూర్తి కాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

**బడి భవనం తొలగింపుతో కొత్త చిక్కులు**

కళాశాల ప్రాంగణంలోనే ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల ఉంటుంది. భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారులు ముందస్తుగా పూర్తిగా తొలగించారు. ఆ భవనం నుంచి కళాశాలకు విద్యుత్తు సరఫరా ఉండేది. భవనం తొలగింపుతో సరఫరా నిలిచిపోయి కళాశాలలో కంప్యూటర్ల వినియోగం లేకుండా పోయింది. గదుల్లో చీకటిగా మారింది. దీంతో పాటు తాగునీటికి కష్టాలు తప్పడం లేదు. శుద్ధ జలం యంత్రంతో పాటు పైపులను తొలగించి ఓ మూలన ఉంచారు. నీటి సౌకర్యం లేక మూత్రశాలలు వినియోగించుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి భవన నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.

# ఉద్యోగ భద్రత ఏదీ..!

సూర్యాపేట : ' వేతనం సరైన సమయానికి రాదు.. ఇంటి అవసరాలకు, పిల్లల ఫీజులకు ఇబ్బందులు తప్పవు.. అసలే పంచాయతీల్లో సర్పంచుల పాలన ముగిసింది.. దీనికి తోడు నిధులు విడుదల కాకపోవడంతో చేతి నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది.. వీటన్నింటినీ భరిస్తున్నా.. ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించక పోవడంతో పీఎఫ్, ఉద్యోగోన్నతులు నష్టపోవాల్సి వస్తోంది.. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు సైతం దక్కడం లేదు..'.. అని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.'

పల్లె రూపురేఖలు మార్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో పంచాయతీకో కార్యదర్శి చొప్పున ఉద్యోగ నియామకాలు చేపట్టారు. వారికి రెండేళ్ల పాటు ప్రొబేషన్, ఆ తరువాత క్రమబద్ధీకరించేలా ఉత్తర్వులు జారీ చేస్తూ వారిని రాత పరీక్ష ద్వారా ఎంపిక చేశారు. రెండేళ్లు పూర్తయిన అనంతరం గత ప్రభుత్వంలో వారిని క్రమబద్ధీకరించకపోవడంతో ధర్నా, రాస్తారోకోలు చేశారు. తరువాత వేతనం పెంచుతూ ప్రొబేషన్ కాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగించారు. చివరికి నాలుగేళ్ల తరువాత క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. కాగా ఎన్నికల కారణంగా జిల్లాలో నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న దాదాపు 25 మంది క్రమబద్ధీకరణకు నోచుకోలేదు. ఈ ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి కాగా కేవలం సూర్యాపేట జిల్లాలోనే అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో గత ప్రభుత్వంలో 475 పంచాయతీలకు గాను 357 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామకం చేపట్టారు. 2018 నుంచి విడతల వారీగా వీరిని విధుల్లోకి తీసుకున్నారు. గత ప్రభుత్వంలో నాలుగేళ్లు పూర్తి చేసుకున్న 280 మందిని డీఎస్పీ, డీఎఫ్‌వో వంటి



అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి క్రమబద్ధీకరించారు. ఆ తరువాత వరుస ఎన్నికల నేపథ్యంలో దృష్టి సారించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మరో 30 మందిని చేశారు. మిగతా వారు క్రమబద్ధీకరణకు అర్హత సాధించి ఏడాదిన్నర కావస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరీక్షిస్తున్నారు. కాగా వీరి క్రమబద్ధీకరణకు ఓ ఉన్నతస్థాయి అధికారి పెద్ద మొత్తంలో ముడుపులు ఆశిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నివేదిక పంపించాం**

యాదయ్య, డీపీవో, సూర్యాపేట

నాలుగేళ్లు పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల వివరాలను నివేదించాం. అర్హులైన 25 మందిని త్వరలో క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపడుతున్నాం. జూనియర్ కార్యదర్శులు ఆందోళన చెందవద్దు

# బడి మొదలాయే.. వస్త్రం రాకపాయే!

భువనగిరి : ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ప్రతి ఏటా ఏకరూప దుస్తులు ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఇప్పటికే డీఈవో ఆధ్వర్యంలో నిర్వహించే పాఠశాలల్లో విద్యార్థులకు మొదటి విడతగా స్కూల్ యూనిఫామ్స్ అంజేశారు. రెండో విడత దుస్తుల కుట్టుపనులు కొనసాగుతున్నాయి. కానీ ఎస్సీ, మైనార్టీ గురుకుల పాఠశాలల, కళాశాల విద్యార్థులకు ఇంత వరకు ఇవ్వలేదు. పాఠశాలలు ప్రారంభించి నెల కావొస్తుంది. కళాశాలలు పునఃప్రారంభించి నెల పది రోజులు అవుతోంది. యూనిఫామ్స్ కుట్టుపనులు ఇంకా మొదలు పెట్టలేదు. ఎస్సీ, ఎస్టీ గురుకులాల సంస్థలు వస్త్రాలనే ఇప్పటి వరకు ఇవ్వలేదు.

ప్రభుత్వం ప్రతిఏటా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా రెండు జతల దుస్తులు ఉచితంగా ఇస్తుండగా.. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు మూడు జతల యూనిఫామ్‌లతో పాటు ఒక జత క్రీడా దుస్తులు అందజేస్తోంది.

జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలు, పాఠశాలల్లో 5,273 మందికి, తెలంగాణ మైనారిటీస్ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న 378 మంది విద్యార్థులకు దుస్తులు



కుట్టించేందుకు జిల్లా మహిళా సమాఖ్యకు ఆర్డర్ ఇచ్చారు. యూనిఫామ్‌లకు సంబంధించి ఇంత వరకు ఇంకా వస్త్రాలనే ఇవ్వలేదు. అంగన్‌వాడీల్లో 8,479 మంది విద్యార్థుల యూనిఫామ్‌ల కుట్టేందుకు కూడా వస్త్రాలను మహిళా, శిశు సంక్షేమ శాఖ సమకూర్చలేదు. ఇప్పుడు వస్త్రాలు ఇచ్చినా కుట్టేందుకు కనీసం మరో నెల వ్యవధి పడుతుంది. నూతనంగా చేరిన విద్యార్థులు స్కూల్ డ్రెస్‌లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

బాలురకు ప్యాంట్, చొక్కా, బాలికలకు చుడిదార్ యూనిఫామ్ మూడు జతలు, క్రీడల దుస్తులు ఒక జత ఇవ్వాల్సి ఉంది. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఇప్పటికే అందజేశారు. ఆయా విద్యా సంస్థలు యూనిఫామ్ క్లాత్ ఇచ్చిన వెంటనే కుట్టి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని యాదాద్రి భువనగిరి జిల్లా డీఆర్‌డీవో టి.నాగిరెడ్డి తెలిపారు. తమకు పూర్తి స్థాయిలో క్లాత్ రాలేదని, అందుకే కుట్టడానికి ఇవ్వలేదని ఎస్సీ గురుకుల విద్యా సంస్థల జోనల్ అధికారి విద్యారాణి 'న్యూస్‌టుడే'కు వివరణ ఇచ్చారు.

# కొత్త కొత్తగా ఉన్నదీ... భవిత ఇక్కడే అన్నదీ..!

చిట్యాల : నిన్నటి వరకు పాఠశాలలో చదువుకున్నారు. ప్రస్తుతం కళాశాలలో చేరారు. కొత్త వాతావరణం, కొత్త స్నేహితులు, కొత్త ఆశలు, కొంగొత్త ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలు వెరసి పదో తరగతి పూర్తి చేసుకొని ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులు ఆశల పల్లకీలో తేలుతున్నారు. తల్లిదండ్రులు తమమీద పెంచుకున్న ఆశలను నెరవేర్చడానికి భవిష్యత్తు పునాదిని నిర్మించుకోవాలని అనుకుంటున్నారు. చిట్యాలలోని సరస్వతి జూనియర్ కళాశాలలో పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి వచ్చి చేరిన విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి మారిన వాతావరణం, కొత్త స్నేహితులు, కొత్తరకమైన బోధనతీరు, గ్రామం నుంచి కళాశాల వరకు ప్రతిరోజు ప్రయాణం వంటి అంశాలపై తమ మనోభావాలనుతో పంచుకున్నారు.

**చదువును, ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నా**

త్రిష, సిరిపురం, యాదాద్రి జిల్లా

నేను పాఠశాల విద్యను ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వేరుంపాడు మండలం, దొడదేవరపాడు గ్రామంలో చదువుకున్నాను. కొంతకాలంగా సిరిపురంలో ఉంటున్నాం. డాక్టర్ కావాలనే బైపీసీలో చేరాను. సిరిపురం నుంచి చిట్యాలకు ప్రతిరోజు బస్సులో వస్తున్నాను. చదువుతో పాటు బస్సు ప్రయాణాన్నీ ఆస్వాదిస్తున్నాను. బస్సుల్లో రకరకాల జనం ప్రయాణిస్తుంటారు. వారి అలవాట్లు, మాట తీరు అన్నీ గమనిస్తున్నా. డాక్టర్ అయ్యే తొలిమెట్టు ఇక్కడే



ఎక్కాను అనుకుంటున్నాను.

**కొత్త స్నేహితులు పరిచయం అయ్యారు**

పర్వతం లక్ష్మీప్రణతి, నేరెడ

నేను పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. ఇంటర్ కోసం చిట్యాలకు వస్తున్నాను. కొత్తగా స్నేహితులు పరిచయం అయ్యారు. నాతో బాగా ఉంటున్నారు. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కావాలనే సంకల్పంతో ఎంపీసీ గ్రూప్ తీసుకున్నాను. క్రమశిక్షణగా చదువుకుని అనుకున్న లక్ష్యం సాధించి, మా తల్లిదండ్రులకు, గురువులకు బహుమతిగా ఇవ్వాలనుకుంటున్నాను.

**ఎలా ఉంటుందో అనుకున్నా**

**అయేషా నాజ్మీన్, చిట్యాల**

కళాశాల అంటే ఎలా ఉంటుందో అనుకున్నాను. పాఠశాలకు, కళాశాల బోధన తీరులో తేడా గమనించాను. భవిష్యత్తులో డాక్టర్ కావాలని బైపీసీ గ్రూపులో చేరాను. ఇంటర్ పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించే లక్ష్యంతో ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం చదువుతాను. మంచి స్నేహితులు లభించారు. వారితో కూడా పాఠ్యాంశాలపై ఎప్పటికప్పుడు చర్చిస్తా.

చురకలు



## ఆరోగ్యం పాడవుతుందిలా..

హైదరాబాద్: మద్యం, కల్లు బాధితులతో ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం రోగుల తాకిడి ఉంటోంది. తాజాగా కల్తీ కల్లు తాగి ఐదుగురు చనిపోవడం, మరో 30 మందికిపైగా నిమ్స్‌లో చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలోని డిఅడిక్షన్ కేంద్రానికి రోజూ 20–30 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. ఆ మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. కొందరిలో కాలేయం, కిడ్నీలు, నాడీ వ్యవస్థ దెబ్బతీస్తుంది. గుండెపోటుకూ కారణమవుతుందని వైద్యులంటున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వారిలో మద్యం, కల్తీ కల్లు అలవాటు ఉన్నవారి శాతం ఎక్కువేనని చెబుతున్నారు.



**తగ్గిస్తారిలా..:**

ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక ఆరోగ్య కేంద్రంలో డీఅడిక్షన్ కేంద్రంలో మత్తు పదార్థాలకు బానిసైనవారికి ఉచిత చికిత్స అందిస్తున్నారు.

ఒక్కసారిగా అలవాటు నుంచి దూరం చేస్తే రకరకాల మానసిక సమస్యలకు దారి తీస్తుంది. ఇలాంటి వారికి తొలుత డీటాక్సిఫికేషన్ చికిత్స అందిస్తారు. అనంతరం నెమ్మదిగా మత్తు అలవాటునుంచి దూరం కావడానికి యాంటి క్రేవింగ్ మందులు 3–6 నెలలపాటు తీసుకోవాలి.

**హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు**

నగరంలో జరిగిన కల్తీ కల్లు ఘటనపై న్యాయవాది రామారావు ఇమ్మానేని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారం, బాధితులకు రూ. 5 లక్షలు ఇప్పించాలని కోరారు.

## కూలే వరకు పట్టించుకోరా?

హైదరాబాద్: ప్రతిరోజూ వందల మంది రాకపోకలు సాగించే ట్యాంక్‌బండ్‌పై ఉన్న రహదారికి అనుసంధానించి నిర్మించిన పాదచారుల బాట అధ్వానంగా ఉంది. సికింద్రాబాద్‌కు వెళ్లే ఆర్చి నుంచి ఈ కాలిబాట ప్రారంభమవుతుంది. తొలుత కొంతవరకు వంతెన, ఆ తర్వాత రాతి కట్టడంతో కూడిన కట్ట ఉంది. ప్రస్తుతం వంతెన ప్రమాదకరస్థితికి చేరడంతో పాదచారులు భయపడుతున్నారు. 7 పిల్లర్ల పెచ్చులూడుతున్నాయి. ఇనుప చువ్వలు తేలి కనిపిస్తుండటంతోపాటు స్తంభాల మధ్యలో పగుళ్లు వచ్చాయి. ట్యాంక్‌బండ్ నిర్వహణ బాధ్యతను హెచ్‌ఎండీఏ చూస్తోంది. ఇక్కడ పచ్చదనం కోసం పచ్చికబయళ్లు,



మొక్కలను పెంచుతున్నారు. అయితే కాలిబాట నిర్వహణను పట్టించుకోకపోవడంతో కూలే వరకు స్పందించరా...? అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ రవీందర్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణం పరిశీలించి మరమ్మతులు చేపడతామని చెప్పారు.

## చెల్లింపుల్లో జాప్యం

కమాన్‌పూర్ : రాష్ట్ర ప్రభుత్వం గత నవంబరులో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో సర్వే నిర్వహించింది. సర్వే అనంతరం వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు కంప్యూటర్‌పై పరిజ్ఞానం ఉన్న ఆపరేటర్లతో వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయించారు. ఒక దరఖాస్తుకు రూ. 30 ఇస్తామని చెప్పడంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

**నాలుగు మండలాల్లో 42,621 దరఖాస్తులు**

మంథని నియోజకవర్గంలో నాలుగు మండలాలు, 76 గ్రామపంచాయతీలున్నాయి. 42,621 దరఖాస్తులు వచ్చాయి. సుమారు 114 మంది ఆపరేటర్లను తీసుకున్నారు. సర్వే వివరాలు నమోదు చేయడానికి ప్రభుత్వ అధికారులను సైతం వినియోగిం చుకున్నారు. రామగిరి, ముత్తారం మండలాలకు సంబంధించిన సర్వే వివరాలు ఆన్‌లైన్‌ను మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అప్పగించారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొంతమందికి డబ్బులు చెల్లించినట్లు అధికారులు



చెబుతున్నారు. మంథని నియోజకవర్గంలో రూ. 7లక్షల వరకు రావాల్సి ఉంది. సర్వే వివరాలు ఆన్‌లైన్ చేసిన జేఎన్టీయూ కళాశాల విద్యార్థులు, ఇతర ప్రైవేట్ ఆపరేటర్లు తరచూ ఎంపీడీవో కార్యాలయాలకు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పదిరోజుల పాటు..**

కులగణన సర్వే వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు అవకాశం ఉందని అధికారులు చెప్పారు. కమాన్‌పూర్ ఎంపీడీవో కార్యాలయంలో పది రోజుల పాటు వివరాలను ఆన్‌లైన్ చేశా. ఒక దరఖాస్తుకు రూ. 30 ఇస్తామని అధికారులు చెప్పారు. ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఇవ్వలేదు. గోలి అఖిల్, రంగాపూర్

**నిధులు విడుదల కావాల్సి ఉంది**

సర్వే వివరాలు ఆన్‌లైన్ చేసేందుకు ప్రైవేట్ ఆపరేటర్లను తీసుకున్నాం. వివరాలను ప్రభుత్వానికి పంపించాం. మార్చి 31 వరకు తిరస్కరణకు గురైన వివరాలను మళ్లీ పంపించాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఉన్నతాధికారులకు మరోసారి నివేదిస్తాం. రవీందర్, ముఖ్య ప్రణాళిక అధికారి

# నడ్డి విరుస్తున్న వడ్డీ



హైదరాబాద్: మెట్రో రైలు ప్రాజెక్ట్ మొదటిదశను వడ్డీలు నడ్డి విరుస్తున్నాయి. టికెట్లు, ప్రకటనలు, రియల్ ఎస్టేట్ ద్వారా ఆదాయం వస్తున్నా ముంత లాభం చిల్లు తీసిందన్న చందంగా పరిస్థితి మారింది. ప్రాజెక్ట్ నిర్మాణానికి చేసిన అప్పులకు చెల్లిస్తున్న వడ్డీతో నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోందని మెట్రో వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు వడ్డీలకే రూ. 4,500 కోట్లు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఎల్‌అండ్‌టీ.. హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ నిర్మించి నిర్వహిస్తోంది. భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 3 వేల కోట్లు, సర్దుబాటు వ్యయ నిధి కింద కేంద్ర ప్రభుత్వం రూ. 1,204 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం రూ. 15,920.23 కోట్ల ఆస్తులు కలిగిన మెట్రో మొదటిదశలో రూ. 8148.07 కోట్లు అప్పులున్నాయి.

ఆదాయమిలా... సంస్థకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ. 1108.54 కోట్ల ఆదాయం వచ్చింది. టికెట్ల ద్వారా రూ. 627.11 కోట్లు, ప్రకటనలు, రియల్ ఎస్టేట్ ద్వారా రూ. 485.55 కోట్లు వచ్చింది. క్రితం ఏడాదితో పోలిస్తే 21 శాతం ఆదాయం తగ్గింది.

**జీతభత్యాలు ఇలా..**

నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలు, పరిపాలన ఖర్చులు, తరుగు, వడ్డీలు కలిపి రూ. 1,738.57 కోట్లు అయినట్లు ఎల్‌అండ్‌టీ మెట్రో రైలు సంస్థ పేర్కొంది. నిర్మాణ వ్యయానికి చేసిన అప్పులకు చెల్లించిన వడ్డీనే రూ. 940.03 కోట్లుగా తెలిపింది. నిర్వహణ వ్యయం రూ. 421.74 కోట్లు కాగా, తరుగు కింద రూ. 302.84 కోట్లు చూపించారు. మొత్తంగా ఆర్థిక సంవత్సరంలో రూ. 625.88 కోట్లు నష్టం వాటిల్లింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే నష్టాలు 13 శాతం పెరిగాయి.

**మార్చి 31, 2025 నాటికి ఖర్చు రూ.కోట్లలో**

నిర్మాణం కోసం చేసిన వ్యయం: రూ. 13,046.22
ఉద్యోగుల వేతనాలు: రూ. 209.38
ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్: రూ. 125.31
వడ్డీలు: రూ. 4509.66

# అనుమతి లేకున్నా.. అడ్డగోలు తవ్వకాలు



జమ్మికుంట : జమ్మికుంట మండలంలో నీటిపారుదల శాఖకు సంబంధించిన కార్యాలయం హుజూరాబాద్‌లో ఉంది. సంబంధిత ఏఈలు జమ్మికుంట, ఇల్లందకుంట మండలాలకు అందుబాటులో లేరు. దీంతో ఇదే అదునుగా జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లో జోరుగా మట్టి అక్రమ రవాణా జరుగుతోంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు లష్కర్లున్నా.. వారు ఏమరుపాటుగా ఉన్న సమయంలో అక్రమార్కులు జోరుగా మట్టిదందా చేస్తున్నారు.

**150 ట్రాక్టర్ల మట్టి తరలింపు!**

స్థానిక నాయిన్ చెరువు శిఖం స్థలంలో మంగళవారం పొక్లెయిన్‌తో తవ్వకాలు చేసి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మట్టి తరలించారు. రెవెన్యూ, నీటిపారుదల, ఇతర ప్రభుత్వ శాఖల అనుమతి లేకుండానే సుమారు 150 ట్రాక్టర్ల మట్టిని తరలించి జమ్మికుంటలోని ఓ ప్రాంతంలో విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. ట్రాక్టర్‌కు రూ. 1,000 చొప్పున సుమారు రూ. 1.50 లక్షల విలువైన మట్టిని విక్రయించారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఎన్. వెంకట్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఏఈ వరుణ్‌లను వివరణ కోరగా.. చెరువు శిఖం నుంచి మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఈ విషయమై తహసీల్దార్‌తో మాట్లాడి విచారణ చేపడతామని ఏఈ చెప్పారు. మట్టి తరలించాలంటే ఇరిగేషన్ శాఖ ఈఈ అనుమతి అవసరమన్నారు.

**పలు ప్రాంతాల్లో ఇలా..**

జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పేరిట మట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ఏడాది మే నెలలో జమ్మికుంట మండలం తనుగులలోని చాకిరికుంట, స్థానిక చెరువు నుంచి వందల ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా తరలించారు. అప్పటి ఏఈ మహేశ్ తనిఖీ చేసినా ఏ మార్పు లేదు.

జమ్మికుంట మండలం వెంకటేశ్వరపల్లిలోని పిల్లివాని కుంటలో మట్టి తరలింపుపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఈ దందా ఆగలేదు.

ఇల్లందకుంట మండల కేంద్రంలోని ఎర్రగుట్ట ప్రాంతం, కనగర్తిలోని కుంట నుంచి మట్టిని అక్రమంగా ట్రాక్టర్లలో తరలించారు. యథేచ్ఛగా ఈ దందా సాగుతున్నా.. అధికారులు పట్టుకున్న దాఖలాలు లేవు. చెరువులు, కుంటల నుంచి మట్టి అక్రమ తరలింపుపై ఉన్నతాధికారులు నిఘా పెడితే రూ. లక్షల విలువ చేసే అక్రమ రవాణా ఆగుతుంది. వనరుల నష్టం జరగకుండా నిలువరించవచ్చు.

# సమిష్టిగా కదిలారు.. బడిని బతికించుకున్నారు



సిరిసిల్ల: గ్రామానికి బడి.. గుడి ఉంటేనే పరిపూర్ణత వస్తుంది. అలాంటిది కొన్నేళ్లుగా జిల్లా వ్యాప్తంగా 23 పాఠశాలలు మూతపడుతూ వచ్చాయి. ఈసారి బడి బాటలో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధనపై ఉపాధ్యాయుల ప్రచారంతో తల్లిదండ్రుల్లో మార్పువచ్చింది. ఈ విద్యాసంవత్సరం తమ పిల్లల్ని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించారు. దీంతో జిల్లాలో అయిదు పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఇంకా చాలా పాఠశాలల్లో ప్రవేశాలు లేక మూతపడి.. భవనాలకు తాళాలు వేసి ఉన్నాయి.

**మార్పులు చేర్పులతో..**

జిల్లాలో 2024–25 విద్యాసంవత్సరం 510 ప్రభుత్వ పాఠశాలు, కేజీబీవీలు, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు కలిపి 37,720 మందికిగాను ఈ ఏడాది బడిబాట ముగిసే నాటికి 36,278 మంది విద్యార్థులున్నారు. మొత్తంగా విద్యార్థుల సంఖ్య తగ్గినప్పటికీ అయిదు పాఠశాలలు ప్రారంభంకావడం ఊరటనిచ్చే అంశం. వీటిలో ఇల్లంతకుంట మండలం ఎర్రనర్సుపల్లి, ముస్తాబాద్ మండలం లంబాడితండా, పొత్గల్‌లోని జడ్పీహెచ్‌ఎస్ బాలికలు, రుద్రంగి మండలం వీరునితండా, సిరిసిల్ల పట్టణంలోని అశోక్‌నగర్ ప్రాథమిక పాఠశాలలు ప్రారంభమయ్యాయి.

పొత్గల్ జిల్లా పరిషత్తు బాలికల పాఠశాల 15 మంది బాలికలతో ప్రారంభించారు. 2016లో ప్రవేశాల్లేక మూతపడింది. ఈ పాఠశాలలోని ఉపాధ్యాయులను పక్కనే ఉన్న బాలుర పాఠశాలలోకి డిప్యూటేషన్ వేశారు.

రుద్రంగి మండలం వీరునితండా ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. కలెక్టర్ తనిఖీలో ఈ విషయం తెలియడంతో ఉపాధ్యాయులను విద్యార్థులను పక్కనే కిలోమీటరు దూరంలోని డెగావత్‌తండాలోకి మార్చారు. ఈ ఏడాది గ్రామంలో బడి ఉండాలని 8 మంది విద్యార్థులను చేర్పించారు. ప్రస్తుతం ఒక ఉపాధ్యాయునితో ఈ పాఠశాల ప్రారంభమైంది.

సిరిసిల్ల పట్టణంలోని ఆశోక్‌నగర్ ప్రాథమిక పాఠశాల 2019లో మూతపడింది. ఈ ఏడాది తొమ్మిది మంది విద్యార్థులతో ప్రారంభించారు. కాగా ఈ పాఠశాలలో టీజీఈడబ్ల్యుఐడీసీ (రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) కార్యాలయం నిర్వహిస్తున్నారు. గదులు ఖాళీలేకపోవడంతో పద్మానగర్‌లోని పాఠశాలలో తరగతులు జరుగుతున్నాయి.

కోనరావుపేట, ముస్తాబాద్, వేములవాడ గ్రామీణ, చందుర్తి, తంగళ్లపల్లి, రుద్రంగి మండలాల్లోని చాలా గ్రామాల్లో పాఠశాలలు మూతపడి ఉన్నాయి. తక్కువ మంది విద్యార్థులున్నవి, ఏకోపాధ్యాయ పాఠశాలలు కూడా ఉన్నాయి.

## ఆయకట్టు.. గుటుక్కు గట్టు..!

సూర్యాపేట : జిల్లాలో ఎస్సారెస్పీ కాలువ భూములను అక్రమార్కులు వదలడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలువురు కబ్జాకు పాల్పడుతున్నారు. పర్యవేక్షణ, ఇతరత్రా అవసరాల కోసం కాలువకు ఇరువైపులా కేటాయించిన భూములను పక్క రైతులు తమ సాగు భూముల్లో కలిపేసుకుంటూ పంట పండిస్తున్నారు. వారి ఆక్రమణలతో నీటి సరఫరా సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కొన్ని కాల్వల చివరి వరకు నీటిపారుదలశాఖ అధికారులు వెళ్లలేని దుస్థితి. చివరి ఆయకట్టు రైతులు కూడా తమ పంట క్షేత్రాలకు వెళ్లేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఎస్సారెస్పీ రెండో దశలో అత్యధికంగా సాగుజలాలను సూర్యాపేట జిల్లాకు అందించేలా నిర్మించారు. డీబీఎంలకు ఒక వైపు సుమారు 40 అడుగులు, మరో వైపు 43 అడుగులు, డీబీఎంల నుంచి పంటపొలాలకు నీరందేలా నిర్మించిన ఉప కాలువలకు ఒక వైపు దాదాపు 30 మరో వైపు 33 అడుగుల చొప్పున భూములు ఉండాలి. వాటిలోని ఒక వైపు నుంచి కాలువల పర్యవేక్షణ కోసం అధికారుల వాహనాల్లో రాకపోకలు సాగించాలి. అంతటి విస్తీర్ణం కలిగిన భూములు కొన్నిచోట్ల ఒక వైపు పూర్తిగా కబ్జాకు గురయ్యాయి. అనుకోని సందర్భాల్లో డీబీఎం కాలువలకు గండ్లు పడితే అప్పటికప్పుడు పూడ్చడానికి మట్టి(మొరం) కట్టలుండాలి. కాగా ఈ మట్టిపై అక్రమార్కుల కన్నుపడింది. మద్దిరాల, నూతనకల్, తుంగతుర్తి, తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో సాగు భూముల మీదుగా నిర్మించిన కాలువకు



ఇరువైపులా ఉన్న భూములు ఆక్రమణకు గురయ్యాయి.

నీటి సరఫరా సమయంలో మునగాల, నడిగూడెం, మోతె మండలాల్లోని చివరి ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి. ముఖ్యంగా యాసంగి సమయంలో నీరందేలా చూడాలని అన్నదాతలు అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం ఉండటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో చాలావరకు కాలువ పక్కన స్థలాలను కొందరు తమ సాగుభూముల్లో కలిపేసుకున్నారు.

డీబీఎం–69 పరిధిలోని తుంగతుర్తి మండలం గుడితండా మీదుగా నూతనకల్ మండలం చిల్పకుంట శివారు పంటపొలాల మీదుగా వెళ్లే 21ఆర్ ఉపకాలువ ఇది. కొన్నిచోట్ల కుడివైపు, మరి కొన్ని చోట్ల ఎడమవైపు కిలోమీటర్ల పొడవునా అక్రమించుకొని సాగుభూమిగా మార్చుకుని వరి, పత్తి పంటలను సాగు చేస్తున్నారు.

మద్దిరాల మండలం రెడ్డిగూడెం శివారులోని డీబీఎం–60 కాలువ ఇది. మద్దిరాల నుంచి ముకుందాపురం, చిన్ననెమిల మీదుగా పాలేరు వాగు సమీపం వరకు వెళ్తుంది. కాలువ పక్కన దాదాపు 40 అడుగుల వెడల్పుతో ఉండాల్సిన భూమి కబ్జాకు గురికాగా 15 అడుగులకు మిగిలింది.

**హద్దులు ఏర్పాటు చేస్తాం**

హరికృష్ణ, డీఈఈ, నీటిపారుదలశాఖ

కాలువలో ఉన్న చెత్తను, చెట్లను తొలగిస్తున్నాం. రికార్డుల ప్రకారం కాలువకు ఇరువైపులా ఉన్న భూముల్లో హద్దులు ఏర్పాటు చేస్తాం. వనమహోత్సవంలో భాగంగా ఆ భూముల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.


## సామగ్రి పంచి.. ఆసక్తి పెంచి

కోదాడ : అటల్ ఇన్నోవేషన్ మిషన్(ఏఐఎం)లో భాగంగా పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్)లను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌లకు కేంద్రం చొరవతో రూ. 10లక్షల విలువైన బోధన సామగ్రిని ఇటీవల అందించారు. విద్యార్థుల్లో సైన్స్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం సబ్జెక్టులపై ఆసక్తిని పెంచుకోవడమే వీటి ప్రధాన లక్ష్యం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) తదితర అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాల్లోనూ ప్రభుత్వ విద్యార్థులను తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది.

ఈ ఏడాది సూర్యాపేట జిల్లాలోని 21 పీఎంశ్రీ పాఠశాలలకు ఈ అధునాతన బోధనా సామగ్రిని ఇటీవల పంపిణీ చేశారు. ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ వంటి పరికరాలతో పాటు ఐఎఫ్‌ఎల్ ప్యానెల్, ల్యాప్‌టాప్, ఆండ్రాయిడ్ బాక్స్ ఒక్కొక్కటి చొప్పున, ఆరు వర్క్ స్టేషన్లు, ఫ్లోర్ మ్యాట్, రెండు అగ్నిమాపక పరికరాలు వీటిలో ఉన్నాయి.

**ఉపాధ్యాయులకు శిక్షణ**

పాఠశాలలకు అందించిన పరికరాలపై ఉపాధ్యాయులకు ఈనెల 22, 23 తేదీల్లో శిక్షణ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆరుగురు



నిపుణులు జిల్లాకు రానున్నారు. ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున 21 పాఠశాలల నుంచి 63 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరు కానున్నారు. 30, 33 మందితో రెండు పాఠశాలల్లో శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**సాంకేతిక రంగంలో పోటీపడేలా**

ఎల్. దేవరాజ్, జిల్లా సైన్స్ అధికారి

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు సాంకేతిక రంగంలో పోటీపడేలా చూడటమే అటల్ టింకరింగ్ ల్యాబ్స్ లక్ష్యం. జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గ ఉపాధ్యాయులకు అనాజీపురంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయులకు కోదాడలోని పీఎంశ్రీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ జరుగుతుంది.

# సాంకేతిక విద్య.. ఉన్నతికి బాట

సంగారెడ్డి : బాలికలు సాంకేతిక విద్య నేర్చుకొని తమ ఉన్నతికి బాట వేసుకునేలా తీర్చిదిద్దాలని విద్యాశాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకు అనుగుణంగా కంప్యూటర్ విద్య ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ముందుగా ఎంపిక చేసిన కస్తూర్బాలు, ఆదర్శ పాఠశాలల్లో దీన్ని అమలు చేస్తారు. సాంకేతిక విద్య బోధనకు ప్రత్యేకంగా శిక్షకులను సైతం నియమించనున్నారు.

**ఎంపిక చేసిన పాఠశాలల్లోనే..**

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఎంపిక చేసిన కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలకు కంప్యూటర్లను పంపిణీ చేశారు. సంగారెడ్డి జిల్లాలో నాలుగు ఆదర్శ, మూడు కస్తూర్బాలు, మెదక్ జిల్లాలో ఐదు ఆదర్శ, సిద్దిపేట జిల్లాలో 12 ఆదర్శ, వికారాబాద్ జిల్లాలో 9 ఆదర్శ పాఠశాలలకు వాటిని పంపిణీ చేయనున్నారు. కంప్యూటర్లు, ప్రింటర్, 2 కేవీఏ యూపీఎస్, 24 పోర్ట్ నెట్‌వర్క్ స్విచ్ బోర్డు, 305 మీ. కేబుల్ వైరు, పాఠశాలకు 125 మీటర్ల లాన్, ఆరు రాక్‌లు, జాక్ ప్యానెల్, ఎలక్ట్రికల్ స్విచ్ బోర్డు, 75 మీ. ఎలక్ట్రికల్ కేసింగ్, కంప్యూటర్ టేబుల్స్, కుర్చీలు పంపిణీ చేస్తారు.

**బాలికలకు మాత్రమే అవకాశం**

ఆదర్శ పాఠశాలల్లో బాలికలకు వసతి ఉన్న చోటికి మాత్రమే



కంప్యూటర్లు కేటాయించారు. వసతిగృహానికి చేరుకున్నాక శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు. మెదక్, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాల్లో ఆదర్శ పాఠశాలలను మాత్రమే ఎంపిక చేయగా, సంగారెడ్డిలో ఆదర్శ పాఠశాలతో పాటు మూడు కస్తూర్బాలు ఈ జాబితాలో ఉన్నాయి.

**జిల్లా వారీగా..**మెదక్: రామాయంపేట, చిన్నశంకరంపేట, టేక్మాల్, చేగుంట, నర్సాపూర్ (ఆదర్శ)

సంగారెడ్డి: మునిపల్లి, రామచంద్రాపురం, పుల్కల్, కల్హేర్ (ఆదర్శ), చౌటకూరు, గుమ్మడిదల, మొగుడంపల్లి (కస్తూర్బాలు)

సిద్దిపేట: దుబ్బాక, నంగునూరు, జగదేవపూర్, మిరుదొడ్డి, చిన్నకోడూరు, కొహెడ, హుస్నాబాద్, బెజ్జంకి కొండపాక, మద్దూరు, సిద్దిపేట, చేర్యాల (ఆదర్శ)

వికారాబాద్: యాలాల, వికారాబాద్, నవాబ్‌పేట, మర్పల్లి, పరిగి, తాండూరు, పుదూరు, బంట్వారం, కుల్కచర్ల (ఆదర్శ).

సద్వినియోగం చేసుకోవాలి

ఆదర్శ, కస్తూర్బా విద్యాలయాల్లో బాలికల కోసమే కంప్యూటర్లు కేటాయించారు. వీటికి చదువుతో పాటు సాంకేతిక బోధన అందించే దుకు వాటిని అందిస్తున్నాం. నేరుగా ఆయా పాఠశాలలకు అందించి ఇన్‌స్టాల్ చేయిస్తాం. కంప్యూటర్ బోధనను సద్వినియోగం చేసుకోవాలి. సుప్రియ, జిల్లా బాలికల అభివృద్ధి అధికారిణి, సంగారెడ్డి

# కాన్పు కష్టాలిక దూరం

ఆదిలాబాద్ : వర్షాకాలంలో రవాణా సౌకర్యం లేని, వాగుల పక్కనే ఉన్న గ్రామాల్లోని గర్భిణులు కాన్పుల సమయంలో ఇబ్బందులు పడకుండా వైద్య శాఖ జిల్లాలో 'బర్త్ వెయిటింగ్ రూం' (కాన్పు కోసం వేచి ఉండే గది)లను ఇప్పటికే సిద్ధం చేసింది. వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నప్పుడు నొప్పులు వస్తే కాన్పు కోసం ఆసుపత్రికి తీసుకెళ్లటం దుర్లభంగా మారుతుంది. ఇలాంటి సందర్భాల్లో మాతా,శిశు మరణాలు జరిగే అవకాశాలు ఎక్కువ. జిల్లాలో 201 సమస్యాత్మక గ్రామాలను గుర్తించింది. ఆయా గ్రామాల్లో ప్రసవ తేదీలు సమీపించిన గర్భిణులను వారం ముందే ఇక్కడికి తరలించడానికి ఏర్పాట్లు చేసింది.

జిల్లాలోని 22 పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 201 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా వైద్య శాఖ గుర్తించింది. ఈ గ్రామాల్లో మొత్తం జూన్‌లో 43 మంది గర్భిణులు కాన్పులు కావాల్సి ఉన్నట్లు



గుర్తించగా ఇప్పటికే 18 మంది ప్రసవం కాగా ఇంకా 25 మందికి కాన్పులు కావాల్సి ఉంది. సమస్యాత్మక గ్రామాల గర్భిణులకు వైద్య శాఖ అవగాహన కార్యక్రమాలను సిబ్బంది ద్వారా నిర్వహిస్తోంది. వాగులు, వంకలు ఉన్న గ్రామాలకు వెళ్లి కాన్పుల సమయంలో వరదల వల్ల ఇబ్బందులు పడకుండా కాన్పుకు వారం రోజుల ముందే నిర్దేశిత కాన్పు కోసం వేచి ఉండే గదులకు లేదా ఆసుపత్రిలో కాన్పులు చేయించుకోవాలని సూచిస్తున్నారు. అంబులెన్స్‌లు సైతం సిద్ధం చేస్తున్నారు.

**జిల్లాలో పది చోట్ల..**

జిల్లాలోని పెద్దాసుపత్రి రిమ్స్, రూరి, నేరడిగొండ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి పీహెచ్‌సీలు, నార్నూర్, ఉట్నూర్, బోథ్ సీహెచ్‌సీల్లో బర్త్ వెయిటింగ్‌రూంలను వైద్య శాఖ సిద్ధం చేసింది.

**ఇదీ పరిస్థితి..**

జిల్లాలో గర్భిణులు: 9,213

జూన్‌లో కాన్పు కావాల్సిన వారు 25

జులైలో ,, 50

ఆగస్టులో ,, 56

**అన్ని ఏర్పాట్లు చేశాం రాథోడ్ నరేందర్, డీఎంహెచ్ఓ**

జిల్లాలోని పది ఆసుపత్రుల్లో బర్త్ వెయిటింగ్ రూంలు సిద్ధం చేశాం. సమస్యాత్మక గ్రామాల్లో కాన్పు దగ్గర పడ్డ గర్భిణులను ప్రత్యేక అంబులెన్స్‌లో వారం, పది రోజులు ముందుగానే అక్కడకు తరలించి వసతి కల్పించడానికి ఏర్పాట్లు చేశాం. అక్కడ వారికి అన్ని వసతులు అందుబాటులో ఉంచి సుఖ ప్రసవాలు అయ్యేలా ఏర్పాట్లు చేశాం.

# సేంద్రియం.. సర్కారు మంత్రం!



పరిగి : వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడులను నియంత్రించేందుకు జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. సేంద్రియ సాగును పెంచడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులను సాధించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. తద్వారా అన్నదాతల్లో మార్పు తీసుకురావడం ద్వారా అనవసర ఖర్చులను, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రిస్తూ ఆర్థికాభివృద్ధి దిశగా నడిపించాలని యోచిస్తోంది. ఈ వానాకాలం నుంచే సాగుకు శ్రీకారం చుడుతోంది. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

**ప్రస్తుతం రెండు శాతమే:** జిల్లా వ్యాప్తంగా ఈ పద్ధతిన సాగు చేస్తున్నది కేవలం రెండు శాతమే. వాస్తవానికి వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు పంట కాలం మొత్తం రెండు బస్తాల డీఏపీ ఎరువులు వాడితే చాలు. అలాంటిది ఎకరాకు ఆరు బస్తాల చొప్పున వినియోగిస్తున్నారు. దీంతో భూసారం నిస్సారంగా మారడంతో పాటు పంటలపై కీటకాల బెడద పెరుగుతోంది. వాతావరణ కాలుష్యం అధికమవుతోంది. కాంప్లెక్స్, డీఏపీ పైపాటుగా వేయకుండా దుక్కిలోనే వాడాలి. ఒక్క యూరియాను మాత్రమే పైపాటుగా చల్లుకోవాలి. కానీ ఇష్టానుసారంగా పైపాటుగా చల్లడండంతో ఆర్థిక భారం పెరిగి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీనిని అడ్డుకట్ట వేసేందుకు సేంద్రీయ విధానాన్ని అమలు చేస్తున్నారు.

**అమలు ఇలా..**

జిల్లాలో 20 మండలాలను ఎంపిక చేశారు.

ఒక మండలానికి ఒక క్లస్టరును ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు.

దాని పరిధిలో 125ఎకరాలను 125మంది రైతుల ద్వారా సహజ సాగును ప్రోత్సహించనున్నారు.

జిల్లా వ్యాప్తంగా 100క్లస్టర్లలో పథకాన్ని అమలు చేయనున్నారు.

రెండు క్లస్టర్లకు కలిపి ఒక బయో ఇన్‌పుట్ రిసోర్సు సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. ఎంపిక చేసిన ప్రతి రైతుకు రూ.2వేల చొప్పున రెండేళ్ల పాటు అందజేస్తారు.

గణామృతం, జీవామృతం వంటి వాటిని సరఫరా చేస్తారు.

జిల్లాకు 13 బీఆర్సీ సెంటర్లు వచ్చాయి.

రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువుతో సాగు చేసేలా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

సఖీ కేంద్రాల్లోని మహిళలను కూడా ఇందులో భాగస్వామ్యం చేయనున్నారు. **రైతుల్లో మార్పు తెస్తాం**

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించేందుకు రైతుల్లో మార్పు తెస్తాం. ఈక్రమంలోనే సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాం. అధిక మోతాదులో ఎరువుల వినియోగంతోనూ దిగుబడులు పడిపోతున్నాయి. రైతు వేదికల ద్వారా శాస్త్రవేత్తల సహకారంతో రైతులకు సాంకేతిక సహకారాన్ని అందిస్తూ చైతన్యం తెస్తున్నాం.ఎన్.మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

# సర్కారు జాగాలెక్కడ?



కరీంనగర్ : కరీంనగర్ నడిబొడ్డున భగత్‌నగర్‌లోని ఓ ఆక్రమిత స్థలాన్ని ఇలా పొక్లెయిన్‌తో నేలమట్టం చేశారు. జిల్లా పరిషత్తుకు చెందిన 2 గుంటల భూమిని దర్జాగా కొందరు కబ్జా చేశారు. బహిరంగ మార్కెట్‌లో దాదాపుగా రూ.కోటి విలువ చేసే ఈ భూమిని జిల్లా కలెక్టరు పమేలా సత్పతి ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది తిరిగి స్వాధీన పర్చుకున్నారు. అందులో నిర్మించిన రేకుల షెడ్డు, ప్రహరీని తొలగించారు. జడ్పీ క్వార్టర్స్‌కు సమీపంలోని ఈ స్థలం కొన్నేళ్లుగా కబ్జాదారుల చెరలో ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల జడ్పీ సీఈవో పరిశీలనలో ఇది కబ్జా అని తేలడంతో చర్యలు తీసుకున్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో ప్రభుత్వ భూముల విషయంలో అధికారులు ఆలస్యంగా మేల్కొన్నారు. జిల్లా కేంద్రంలోని చాలా శాఖల పరిధిలో విలువైన భూములున్నాయి. కాలక్రమేణా పలుచోట్ల ఇతరుల చేతుల్లోకి కొన్ని వెళ్లగా.. మిగిలినవి అక్కడక్కడా ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం భూ విస్తీర్ణం పక్కాగా ఉన్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం స్థలాల ఆనవాళ్లు సరిగా లేవు. గతంలో కొందరు కలెక్టర్లు ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ప్రతి మూడు నెలలకో మారు సమీక్ష చేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల ఇది ప్రభుత్వ స్థలమని గుర్తించేందుకు వీలుగా రాతి కడీలను ఏర్పాటు చేసి వాటికి నీలం, పసుపు రంగులను వేసి ఆక్రమణ కాకుండా కాపాడారు. అయితే గడిచిన దశాబ్ద కాలంగా మాత్రం ఏ శాఖకు చెందిన స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయనే విషయంలో క్షేత్రస్థాయిలో గుర్తింపు కరవైంది. అధికారులు మారుతుండటంతో ఎవరూ పట్టించుకోలేదు. దీంతో అందినకాడికి ఆక్రమణదారులు తమ భూదాహాన్ని మెల్లిమెల్లిగా తీర్చుకున్నారు.

**భూముల అన్వేషణలో భాగంగా..**ఇటీవల కరీంనగర్ పట్టణంలో సామాజిక అవసరాల కోసం ప్రభుత్వ భూములు అవసరమయ్యాయి. కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ భవనాల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయించేందుకు కేంద్ర మంత్రికి వినతిని అందించారు. ఇందులో భాగంగానే అనువైన స్థలం కోసం అన్వేషించే క్రమంలో సరైన స్థలం లభించలేదు. ఇదే విధంగా కేంద్ర నిఘా కార్యాలయం ఏర్పాటు, నార్కొటిక్ కార్యాలయం మొదలగువాటి కోసం స్థలాలు అవసరమయ్యాయి. దీంతో ఉన్నపళంగా కలెక్టరు పమేలా సత్పతి నగరంలో అన్ని చోట్ల ఉన్న స్థలాల ఆచూకీపై పక్కాగా నజర్ పెట్టాలని రెవెన్యూ, సర్వే విభాగం అధికారులను ఆదేశించారు. దీంతో పాత రికార్డులను పరిశీలిస్తూ భౌతికంగా స్థలాలెక్కడున్నాయనే దిశగా అధికారులు దృష్టి పెడుతున్నారు. ఈ క్రమంలో జడ్పీ స్థలం గుర్తించి అందులో ఉన్న రేకుల షెడ్డు కూల్చివేశారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కష్టాలు



గంగాధర : గూడు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ పథకంలో ఇల్లు నిర్మించి కల సాకారం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదట పైలట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. తర్వాత నియోజకవర్గానికి 3500 చొప్పున లక్ష్యంగా నిర్ణయించి మొదటి విడతలో కొన్నింటిని మంజూరు చేశారు. జిల్లాలో 7728 ఇళ్లకు మంజూరు ఇచ్చిన అధికారులు 3325 నివాసాలకు మార్కవుట్ ఇచ్చారు. స్థానికంగా ఇసుక లభించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

**ముంచుకొస్తున్న వర్షం ముప్పు** అసలే వర్షాకాలం.. వానలు కురిస్తే పునాదులు తవ్వడం ఇబ్బందిగా ఉంటుందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలోనైతే వాగులు, గుర్తింపు పొందిన రీచ్‌ల్లో ఇసుక లభించేది. కానీ పోలీసుల దాడుల నేపథ్యంలో నిర్మాణాలకు లభించడంలేదని ఆవేదన చెందుతున్నారు. నాలుగు దశల్లో రెండు ట్రిప్పుల చొప్పున 8 ట్రాక్టర్ల ఇసుకను ఉచితంగా ఇవ్వడానికి నిర్ణయించిన అధికారులు జిల్లాలో మొత్తం 22 ఇసుక రీచ్‌లు గుర్తించారు. బేసిమెంట్ స్థాయిలో 2 ట్రిప్పులు, గోడలు, సజ్జల స్థాయిలో రెండు, స్లాబ్ స్థాయిలో 2, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక 2 ట్రిప్పుల చొప్పున ఉచితంగా ఇసుక అందజేస్తారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించకపోవడంతో వారు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కార్యదర్శులకు అనుమతి టోకెన్లు అందజేశామని, వారిని కలవండని అధికారులు చెబుతున్నా.. స్పష్టత లేక లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ఉపాధి హామీ పథకంలో మంజూరైన పశువుల పాకల నిర్మాణానికీ ఇసుక కష్టాలు వెంటాడుతున్నాయి.

**ముగ్గు పోసి వారమైంది –లావణ్య, గంగాధర**

మా మామ నారాయణకు చెందిన రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నాం. ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరైందంటే సంతోషించాం. కానీ ఇసుక దొరక్క వారం రోజుల కింద ముగ్గు పోసి ఇబ్బంది పడుతున్నాం. వర్షాలు కురిస్తే ఇంటి నిర్మాణానికి అవస్థలు పడాల్సి ఉంటుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

**అద్దె ఇంట్లో ఉంటున్నాం– రేష్మ, పత్తికుంటపల్లి**

ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి 10 రోజులైంది. ఇసుక దొరక్క పనులు మొదలుపెట్టలేదు. వర్షాలు కురిస్తే తవ్విన పునాదిలో మట్టి కూలి ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఉచితంగా ఇసుక అందజేసి ఇంటి నిర్మాణానికి సహకరించాలి.

**కార్యదర్శులతో కూపన్లు అందజేత – గంగాధర్, గృహనిర్మాణ శాఖ పీడీ** జిల్లాలో 22 ఇసుక రీచులను గుర్తించి ఉచితంగా అందజేసేందుకు ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు టోకెన్ల జారీ బాధ్యతలు అప్పగించాం. లబ్ధిదారులు కార్యదర్శులను సంప్రదించాలి.

# సమీకృతం.. సందిగ్ధం!

కాగజ్‌నగర్: సుమారు లక్ష జనాభా నివాసం ఉంటున్న కాగజ్‌నగర్ బల్దియాలో సరైన మార్కెట్లు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. రోజూ మార్కెట్‌తోపాటు అంబేడ్కర్ చౌరస్తా, ఎల్లగౌడ్‌తోట రోడ్డు, ఎస్బీఐ రోడ్డు, ఎన్టీయార్ చౌరస్తా, సర్‌సిల్క్ కాలనీల్లో రోడ్లపై దుమ్ము ధూళి మధ్య కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి ఆదివారం నిర్వహించే సంతతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతోంది. గత భారాస ప్రభుత్వ హయాంలో 2020లో పురపాలికకు సమీకృత మార్కెట్ మంజూరైనప్పటికీ నిర్మాణానికి నోచుకోవడం లేదు. రూ.7 లక్షల నిధులు ఏళ్ల తరబడి మూలుగుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పాలకవర్గం హయాంలో అధికారులు మార్కెట్ నిర్మాణానికి అనేక స్థలాలు పరిశీలించిన అనంతరం ఆదర్శనగర్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న బారెగూడ శివారులో స్థలాన్ని ఎంపిక చేసి భూమిపూజ కూడా చేశారు. అనంతర కాలంలో వివిధ కారణాల దృష్ట్యా అక్కడి నుంచి ఇతర చోటికి తరలించి నిర్మాణం చేపట్టేందుకు తీర్మానించారు. మరోసారి పరిశీలించి ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ భవనం శిథిలావస్థలో ఉండడంతో.. దాన్ని కూల్చి మార్కెట్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

**అన్నీ ఒక్కచోటకే..**

పట్టణంతోపాటు నియోజకవర్గం, మండలంలోని అనేక గ్రామాల నుంచి వ్యాపారులు నిత్యం కాగజ్‌నగర్‌కు వస్తుంటారు. చిరు వ్యాపారులు కూరగాయలను ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూనే విక్రయాలు జరుపుతున్నారు. పూలు, పండ్లు, తాజా కూరగాయలు ఒకేచోట అమ్మకాలతోపాటు మరోవైపు మటన్, చికెన్, చేపలు తదితర మాంసం విక్రయాలకు ప్రత్యేక వసతులతో కూడిన సమీకృత మార్కెట్‌ను రూపొందించారు. ఉపాధి అవకాశాలతోపాటు వినియోగదారులకు సౌలభ్యంగా ఉంటుందన్న ఉద్దేశంతో దీని నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. అట్టహాసంగా శంకుస్థాపన చేసినప్పటికీ నేటికీ పనులు ప్రారంభం కాలేదు. లక్షల నిధులు విడుదల అయినప్పటికీ నిర్మాణాలు మాత్రం ప్రారంభం కాలేదు. ఈ నిర్మాణాలు పూర్తయితే కాగజ్‌నగర్‌లో కూరగాయలు, మాంసం, చేపలు తదితర వాటి క్రయవిక్రయాలన్నీ ఒకేచోట విక్రయించే అవకాశం ఉంటుంది.

**ముందడుగు పడేనా?**

పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహం శిథిలమైందని, ఈ స్థలంలో నిర్మాణం చేపట్టేందుకు అప్పటి పాలకవర్గం అనుమతులు తీసుకున్నారు. అతిథిగృహం భవనం కూల్చివేస్తే ఆ స్థలం అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వానికి లేఖ రాయడంతో అనుమతి లభించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత తిరిగి నిర్మాణ పనులు చేయాలని అధికారులు భావించినప్పటికీ.. టెండరు పొందిన గుత్తేదారు మృతి చెందడంతో పనులు మొదలు కాలేదు. ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 18 నెలలు గడుస్తోంది. బల్దియాలో పాలకవర్గం సైతం లేకపోవడంతో.. అధికార యంత్రాంగం స్పందించి ప్రజల అవసరాల దృష్ట్యా సమీకృత మార్కెట్ నిర్మాణానికి అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

# సిరాలపై చిగురిస్తున్న ఆశలు

భైంసా : భైంసా మండలం సిరాల శివారులో శ్రీరామసాగర్ (సిరాల) ప్రాజెక్టు 135 ఏళ్ల క్రితం నిజాం కాలంలో నిర్మించారు. అప్పట్లో నియోజకవర్గంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అది. సిరాల, ఇలేగాం, మచ్కల్, దేగాం శివారులోని 1,895 ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు నీరందేది. కాల క్రమంలో పూడిక చేరి ఆయకట్టు 1500 ఎకరాలకు పడిపోయింది. 2023 జులై 28న కురిసిన భారీ వర్షాలకు ఎగువన ఉన్న చెరువులు తెగి పోవడంతో వరద ఉద్ధృతికి కట్ట కొట్టుకుపోయింది. దీని దిగువన వరద కాలువపై నిర్మించిన కొత్త చెరువు సైతం తెగి కాలువలు దెబ్బతిన్నాయి. దీంతో రైతుల పొలాలు కొట్టుకుపోయి పూడ్చని నష్ట వాటిల్లింది. అప్పటి నుంచి రెండేళ్లుగా సాగు నీటికి నోచుకోలేదు. అధికారులు అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదించారు. 2024లో ప్రభుత్వం రూ.12.46 కోట్లకు ఆర్థికపరమైన అనుమతి ఇచ్చింది. టెండర్లు పిలిచే నాటికి వానాకాలం రావడంతో పనులు చేపట్టలేదు. ఈ ఏడాది జనవరిలో ప్రాజెక్టుతో పాటు వరద కాలువపై నిర్మించిన కొత్త చెరువు పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆరు నెలల్లో ఆనకట్ట ప్రధాన తూము పనులు పూర్తయ్యాయి. కొత్త చెరువును పునరుద్ధరించారు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. సాగు నీటిపై భరోసా కలుగుతోంది. మిగిలిన చిన్న చిన్న పనులను పూర్తి చేసి ఖరీఫ్ పంటలకు నీరందిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**కాలువల పనులు ఎలా..?**

కాలువ కొట్టుకు పోయినచోట మొరం వేశారు. కాలువ తవ్వి తీయాల్సి ఉంది. దెబ్బతిన్న చోట్ల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. 9.5 కి.మీ. పొడవు ఉన్న ప్రధాన కాలువలో ఏపుగా పెరిగిన తుంగ,



పిచ్చి మొక్కల తొలగింపు, పూడికతీత పనులు మిగిలి ఉన్నాయి. వానాకాలం రావడంతో పనులు నిలిచి పోతాయేమోనని, సాగు నీటిపై లభ్యతపై రైతుల్లో అనుమానాలు చోటు చేసుకుంటున్నాయి.

**రెండేళ్లు నష్టపోయాం ఉప్పు సంతోశ్, రైతు, ఇలేగాం**

కట్ట తెగడంతో ఇప్పటికే నాలుగు పంటలు నష్ట పోయాం. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటాయి. చెరువు పూర్తి కావడంతో సాగు నీరు అందుతుందనే నమ్మకం పెరిగింది.

**కాలువలు బాగు చేస్తేనే..**చెవుల నరేశ్, రైతు, సిరాల

చెరువు పనులు పూర్తయినా.. కాలువలు బాగులేక సాగు నీరందే అవకాశం లేదు. వానాకాలం వచ్చేసింది. పనులు చేపడుతారో లేదోనని అనుమానంగా ఉంది. వెంటనే కాలువలో తుంగ, పూడిక తొలగించి బాగు చేస్తేనే సాగు నీరందే అవకాశం ఉంది. **తుంగ తొలగించాలి**సిరం శ్రీనివాస్, రైతు, ఇలేగాంప్రధాన కాలువ పొడవునా తుంగ పెరిగింది. దిగువన ఉన్న మచ్కల్, దేగాం గ్రామాల పొలాలకు నీరు వెళ్లే అవకాశం లేదు. వెంటనే తుంగ తొలగింపు పనులు చేపట్టాలి.**సాగు నీరందిస్తాం**

అనిల్‌కుమార్‌జాదవ్, ఈఈ, నీటిపారుదల శాఖ, నిర్మల్‌ప్రాజెక్టు పనులు ఆరు నెలల్లో పూర్తి చేశాం. ఖరీఫ్‌కు సుమారు 1800 ఎకరాలకు సాగు నీరందించేందుకు సిద్ధంగా ఉన్నాం. కాలువ దెబ్బతిన్న చోట నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 15 రోజుల్లో తుంగ, పూడిక తొలగించి కాలువను శుభ్రం చేసి రైతుల పంటలకు నీరందిస్తాం.

## రైల్వే ఆస్తులు.. వినియోగిస్తే వరమే!

బిట్రగుంట : ఒకనాడు రాష్ట్రంలో బిట్రగుంట ఎంతో గుర్తింపు ఉన్న ప్రాంతం. రైల్వే పరంగా కీలకంగా ఉండేది. కాలక్రమంలో పరిస్థితులు మారాయి. ఆనాడు సమకూరిన ఆస్తులన్నీ నిరుపయోగంగా మారాయి. వందలాది ఎకరాల భూములు కంప చెట్లతో నిండిపోయాయి. వీటిని వినియోగంలోకి తీసుకొస్తే జిల్లాకు గుర్తింపు వస్తోంది. ఇందుకు జిల్లా నాయకులు ఐక్యంగా పనిచేస్తే ప్రగతి పట్టాలపైకి ఎక్కే పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది. పార్లమెంట్, రాజ్యసభలో వాణి వినిపించినా ఎలాంటి అడుగులు పడలేదు. రూ. వందల కోట్లు విలువైన రైల్వే ఆస్తులు శిథిలావస్థకు చేరాయి. జీవం పోస్తే పూర్వ వైభవం, ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది. ఆంగ్లేయుల కాలంలో దేశంలో బిట్రగుంట రైల్వేకి ప్రత్యేక స్థానం ఉంది. విజయవాడ- చెన్నై మధ్య బిట్రగుంట ఉండటంతో బ్రిటీష్ వారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో రైల్వే పరంగా అభివృద్ధి చేశారు. ఏక సమయంలో 44 స్టీమ్ ఇంజిన్లకు మరమ్మతులు చేసే సామర్థ్యంతో స్టీల్ హార్స్ రౌండ్ షెడ్, లోకోషెడ్ అనుసంధానంగా విద్య, వైద్యం, వివిధ విభాగాల కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. అయిదు వేల మంది రైల్వే కార్మికులు నివాసం ఉండటంతో బిట్రగుంట,



చుట్టుపక్కల 100 గ్రామాలకు ఉపాధి లభించేది.

**నాయకులంతా కదిలితే..**

బిట్రగుంట రైల్వే ప్రగతి జిల్లా నేతలంతా కలసి కృషి చేస్తే సాధ్యమవుతుంది. కావలి నియోజకవర్గ పరిధిలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఉన్నారు. వీరు మిగతా వారిని కూడా కూడగట్టి కార్యాచరణ చేపడితే ఇక్కడ ఆస్తులకు రక్షణతో పాటు ఉపయోగంలోకి వస్తాయి. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కూడా లభిస్తోంది.

**కళ తప్పిందిలా..**

నాలుగు దశాబ్దాల క్రితం విజయవాడ- చెన్నై మధ్య ఎలక్ట్రికల్ రైలింజన్ల ప్రవేశంతో లోకో ఇంజన్ల అవసరం లేకుండా పోయింది. లోకోషెడ్, స్టీల్ హార్స్ రౌండ్ షెడ్ మూతపడటంతో బిట్రగుంటకు ప్రాధాన్యం తగ్గింది. ఎన్ని ఉద్యమాలు చేసినా పాలకులు పట్టించుకోలేదు. ఆస్తులు శిథిలమై.. భూములు అడవిని తలపిస్తున్నాయి.

## కదలని పనులు.. 'కన్నీళ్లు'!

వరికుంటపాడు : పాలకుల హామీలు నీటిమూటగా మారుతుండగా- వందల ఎకరాలకు నీరందించే ప్రాజెక్టుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. మరోవైపు తడారిన కళ్లతో.. బీడువారిన పొలాలతో రైతుల జీవితం దుర్భరమవుతోంది. కూటమి ప్రభుత్వమైనా దృష్టిసారిస్తే.. తమ జీవితాలు పచ్చగా మారుతాయని కాంక్షిస్తున్నారు.

వరికుంటపాడు మండలంలో నక్కలగండి ప్రాజెక్టు ఉండగా- దీని కుడి కాలువ కింద వెంగమాంబాపురం, వెంగపాలెం, అశోక్‌నగర్, వేంపాడు, కాకొల్లువారిపల్లె, రామాపురం, టి.కొండారెడ్డిపల్లె, తిమ్మారెడ్డిపల్లె గ్రామాల్లో వేయి ఎకరాలు, ఎడమ కాలువ కింద ప్రకాశం జిల్లా పామూరు మండలంలోని జంగాలపల్లి, కోడిగుడ్లపాడు గ్రామాల పరిధిలో 200 ఎకరాల ఆయకట్టు ఉంది. ఎడమ కాలువ కింద రెండు కి.మీ., కుడి కాలువ కింద పది కి.మీ.మేర కాలువలు ఉండగా.. వీటి అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు నిధులు రూ.2.96 కోట్లు గతంలోనే మంజూరయ్యాయి. వీటితో 3.9 కి.మీ. మేర కాంక్రీట్ కాలువ నిర్మాణంతోపాటు పూడిక తీయాల్సి ఉంది. పనులు దక్కించుకున్న గుత్తేదారు 2018 డిసెంబరులో పనులు ప్రారంభించి.. 2020 జూన్‌కే పూర్తి చేయాల్సి ఉంది.

**గడువు దాటినా...**గత తెదేపా ప్రభుత్వంలో కాలువలకు కాంక్రీట్ పనులు జరుగుతున్న సమయంలో ఎన్నికలు వచ్చాయి. వైకాపా అధికారంలోకి వచ్చింది. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారు. అయిదేళ్లు దాటినా పూర్తికాకపోవడంతో.. సాగునీరందే పరిస్థితి లేకుండాపో యింది. పనులు పూర్తి చేసి.. చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతూనే ఉన్నా.. పట్టించుకునే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వమైనా ఆ దిశగా చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

**సాగులోకి తెచ్చేలా..**

పనులు చేసి.. కాలువ పనులు త్వరితంగా పూర్తి చేస్తే వర్షాకాలం సమయంలో ప్రాజెక్టు నిండుతుంది. చివరి ఆయకట్టుకు నీరందిస్తే పొలాలు సాగులోకి వస్తాయి.గురుస్వామి, రైతు కొప్పోలు**నీరందిస్తాం** నిలిచిపోయిన కాలువల కాంక్రీట్ పనులను తిరిగి చేయిస్తాం వాటిలో పూడిక తీయించి.. చివరి ఆయకట్టుకు నీరందిస్తాం. షట్టర్ లీకులకూ మరమ్మతులు చేయిస్తాం. టి. రమణారావు, ప్రాజెక్టు డీఈఈ

## ఆర్థిక ప్రోత్సాహకం.. ప్రతిభావంతులకు అవకాశం

సంగం: సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల విద్యార్థులు నీట్, ఐఐటీలో ప్రవేశం పొందితే వారికి రూ.లక్ష వంతున ఆర్థిక ప్రోత్సాహకం అందించాలని గురుకుల విద్యాలయ సంస్థ పాలక మండలి సమావేశంలో నిర్ణయించారు. దీంతో పేద విద్యార్థులకు ఎంతో మేలు జరగనుంది. జిల్లాలోని గురుకులాలతో పాటు మిగిలిన పాఠశాలల విద్యార్థులకు అవకాశముంది. ఇందుకనుగుణంగా పదోతరగతి నుంచి ప్రణాళికతో చదివితే ఫలితం ఉంటుంది.

**తొలి విడత...**సాంఘిక సంక్షేమశాఖ బాల, బాలికల గురుకుల పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశం కోసం సాధారణంగా ప్రతి ఏటా పదోతరగతి వార్షిక పరీక్షలకు ముందుగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఆయా విద్యాలయాలతో పాటు ఎస్సీ, బీసీ సంక్షేమశాఖ వసతి గృహాలు, సాధారణ పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులు ముందుగా దరఖాస్తు చేసుకొని హాజరు కావాలి. అందులో ప్రతిభ చూపితే జిల్లాలోని సంగం, బుచ్చిరెడ్డిపాళెం, కోడూరు, ముత్తుకూరు, కండలేరు, పెద్దపవని గురుకుల పాఠశాలల్లో ప్రవేశం లభిస్తుంది.

**ఆరు బాలికలకే...**చీపురుపల్లి, పిఠాపురం, ద్వారకా తిరుమల, కుంటముక్కల, సింగరాయకొండ, కుప్పం బాలికలకు, శ్రీకృష్ణాపురం, అడవితక్కెళ్లపాడు, బి.పప్పూరు, చిన్నటేకూరు బాలురకు కేటాయించారు. వాటిలో ఉచితంగా ఇంటర్ విద్యాబోధనతో పాటు ఉన్నత కోర్సులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా నియమించిన అధ్యాపక నిపుణులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకొని సంగంలోని బాలికల గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు సుమతి తెలిపారు. **500 మార్కులు సాధించి...**తొలి విడత ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు పదోతరగతిలో 500 మార్కులు సాధిస్తే వారికి తిరిగి రెండోసారి పరీక్ష నిర్వహిస్తారు. 50 మార్కులకు జరిగే పరీక్షలో గణితం, భౌతిక, వృక్షశాస్త్రంలో 25 మార్కుల వంతున మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 25 వంతున ప్రశ్నలుంటా యి. ఎంపీసీ కావాలనుకుంటే గణితం, భౌతిక, బైపీసీ అనుకుంటే భౌతిక, వృక్షశాస్త్రం పరీక్ష రాయాలి. అందులో ప్రతిభ చూపితే నీట్, ఐఐటి ప్రవేశాలకు ఎంపికయ్యేందుకు ఉన్నతమైన శిక్షణ ఇచ్చేందుకు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పది గురుకుల పాఠశాలల్లో ప్రవేశించేందుకు అవకాశముంది.

# శిలగానే.. మిగిలి దుఃఖిస్తోంది



తిరుపతి : తితిదే పరిధిలో విగ్రహాల తయారీ మందగించింది. కపిలతీర్థం- అలిపిరి రహదారిలోని శిల్ప కళాశాల అనాదిగా ఎన్నో ఆలయాల విగ్రహాల ప్రతిష్ఠలో కీలకభూమిక పోషిస్తోంది. ఇక్కడి నుంచి విగ్రహాలు కావాలని తీసుకెళ్లే వారిసంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. అయితే గత ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం.. ప్రస్తుత అధికారుల తీరుతో తయారీ నెమ్మదించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడు మాసాలుగా సరిపడా కృష్ణశిలల కొరత నెలకొనడంతో అవసరార్థులు ప్రదక్షణలు చేస్తున్నారు.

తితిదే ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో నూతన ఆలయాల నిర్మాణం, విగ్రహాల సరఫరా ఒకటి. ఎవరైనా విగ్రహాలు కావాలని అడిగితే 75% రాయితీపై అందిస్తోంది. హరిజన, గిరిజనవాడల్లో ఆలయాలు ఉంటే పూర్తిగా ఉచితం. ఏటా 1,200 నుంచి 1,500 విగ్రహాల వరకు తితిదే శిల్ప కళాశాలలో విగ్రహాలు ప్రాణం పోసుకుంటున్నాయి. కళాశాలలో చదివిన విద్యార్థులు ఇక్కడే వాటి తయారీలో పాలుపంచుకుంటూ ఉపాధి పొందుతున్నారు.

**కృష్ణ శిలలకు డిమాండు**

విగ్రహాల తయారీకి కృష్ణశిలలు ప్రసిద్ధి. పేరెన్నికగల ఈ శిలలు కంచికి 28 కి.మీ. దూరంలోని మూడు గ్రామాల్లో దొరుకుతాయి. తిరుచ్చి సమీప పరిసరాల్లో లభిస్తాయి. తితిదేకు ఏటా తొమ్మిదివేల చదరపు అడుగుల శిలలు అవసరం కావడంతో వాటి సరఫరా కోసం టెండర్లు పిలుస్తుంది. చదరపు అడుగు మార్కెట్లో రూ.800-1,200 వరకు ఉంది.

**సకాలంలో అందించలేక..**

గత ప్రభుత్వంలో సరైన సమయానికి విగ్రహాలు అందించలేకపోవడంతో 600 నుంచి 800 విగ్రహాలు కళాశాలకే పరిమితం అయినట్లు సమాచారం. దీంతో వాటిని దేవస్థానం అధికారులే అవసరం ఉన్న చోటుకు తరలించాల్సి వచ్చినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం డిమాండు ఉన్నా 75% వరకు విగ్రహాలు మాత్రమే అందించగలుగుతున్నట్లు అధికారులు, శిల్పులు చెబుతున్నారు. మరోవైపు ఉచితంగా శిలలు పొందడానికి నిబంధనలు కఠినంగా ఉండటంతో ఆయా ఆలయాల నిర్వాహకులు తమకు విగ్రహాలు సమయానికి అందించలేకపోతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**భూమి కోసం పోరాటం.. టెండర్ల ప్రక్రియ పూర్తయింది**

శిల్ప కళాశాల అవసరాలకు రూ.కోటి విలువైన కృష్ణశిలల సరఫరాకు టెండర్ల ప్రక్రియ పూర్తిచేశాం. అగ్రిమెంట్ దశలో ఉంది. త్వరలో శిలల తయారీకి నాణ్యమైన శిలలు అందుబాటులోకి వస్తాయి. ఆవెంటనే విగ్రహాలు తయారు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.మనోహరం, ఇన్‌ఛార్జి ఎస్ఈ, తితిదే ఇంజినీరింగ్ విభాగం

# నిధులు నా'కేసీ'.. నాణ్యత వదిలేసి



కర్నూలు : కడప-కర్నూలు కాల్వ.. ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు నీరందిస్తుంది.. గత ఐదేళ్లుగా దీని నిర్వహణ చేపట్టలేదు.. వైకాపా చిల్లిగవ్వ విదల్చలేదు.. కాల్వ నిర్వహణపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది.. ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) కింద రూ.16.75 కోట్లు మంజూరు చేశారు. కాల్వ మూడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది.. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లాలోని 37 పనులకు రూ.3.17 కోట్లు, నంద్యాలలో 96 పనులకు రూ.7.67, వైఎస్సార్ కడపకు రూ.5.89 కోట్లు విడుదల చేశారు. పనులన్నీ సాగునీటి సంఘాలకు అప్పగించారు. పర్యవేక్షణ కొరవడింది.. త్వరలో కాల్వకు నీటిని విడుదల చేయనున్నారు. హడావుడిగా చేస్తున్నారు. పొదల తొలగింపు (జంగిల్ క్లియరెన్స్) పనుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది.ఉమ్మడి కర్నూలు జిల్లాలో కాలువల నిర్వహణ పనులకు ప్రభుత్వం రూ.25.91 కోట్లు మంజూరు చేసింది. వీటితో 337 పనులు చేపట్టాల్సి ఉంది.తుంగభద్ర దిగువ కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, తెలుగుగంగ, కేసీ కాలువ, ఎస్సార్బీసీ కాలువలు, స్లూయిస్‌లు, షట్టర్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్, కరకట్టల బలోపేతం చేయాల్సి ఉంది.

**పేరు ఒకరు.. చేస్తోంది మరొకరు**

పనులన్నీ సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దస్త్రంలో నమోదు చేస్తున్నారు.. చేస్తుంది మాత్రం గ్రామస్థాయి నేతలు.

కొన్ని మండలాల్లో నేతలు పెత్తనం చేసి గంపగుత్తుగా తీసుకొన్నారు. కమిషన్ పద్ధతిలో చేస్తున్నారు. ప్రత్యేకించి బండిఆత్మకూరు, గడివేముల, ఉయ్యాలవాడ, నంద్యాల, శిరువెళ్ల, చాగలమర్రి, కోడుమూరు ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.

**పొదల మాటున అక్రమాలు**

కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం, నంద్యాల, బనగానపల్లి, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల్లోని కేసీ కాల్వలో జంగిల్ క్లియరెన్స్‌కు నిధులు కేటాయించారు. ఓఅండ్ఎం నిధుల్లో 10 శాతం అంటే రూ.కోటి నిధులు మంజూరు చేశారు. పనులన్నీ పైపైనే సాగాయి. పిల్ల కాల్వ జోలికి వెళ్లడం లేదు. ఇసుక మేటలు తొలగించడం లేదు.

**నిర్వహణలో నిస్తేజం**

ఓ అండ్ ఎం నిధులతో చేపట్టాల్సిన పనులను సాగునీటి సంఘాలకు అప్పగించినా నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. పనులకు సంబంధించిన బిల్లు మొత్తంలో సంబంధిత ఇంజినీర్లు, కొందరు నేతలకు కమీషన్లు ఇవ్వాల్సి ఉండటంతో తమకు మిగిలేదేమీ ఉండదని కొందరు సాగునీటి సంఘాల అధ్యక్షులు పేర్కొంటున్నారు. దీనికితోడు తక్కువ సమయమిచ్చి పనులు నాణ్యంగా చేయాలంటే ఎలా సాధ్యమని కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ఎల్లెల్సీకి చెందిన కొందరు డీసీ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

**'మట్టి'కొట్టారు**

ఓఅండ్ఎం పనుల్లో నాణ్యత ఎక్కడా కనిపించడం లేదు. బండిఆత్మకూరు మండలం భోజనం-పరమటూరు గ్రామాల మధ్య కెనాల్ మీద సుమారు 2 కి.మీ. మేర రూ.9 లక్షలతో చేస్తున్న పనులు నాసిరకంగా ఉన్నాయి.

గడివేముల మండలం పెసరవాయి సమీపంలో జరిగిన కాల్వ పనుల్లో నాణ్యత తేలిపోయింది. ఇక్కడ గ్రావెల్ స్థానంలో సుద్ద మన్ను వినియోగిస్తున్నారు.

నూనెపల్లె సప్లయ్ ఛానల్ నుంచి తెల్లపురి వరకు రూ.7.32 లక్షలు, బిల్లాలాపురం ప్రధాన ఛానల్‌ను రూ.7.36 లక్షలు వెచ్చించి పటిష్ఠం చేయాలని నిర్ణయించారు. ఇందుకు వినియోగిస్తున్న గ్రావెల్ ఏమాత్రం నాణ్యతగా లేదు.

శిరివెళ్ల, ఉయ్యాలవాడ, నంద్యాల, బనగానపల్లి, గోస్పాడు, చాగలమర్రి మండలాల్లో కట్టపై రోలింగ్ చేయడం లేదు.

కందకాలు తవ్వి మట్టితో గ్రావెల్ పనులు జరగాల్సి ఉండగా ఎక్కడా ఆవిధంగా చేపట్టలేదు.

# పేదల కాలనీ.. పెద్దల భవంతి

నంద్యాల : ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తామని గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసింది.. జగనన్న కాలనీల పేరిట అందినకాడికి దోచుకొన్నారు. ఇళ్ల పట్టాలు అనర్హులకు కట్టబెట్టారు. వైకాపా సానుభూతిపరులకు ఇచ్చేశారు. కానాల జగనన్న కాలనీల్లోని లేఅవుట్లల్లో 1- 96, 2- 146 ప్లాట్లు ఉన్నాయి. నంద్యాల- కోవెలకుంట్ల రహదారి పక్కనే ఉండటం, చుట్టూ ప్రైవేటు, గ్రేటర్ కమ్యూనిటీ వెంచర్లు ఉండటంతో అందరి చూపు ఆ లేఅవుట్లలోని ప్లాట్లపై పడింది. లేఅవుట్-2లో రాజకీయ నాయకులు తమ బినామీలకు పట్టాలు ఇచ్చేశారు. 50 ప్లాట్ల వరకు అమ్మేసుకొన్నారు. 'కూటమి' ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

**వెలుస్తున్న భవనాలు**

ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుంటే రద్దు చేస్తారనే అభిప్రాయంతో చకచకా నిర్మాణాలు చేపడుతున్నారు. లేఅవుట్-1, 2, లలో భవంతులు వెలుస్తున్నాయి. గ్రామానికి చెందిన వైద్యుడు మూడు ప్లాట్లను కొనుగోలు చేసి పెద్ద భవన నిర్మాణం చేపడుతున్నారు. ఓ మండల స్థాయి ప్రజాప్రతినిధి తమ బంధువు పేరుతో పట్టా తీసుకుని పక్కనే ఉన్న



మరో ప్లాటును కొనుగోలు చేసి రెండు కలిపి ఒకే భవనంగా నిర్మిస్తున్నారు. మరో గ్రామ ప్రజాప్రతినిధి రెండు పట్టాలను కలిపి గృహరుణం పొందకుండా నిర్మాణం చేపట్టారు. " జగనన్న కాలనీల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు మా దృష్టికి వచ్చింది. సంబంధిత అధికారుల వివరణ కోరడంతోపాటు విచారణకు ఆదేశించాం. వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు' తహసీల్దార్ సత్య శ్రీనివాసులు తెలిపారు.

## జలఘోష తప్పేనా..?

భీమవరం : కూటమి ప్రభుత్వంలో పంట కాలువలకు ప్రాధాన్యం ఇస్తారని అంతా భావించారు. అందుకు తగ్గట్టుగానే జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపించారు. అయితే నిధులు లేమి ఉందంటూ ఆర్థిక శాఖ అనేక మెలికలు పెడుతోంది. ఇప్పుడదే పశ్చిమ డెల్టా రైతులకు శాపంగా మారుతోంది. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కృషితోఈ ఏడాదైనా జలఘోష తప్పేనా అని రైతులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

పంట కాలువల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. వేసవిలో కాల్వలు, డ్రెయిన్‌లకు మరమ్మతు పనులు చేపట్టాలి. ప్రభుత్వానికి ఏనాడో ప్రతిపాదనలు పంపారు. పశ్చిమ డెల్టా పరిధిలో వేసవి మరమ్మతులకు రూ.40 కోట్లు అవసరమని అంచనా వేశారు. ప్రణాళికలు రూపొందించారు. నీటి సంఘాలు ఏర్పడడంతో రైతుల్లోనూ ఆశలు చిగురించాయి. కాలువలు ప్రక్షాళన జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ ఏడాది రైతుల ఆశలు తల్లకిందులయ్యే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా జలవనరుల శాఖ అధికారులు పంపిన ప్రతిపాదనలు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అక్కడ క్లియరెన్స్ అయితేనే నిధులు మంజూరవుతాయి. ఒక దశలో ప్రతిపాదనలను ఆర్థిక శాఖ తిరస్కరించింది. ప్రతిపాదనల విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి ఆమోదం పొందేలా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పనుల నిర్వహణకు కాలాతీతమైంది. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉన్నాయి. వాతావరణ శాఖ ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. అదే జరిగితే మంచినీటి చెరువుల్లో నీరు అడుగంటిపోనుంది. జూన్ మొదటి వారంలోనే మళ్లీ కాలువలకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఇటువంటి లెక్కలు వేసుకుని జలవనరుల శాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నెల రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఆలోగా కాలువలు, డ్రెయిన్‌లలో పూడిక తీయాలి. గుర్రపుడెక్క, తూడు, కర్రనాచు తొలగించాలి. గట్లు బలహీనంగా ఉన్నచోట పటిష్టం చేయాలి. లేదంటే గండ్లు పడి పంట పొలాలు ముంపుబారిన పడే ప్రమాదం ఉంది. గడచిన ఖరీఫ్‌లో గండ్లతో అధిక నష్టం వాటిల్లింది. మరోవైపు డ్రెయిన్‌లు ఎగదన్ని పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. వేసవిలో పనులు చేపడితే ముంపు నుంచి గట్టెక్కవచ్చని అంతా అభిప్రాయపడ్డారు.

**నీటి సంఘాల్లోనూ నిరుత్సాహం**

వేసవి పనులు చేపట్టడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫల మైంది. ఆ ప్రభావం రైతులపై పడుతోంది. రెండు రోజులపాటు వర్షాలు కురిస్తే పొలాలు నీట మునుగుతున్నాయి. నారుమళ్లు దెబ్బతింటున్నాయి. లేదంటే నాట్లు కుళ్లిపోతున్నాయి. గడచిన ఖరీఫ్‌లో రైతులు ఇలాంటి ఇబ్బందులే పడ్డారు, రెండు పర్యాయాలు పంటకు నష్టం వాటిల్లింది. డ్రెయిన్‌లు, కాలువలు పూడుకుపోవడంతో కొద్దిపాటి వర్షాలకు డ్రెయిన్‌లు ఎగదన్నుతున్నాయి. జలవనరుల శాఖ ఈ విషయాన్ని గుర్తించింది. పనులు చేపట్టాలని ముందుగానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. పశ్చిమ డెల్టా పరిధిలో కాలువలు, డ్రెయిన్‌ల మరమ్మత్తుల కోసం రూ.40 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నీటి సంఘాలను ఏర్పాటు చేయడంతో రైతుల్లోనూ ఉత్సాహం నెలకొంది. నీటి సంఘాల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. కాలువులు, డ్రెయిన్‌లలో సమస్యలను గుర్తించారు. అధికారులకు వివరాలు సమర్పించారు. పనుల అవసరాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ స్థాయిలో ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండడంతో నీటి సంఘాల్లోనూ నిరుత్సాహం నెలకొంది.

**నెల రోజులే గడువు** వేసవిలో పనులు చేపట్టడానికి నెల రోజులు మాత్రమే గడువు ఉంది. జూన్ మొదటివారంలో కాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. వేసవి పనులకు మే నెల కీలకం. ప్రభుత్వ స్థాయిలో నిధులు మంజూరు చేస్తే పనులు కేటాయిస్తారు. నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. వాస్తవానికి రూ.10 లక్షలపైన పనులు అయితే టెండర్‌లు పిలవాలి. లేదంటే నీటి సంఘాల ద్వారా నామినేషన్ పద్ధతిలో చేస్తారు. ప్రస్తుతం నిధులు మంజూరు చేసినా సరే టెండర్‌లు పిలిచే అవకాశం లేదు. అంత సమయం లేదు. స్వల్పకాలిక టెండర్లు పిలిచినా వారం రోజుల సమయం పడుతుంది. అయినా సరే టెండర్లు ఖరారవుతాయన్న భరోసా లేదు. కాంట్రాక్టర్‌లకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో జలవనరుల శాఖ పనులుంటేనే హడలి పోడుతున్నారు. దీంతో నీటి సంఘాల ద్వారానే పనులు చేయించాలని అధికారులు యోచిస్తున్నారు. ఈసారి నామినేషన్‌లోనే పనులు చేపడితే వేగవంతంగా పూర్తవుతాయన్న నమ్మకంతో అధికారులు వేచి చూస్తున్నారు.

## గుండ్లకమ్మ.. అదిరిందమ్మా!

మద్దిపాడు : గత వైకాపా ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గుండ్లకమ్మ జలాశయానికి మంచి రోజులొచ్చాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక దృష్టిసారించింది. పలుమార్లు మంత్రులు గొట్టి పాటి రవికూమార్ , డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్ సందర్శించారు. మొత్తం 14 గేట్లకు మరమ్మతులు పూర్తిచేసి, చివరి దశ మరమ్మతుల్లో ఉన్న గేటును స్టాప్‌లాక్‌తో బంధించారు. ప్రస్తుతం జలాశయంలో 23 మీటర్ల ఎత్తులో 2.61 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. జలాశయంలోకి 28 లక్షల చేప పిల్లలను వదిలి మత్స్య సంపదను పెంచడానికి దోహదం చేశారు. పర్యాటక శాఖ



ద్వారా జలాశయ పరిసర ప్రాంతాల్లో కాటేజీలతోపాటు రెస్టారెంట్లు, బోటింగ్ తదితర సౌకర్యాలు కల్పించారు. జలాశయం ద్వారా ఆరు మండలాల ప్రజలతోపాటు ఒంగోలు నగరానికి తాగునీరు, కాలువల ద్వారా ఆయుకట్టు భూములకు సాగునీరందుతోంది. ఈ విషయంపై డీఈ శివనాగరాజు మాట్లాడుతూ గతంలో రెండు గేట్లు కొట్టుకుపోవడంతో రెండేళ్లపాటు జలాశయంలో తగినంత నీటి నిల్వల్లేవని, ఎన్డీయే ప్రభుత్వ నిర్ణయంతో తిరిగి గేట్లు ఏర్పాటు చేయడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగిందన్నారు. గత ఖరీఫ్‌లో పంటలకు సాగునీరందించామని, ఈ ఏడాది సాగుకు సమృద్ధిగా నీరు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.


చురకలు



# సాగర్ కాలువలకు నిధుల వరద!

ఒంగోలు : సాగర్ కుడి కాలువ పరిధిలోని మేజరు, మైనరు కాలువల ఆధునికీకరణకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గత వైకాపా ప్రభుత్వంలో నిధులు విదల్చకపోవడంతో కాలువల్లో పూడిక పెరిగిపోయి నీటి ప్రవాహానికి అడుగడుగునా ఆటంకాలేర్పడ్డాయి. రామతీర్థం జలాశయం వద్ద 300 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే మైనరు కాలువలకు చేరే సరికి వంద క్యూసెక్కులు కూడా రావడం లేదు. దీంతో తాగునీటి చెరువులను నింపడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సంతనూతలపాడు, ఒంగోలు పరిధిలో సాగునీరు సక్రమంగా అందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. నిరాదరణకు గురైన కాలువల పరిస్థితిని గుర్తించిన ఎన్డీయే ప్రభుత్వం కాలువల మరమ్మతులకు నిధులు కేటాయించింది. దర్శి, చీమకుర్తి, అద్దంకి పరిధిలో మొత్తం 205 పనులు గుర్తించి రూ.954.47 లక్షలు మంజూరు చేసింది. పర్చూరు, అద్దంకి, దర్శి, కొండపి, ఒంగోలు, సంతనూతలపాడు, యర్రగొండపాలెం పరిధిలోని కాలువల మరమ్మతులకు కనిష్ఠంగా రూ.76 లక్షలు నుంచి గరిష్ఠంగా రూ.2 కోట్లు కేటాయించింది.

**సాగునీటి సంఘాల ద్వారా పనులు**



ఇటీవల ఆయకట్టు పరిధిలో ప్రాజెక్టు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వీరితోనే పనులు చేయించాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆ మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని సాగర్ కాలువ పరిధిలో గుర్తించిన పనులకు ఇంజనీర్లు అంచనాలు రూపొందించారు. త్వరలో వర్క్ ఆర్డర్లు ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒంగోలు పరిధిలో ఇప్పటికే వర్క్ఆర్డర్ల పనులు పూర్తయ్యాయి. సంతనూతలపాడు, దర్శి పరిధిలో కొన్ని మేజర్ పనుల విషయంలో వివాదం కొనసాగుతోంది. వీటి పరిధిలో 12 పనులు ఉండగా, వాటిని ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు తాము చేస్తామని కోరుతున్నారు. వాటిని తమకు కేటాయించాలని డిస్ట్రిబ్యూటరీ కమిటీలు కోరుతున్నాయి. దీనిపై ఇంతవరకు స్పష్టత రాక పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. ఈ విషయమై జలవనరులశాఖ ఎస్ఈ వరలక్ష్మి మాట్లాడుతూ త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# అదనపు లోడు.. ఆదాయం బోలెడు!

ఒంగోలు : విద్యుత్తు అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఆశాఖ 50 శాతం రాయితీనిస్తూ చేసిన ప్రకటనకు చక్కటి స్పందన లభించింది. ఇందు కోసం మార్చి 1వ తేదీ నుంచి జూన్ నెలాఖరు వరకు దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో పెద్దసంఖ్యలో వినియోగదారులు ముందుకొచ్చారు. ప్రస్తుతం ఇంట్లో పెరిగిన విద్యుత్తు వాడకానికి అనుగుణంగా అదనపు లోడు చెల్లించారు. జిల్లాలోని 46,791 విద్యుత్తు సర్వీసులకు సంబంధించి క్రమబద్ధీకరణ దరఖాస్తు నిమిత్తం 83,289 కిలోవాట్ల అదనపు లోడుకు రూ.9,54,53,100 మేర నగదు జమ చేశారు.

**పెరిగిన వినియోగం... :** కొత్తగా విద్యుత్తు కనెక్షన్ మంజూరు నిమిత్తం ప్రస్తుతం గ్రామాల్లో కనీసం కిలోవాట్, పట్టణాల్లో రెండు కిలోవాట్ చొప్పున దరఖాస్తు చేయిస్తున్నారు. పదేళ్ల కిందట గృహాల్లోని ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం ఆధారంగా 0.5 కిలోవాట్ లోడ్‌కు మాత్రమే రుసుం చెల్లించేవారు. కాలక్రమేణా ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరిగింది. ప్రత్యేకించి ఏసీల వాడకం బాగా పెరగడంతో పల్లెలు.. పట్టణాలు తేడా లేకుండా లోఓల్టేజీ సమస్య పెరిగింది. దానికనుగుణంగా అవసరమైనచోట పరివర్తకాలు ఏర్పాటు చేయడంలో అధికారులు



జాప్యం చేశారు. జిల్లావ్యాప్తంగా విద్యుత్తుశాఖాధికారుల బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించి అదనపు లోడు రుసుం విధిస్తున్నారు. దీంతో పునఃపరిశీలనకు కొందరు అర్జీలు పెట్టడం...మరికొందరు రుసుం చెల్లించడంలో జాప్యం చేయడంతో నియంత్రికలు ఏర్పాటుకు నిధుల సమస్య వెంటాడుతోంది. తాజాగా ఖజానాకు నిధులు సమకూరడంతో నాణ్యమైన విద్యుత్తును అందించే దిశగా పరివర్తకాలు ఏర్పాటు చేయనున్నారు.

**లెక్కింపు ఇలా..**

ఇంట్లోని విద్యుత్తు పరికరాల వినియోగం ఆధారంగా లోడు అంచనా వేసి దాన్ని కిలోవాట్లలో లెక్కిస్తారు. కిలోవాట్‌కు విద్యుత్తుశాఖకు సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డెవలప్‌మెంట్ రుసుం రూ.2 వేలు, దరఖాస్తుకు మరో రూ.50 చెల్లించాలి. అంటే అదనంగా కిలోవాట్‌కు చెల్లించాల్సిన రుసుం రూ.2,250 అయితే...అందులో డెవలప్‌మెంట్ రుసుం రూ.2 వేలులో మాత్రమే 50 శాతం రాయితీ ఇచ్చారు. తద్వారా ఒక్కో కిలో వాట్‌కు రూ.1,250 చొప్పున వసూలు చేశారు. ఎంత అదనపు లోడు ఉన్నా క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇచ్చారు. దీంతో ఎక్కువ మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి చెల్లించారు.

# పీఏబీఆర్‌కు హంద్రీనీవా జలాలు



అనంతపురం: కూటమి ప్రభుత్వం రాగానే ఎన్నడూ లేనంతగా హంద్రీనీవా ప్రాజెక్టుకు రూ.3,440 కోట్లు కేటాయించింది. వేగంగా కాలువ విస్తరణ పనులు చేపట్టి.. దాదాపు పూర్తి చేసింది. ఈనెల 15న హంద్రీనీవాకు నీరు విడుదల చేయనున్న నేపథ్యంలో మాల్యాల నుంచి 3,850 క్యూసెక్కుల నీటిని తీసుకునేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. విడతల వారీగా 10 పంపుల నుంచి నీటిని ఎత్తిపోసి జీడిపల్లికి తరలించేలా ప్రణాళికలు రూపొందించారు. గతంలో మాల్యాల నుంచి 6 పంపుల ద్వారా 2 వేల క్యూసెక్కుల నీటిని తీసుకునేవారు. మొత్తం 12 పంపులు వాడితే 3,850 క్యూసెక్కులు తీసుకునే అవకాశం ఉంది. ఆ మేరకు మాల్యాల నుంచి జీడిపల్లి వరకు 216 కిలోమీటర్ల మేర విస్తరణ పూర్తి కావడంతో 120 రోజుల్లోనే 40 టీఎంసీలు తీసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. దీంతో నీటిని చిత్తూరుకు విడుదల చేయడంతో పాటు ఉమ్మడి అనంత జిల్లా అవసరాలను తీర్చుకునే వీలుంటుంది. మడకశిర బ్రాంచి కాలువ, భవిష్యత్తులో చేపట్టబోయే జీడిపల్లి–పేరూరు, జీడిపల్లి– భైరవానితిప్ప ప్రాజెక్టులకు జలాలను మళ్లించవచ్చు.

**95 శాతం మేర పూర్తి**

కాలువ 88వ కి.మీ. నుంచి 216 కి.మీ. వరకు రెండు ప్యాకేజీలుగా చేపట్టిన విస్తరణ పనులు 95 శాతం పూర్తయ్యాయి. మిగిలిన 5 శాతం వారంలో కొలిక్కి రానున్నాయి. జీడిపల్లి జలాశయం నుంచి పుంగనూరు బ్రాంచి కెనాల్ వరకు చేపట్టిన లైనింగ్ పనులు 60 శాతమే పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో కృష్ణా జలాలను జీడిపల్లి నుంచి పీఏబీఆర్‌కు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 2 టీఎంసీలు ఉండగా మరో 3 టీఎంసీలకు అవకాశం ఉంది. పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా ఉరవకొండ, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లోని 42 చెరువులను నింపి 52 వేల ఎకరాలకు నీరందించవచ్చు. పీఏబీఆర్ నుంచి ఎంపీఆర్‌కు నీటిని తరలించి శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల అవసరాలను తీర్చవచ్చు.

**160 చెరువులకు నీరు!** ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్‌తో పాటు చెరువులకు నీరందించే తూముల నిర్మాణంపైనా అధికారులు దృష్టి సారించారు. వీలైనంతగా కాలువలు, అవకాశం లేని చోట వంకల ద్వారా గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లోని చెరువులకు నీటిని మళ్లిస్తారు. లైనింగ్ పూర్తయితే ఉమ్మడి అనంత జిల్లాలోని 160 చెరువులను నింపే అవకాశం ఉంది.

# జీవ వైవిధ్యానికి ఊపిరి



అమలాపురం : మడ అడవులు జీవ వైవిధ్యానికి నిలయాలుగా ఉంటున్నాయి. కొంత కాలంగా సముద్ర తీరం, చిత్తడి నేలల్లోని వీటిని కొందరు ధ్వంసం చేసి అక్రమంగా చెరువుల తవ్వేస్తున్నారు. ఫలితంగా వీటి విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఈ పరిణామాలు జీవవైవిధ్యానికి గొడ్డలి పెట్టుగా మారే ప్రమాదం ఉండటంతో అటవీశాఖ స్పందించింది. వీటి పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. గతంలో ఉన్న మడ అడవుల్లో చెట్లు చనిపోయిన చోట, ధ్వంసమైన ప్రాంతాల్లో కొత్తగా మొక్కలు నాటుతున్నారు. నేరుగా మొక్కలను నాటడం వల్ల పూర్తి స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో సీడ్ డిబ్లింగ్ విధానంలో లక్ష్యాలను సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**చేప ముల్లు ఆకారంలో...**

మడ అడవులు ఉన్నచోట నిటారుగా ప్రధాన కాలువ..దానికి అనుసంధానంగా చేప ముల్లు ఆకారంలో ఉప కాలువలను ఏర్పాటు చేస్తారు. మడ వనాల్లోని చెట్ల విత్తనాలు మొలకెత్తిన తర్వాత కిందకు రాలుతాయి. ఇవి సముద్రం, గోదావరి జలాల పోటు–పాటులకు చేపముల్లు ఆకారంలోని ప్రధాన కాలువ ద్వారా ఉప కాలువల్లోకి ప్రవేశించి అక్కడ గట్లపై స్థిరపడి మొక్కలు పెరుగుతాయి. ఈ ప్రక్రియ సత్ఫలితాలు ఇవ్వడంతో అధికారులు కొన్నేళ్లుగా ఈ విధానంలోనే మడ అడవులను అభివృద్ధి చేస్తున్నారు. గత ఏడాది 750 ఎకరాలు, ఈ సంవత్సరం 500 ఎకరాల్లో ఈ విధానంలో మడ అడవులను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**ఎంతో ఉపయోగం:** సముద్ర తీరం వెంబడి సహజ సిద్ధంగా ఏర్పడినవే మడ అడవులు. ఇవి విపత్తుల సమయంలో తుపాను గాలుల వేగాన్ని తగ్గిస్తాయి. ఆ ప్రాంతంలో సముద్రపు పోటు వల్ల తీరం కోతకు గురి కాకుండా కాపాడతాయి.

**జిల్లాలో ఇలా..** జిల్లాలో 16,250 ఎకరాల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. ఇవి ఎక్కువగా తీర ప్రాంత మండలాలు అల్లవరం, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో సముద్ర, గోదావరి తీర ప్రాంతాల్లో ఎక్కువగా పెరుగుతున్నాయి. మడ అడవులు విస్తారంగా పెరగాలంటే పాటు, పోట్లు ఉండాలి. నీరు నిల్వ ఉన్నా, అసలు నీరు లేకున్నా ఈ చెట్లు చనిపోతాయి. 20 ఏళ్లుగా ఈ మండలాల పరిధిలో సుమారు 1500 ఎకరాల్లో మడ అడవులు ధ్వంసమయ్యాయి.

**సంరక్షణకు ప్రత్యేక చర్యలు**

జిల్లా వ్యాప్తంగా మడ అడవులను ప్రత్యేక చర్యల ద్వారా సంరక్షిస్తున్నాం. ఖాళీలు ఏర్పడిన ప్రదేశాల్లో వాటిని పెంచేందుకు చేప ముల్లు సాంకేతికతను వినియోగిస్తున్నాం. ఇది మంచి ఫలితాలను ఇస్తోంది.

–ప్రసాద రావు, జిల్లా అటవీశాఖ అధికారి


# బంకుల్లో బొంకులు

విజయనగరం : నగరంలోని ఓ బంకు వద్ద ప్రైవేటు ఉద్యోగి బైక్‌లో పెట్రోల్ వేయించారు. అప్పటి నుంచి తరచూ ఆగిపోతుండేది. కొన్ని రోజుల తరువాత సిబ్బందిని వెళ్లి ప్రశ్నించగా.. నచ్చితే రండి లేకపోతే పోండి అని చెప్పేశారు. చేసేది లేక అతడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. పూల్‌బాగ్‌లోని బంకులో ఓ మహిళ లీటరు పెట్రోలు కొట్టించి, పయనమయ్యారు. మూడు కిలోమీటర్లు కూడా వెళ్లకుండానే బండి ఆగిపోయింది. మెకానిక్ వద్దకు వెళితే పెట్రోల్ అయిపోయిందని చెప్పారు. వెంటనే ఆమె సదరు నిర్వాహకులను ప్రశ్నించగా కొట్టేంత పనిచేశారు. ఉమ్మడి జిల్లాలోని పలు బంకుల్లో యథేచ్ఛగా అక్రమాలు జరుగుతున్నాయి. కల్తీ చేసి అమ్మేస్తున్నారని ఆరోపణలున్నాయి. కొన్నేళ్లుగా నమోదవుతున్న కేసుల సంఖ్య ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది. గత నాలుగేళ్లలో 123 మంది నిర్వాహకులపై కేసులు పెట్టారు. అయినప్పటికీ దందా ఆగడం లేదు. దీంతో వాహన చోదకులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**సౌకర్యాలేవీ..** రెండు జిల్లాల్లో 180 వరకు బంకులున్నాయి. వీటిల్లో ఇప్పటికే తరచూ దాడులు చేపట్టారు. కొందరు నిర్వాహకులకు జరిమానాలు సైతం విధించారు. విజయనగరం, బొబ్బిలి, భోగాపురం, పార్వతీపురం తదితర ప్రాంతాల్లో కొన్నిచోట్ల కల్తీ సాగుతోందనే ఫిర్యాదులున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు 45 చోట్ల తనిఖీలు చేయగా.. 10 చోట్ల అక్రమాలను గుర్తించారు. ఈమేరకు రూ.2.33 లక్షల జరిమానా వేశారు.

**నిబంధనలివీ..**

జీరో రీడింగ్ తప్పనిసరి



వినియోగదారులు అడిగిన వెంటనే తనిఖీ చేసేందుకు ఫిల్టర్ ఇవ్వాలి. దానిపై రెండు చుక్కలు పోశాక.. మరక ఏర్పడితే అది కల్తీదని భావించాలి క్లీన్ ఇండియా మిషన్‌లో భాగంగా మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలిగాలి కొట్టే యంత్రాలను అందుబాటులో ఉంచాలి

స్వచ్ఛమైన తాగునీటి వసతి కల్పించాలి ఉచిత ఫోన్ సేవలు ఉండాలిసందేహాలు, సమస్యలను చెప్పుకొనేందుకు ఫిర్యాదుల పెట్టెలను ఉంచాలి సిబ్బంది గౌరవంగా మెలగాలి

**ప్రత్యేక పర్యవేక్షణ..**

వినియోగదారుడ్ని మోసం చేస్తే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తప్పవు. ప్రస్తుత బంకులన్నీ పౌరసరఫరాలు, తూనికలు, కొలతల శాఖ పర్యవేక్షణలో ఉన్నాయి. రెండు శాఖల అధికారులు తరచూ దాడులు చేస్తున్నారు. మా దృష్టికి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, కేసులు నమోదు చేస్తున్నాం. అన్నిచోట్ల టోల్‌ఫ్రీ నంబర్లు ఉన్నాయి. సద్వినియోగం చేసుకోవచ్చు. – రంగారెడ్డి, తూనికలు–కొలతల శాఖ ఉమ్మడి జిల్లా అధికారి

# అడ్డుకుంటారా.. 'సరేనంటారా'!

నెల్లూరు: జిల్లాలో అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట పడటం లేదు. నదీ గర్భంలో తవ్వకాలను నిషేధిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా దోపిడీ ఆగడం లేదు. సోమశిల నుంచి పెన్నా సముద్రంలో కలిసే వరకు అవకాశం ఉన్న ప్రతిచోటా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గ్రావెల్, మట్టిదీ అదే పరిస్థితి.. ఈ నేపథ్యంలో జిల్లాపై అవగాహన.. గతంలో ఇక్కడ పనిచేసిన వ్యక్తి జిల్లా భూగర్భ గనులశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. దాంతో ఇప్పటికైనా అక్రమాలు ఆగుతాయా? దోపిడీకి అడ్డుకట్ట పడుతుందా? అదే పంథా కొనసాగుతుందా అన్న చర్చ నడుస్తోంది.

**గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్టేది?**

నెల్లూరు నగరంలో ఇళ్ల నిర్మాణం, లేఅవుట్లు మెరక చేసుకునేందుకు



అవసరమైన గ్రావెల్, మట్టి, కావలి, సర్వేపల్లి నియోజకవర్గాల నుంచి వస్తోంది. గత ప్రభుత్వంలో దోపిడీకి పాల్పడిన వారే.. ఇప్పటి ప్రజాప్రతినిధులకు సంపాదించి పెడుతున్నారు. ఈదగాలి సమీపంలో ఓ ట్రాన్స్‌పోర్టు నిర్వాహకుడు జాతీయ రహదారి నిర్మాణం పేరిట ఎలాంటి అనుమతులు లేకుండా ధ్వంసం చేస్తున్నారు. నిత్యం నెల్లూరుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక ఈయనతో కలిసి గత ప్రభుత్వంలో గ్రావెల్‌ను దోచిన మరో వ్యక్తి.. కావలిలో తిష్ఠ వేశారు. కొందరు దగదర్తి మండల నాయకుల అండతో గ్రావెల్ తరలిస్తున్నారు.

**రాత్రయితే దందా!**

రొట్టెల పండగ ప్రారంభం నుంచి నగరంలో ట్రాఫిక్ సమస్య దృష్ట్యా ఇసుక ట్రాక్టర్లను అనుమతించకపోవడంతో పెన్నమ్మ కాస్త కుదుటపడినా.. రాత్రిళ్లు మాత్రం ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. కోవూరు నియోజకవర్గంలోని జమ్మిపాళెం, నెల్లూరు పరిధిలోని భగత్‌సింగ్ కాలనీ, కోడూరుపాడు, పొట్టేపాళెం, జొన్నవాడ, మినగల్లు తదితర చోట్ల తవ్వకాలు జరుగుతుండగా.. నెల్లూరు నగర వీధుల్లో టిప్పర్లు, ట్రాక్టర్లు వరుస కట్టి పోతున్నాయి. పొట్టేపాళెంలో భారీ యంత్రాలు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ పట్టించుకునే అధికారి లేకపోవడం గమనార్హం.

**ఎక్కడా అనుమతులు లేవు..**

జిల్లాలో గ్రావెల్‌కు ఎక్కడా అనుమతి ఇవ్వలేదు. సర్వేపల్లి, దగదర్తి ప్రాంతాల్లో తవ్వుతున్న విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటాం. నదుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. శ్రీనివాసరావు, డీడీ, మైనింగ్

# కూలిన గదులు.. కుదరని పనులు

కర్నూలు : ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారుస్తామని గొప్పలు చెప్పిన వైకాపా ప్రభుత్వం.నిధులు ఇవ్వకుండా విద్యార్థులకు తిప్పలు మిగిల్చింది. ఉమ్మడి జిల్లాలో 75 పాఠశాలల భవనాలు నేలమట్టం చేశారు. పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకపోవడంతో 2023 చివరి నాటికే అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇప్పటి వరకు వాటిని మళ్లీ చేపట్టనే లేదు. 80 శాతం వరకు పూర్తయిన పనులపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. మిగతా పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. మొదటి విడత కింద ఉమ్మడి జిల్లాకు సుమారు రూ.41.6 కోట్లు కేటాయించింది. వేసవి సెలవులు ముగిసేలోగా చివరి దశ పనులు పూర్తిచేస్తే విద్యార్థులకు సౌకర్యాలు మెరుగవుతాయని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**పదండి ముందుకు బడిని బాగు చేసుకుందాం**

అక్షరాలు నేర్పిన బడి అంటే ఎవరికైనా మమకారమే.. మనం ఓ స్థాయికి చేరాక.. తిరిగి అదే పాఠశాలకు వెళ్లినప్పుడు వచ్చే ఉద్వేగాన్ని మాటల్లో చెప్పలేం.. అలాంటి విద్యాలయాలు పాడై ఉంటే గుండె తరుక్కుపోతుంది.. చదివిన బడిని బాగు చేయడంలో మనమూ ఓ చేయి కలుపుదాం.. మనకు ఎన్నో గుర్తులు.. అనుభూతులు.. జ్ఞాపకాలు మిగిల్చిన పాఠశాలలను బాగు చేసుకుందాం. తలో చేయి వేస్తే సమస్యను పరిష్కరించడం చాలా సులువు.. ఇప్పుడు వేసవి కాలం.. బడులకు సెలవులొచ్చాయి.. తడ'బడి'న చదువులమ్మ నేలను బాగు చేయించడానికి ఇది చక్కని సమయం.. ఇంకా ఆలోచన ఎందుకు.. పదండి మన బడిని బాగు చేసుకుందాం..!!

పాఠశాలల్లో రెండో విడత కింద ఆగిపోయిన పనులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. 80 శాతం వరకు నిర్మాణాలు జరిగి ఆగిపోయిన వాటి వివరాలను సేకరించింది. వీటిని వెంటనే పునః ప్రారంభించి పూర్తి చేయాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

గతంలో మాదిరిగా సిమెంటు కొనుగోలు, సరఫరాపై ఉన్న ఆదేశాలను సడలించింది. బహిరంగ విపణిలోనే సిమెంటు కొనుగోలు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని ఇటీవల ఎస్ఎస్ఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రివాల్వింగ్ ఫండ్‌తో చేపట్టనున్నారు.

**రూ.423 కోట్లు అవసరం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాడు – నేడు కింద అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి కావాలంటే రూ.423 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఇందులో నంద్యాల జిల్లాకు రూ.180 కోట్లు, కర్నూలు జిల్లాకు 243 కోట్లు అవసరం ఉంది. కర్నూలు జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో రెండో విడత కింద 594 పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టారు. ఇందులో అరకొరగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం రూ.29.83 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రూ.3.73 కోట్లను ఆయా పాఠశాలల పీడీల ఖాతాలో జమ చేశారు.

నంద్యాలలోని 973 బడుల్లో పనులు ప్రారంభించారు. రూ.11.77 కోట్లు కేటాయించగా రూ.3 కోట్లు వచ్చాయి.

పడగొట్టి పంపించారు కర్నూలు బండిమెట్టలోని పొట్టిశ్రీరాములు స్మారక నగరపాలక పాఠశాలలో 279 మంది విద్యార్థుల చదువుకొంటున్నారు. ఉన్న గదులు కూలగొట్టారు.. పిల్లలను పక్కనే ఉన్న అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. రూ.2.16 కోట్లు కేటాయిస్తే రూ..49.21 లక్షలు వెచ్చించారు.

**సిమెంటు ఇస్తే పనులు మొదలు**

ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 780 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. రూ.48 లక్షలు వెచ్చించి నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించాలని అనుకొన్నారు. ఇప్పటి వరకు రూ.25 లక్షలు వెచ్చించారు. సిమెంట్ సరఫరా లేకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయి.. వాటిని చేపట్టాలంటే రూ.23 లక్షలు అవసరం..ప్రస్తుతం పాఠశాల ఖాతాలో రూ.6 లక్షలు ఉన్నాయి.

**అమ్మాయిల అవస్థ** ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1,612 మంది విద్యార్థినులున్నారు. రూ.2.16 కోట్లతో 18 అదనపు తరగతి గదుల నిర్మాణానికి పునాది వేశారు. నాలుగు గదులు రూఫ్ లెవర్ వరకు పూర్తవగా.. మరో రెండు గదులు పునాదులకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం రూఫ్ లెవల్‌లో ఆగిపోయిన నాలుగు అదనపు గదుల నిర్మాణాలు పూర్తిచేస్తే విద్యార్థినులకు సౌకర్యంగా ఉంటుంది. ఇందు కోసం సుమారు రూ.10 లక్షలు మంజూరు చేస్తే నాలుగు తరగతి గదులు వినియోగంలోకి తీసుకురావచ్చు. మంజూరైన అదనపు గదులు: 1986
తుది దశలో ఆగినవి: 587 పైకప్పు దశలో ఉన్నవి : 489
యూనిట్ లెవల్‌లో నిలిచినవి : 48

చురకలు



# డిజి'డల్' లావాదేవీలు

నెల్లూరు : 'కొన్ని పంచాయతీల్లో ఇంటి, కుళాయి పన్ను వసూళ్లకు కొందరు కార్యదర్శులు పాత పద్ధతులనే అనుసరిస్తున్నారు. పాత బిల్లు పుస్తకాలు తమ వద్ద ఉంచుకుని వాటినే రాసి ఇస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. అందరూ నూతన పద్ధతిపై శ్రద్ధపెట్టాల్సిందే' ఇటీవలి సమీక్షలో జిల్లా పంచాయతీ అధికారి అసంతృప్తి

స్థానిక సంస్థల్లో పారదర్శక పాలనకు.. ఆర్థిక అంశాల్లో జవాబుదారీ తనం పెంపునకు డిజిటల్ లావాదేవీలను తీసుకొచ్చినా.. జిల్లాలో అమలు అంతంత మాత్రంగానే ఉంది. గత ప్రభుత్వంలోనే ఈ విధానం తీసుకొచ్చినా.. ఇటీవల కూటమి ప్రభుత్వం సరికొత్త నిబంధనలు పెట్టినా.. సిబ్బంది అనుసరిస్తున్న పరిస్థితి లేదు. దాంతో లక్ష్యం నీరుగారుతోంది.

**గత ఆగస్టు 15 నుంచి..**

గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నుంచి జిల్లాలోని ప్రతి పంచాయతీలో ఆర్థిక లావాదేవీలన్నీ డిజిటల్ చెల్లింపుల విధానంలోనే సాగాల్సి ఉంది. 722 పంచాయతీల్లో ఇంటి, కుళాయి పన్నులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం చెల్లించే నగదు, లైసెన్స్ ఫీజులు అన్ని కొత్త విధానంలోనే ప్రత్యేక ఖాతాలకు జమ చేయాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా ఎస్‌బీఐలో ప్రత్యేక కరెంట్ ఖాతాలను ప్రారంభించారు. కానీ, సుమారు 60 శాతం పంచాయతీల్లో దీన్ని నీరుగార్చారు.




**జనాభా ఆధారంగా**

మూడు వేల మందిలోపు జనాభా ఉన్న పంచాయతీలు 607 ఉండగా.. ఇక్కడ ఉన్నవారంతా యూపీఐ, క్యూఆర్ కోడ్ ద్వారానో చెల్లింపులు జరిపే ఏర్పాట్లు చేశారు. ఇక మూడు వేలమందికిపైగా ఉన్నవి 115 ఉండగా.. వీటిలో పీవోఎస్ ద్వారా చేయాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశామని ప్రకటించిన అధికారులు.. ఆ ఖాతాకు వచ్చే నగదును ఏరోజుకు ఆరోజు కార్యదర్శి నుంచి స్థానిక ట్రెజరీకి చెల్లిస్తారని ప్రకటించారు. కానీ, ఈ తీరున ఎక్కడా ఆశించిన స్థాయిలో జరగడం లేదు.

**పాత పద్ధతులు అనుసరిస్తే చర్యలు**

పంచాయతీల్లో నగదు పక్కదారి పట్టకుండా నేరుగా బ్యాంక్ ఖాతాలకే చేరేలా డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టాం. ఇప్పటికే అనేక పంచాయతీలు ప్రారంభించాయి. ఇంకా కొందరు పాత పద్ధతులు అవలంబిస్తున్నారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు. మరోసారి ఆదేశాలు ఇస్తాం. శ్రీధర్‌రెడ్డి, డీపీవో

# గోదావరి గట్టు.. ఆహో అనిపించేట్టు

రాజమహేంద్రవరం : రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని గోదావరి ఘాట్ల నిర్వహణపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వాటి నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. పైలట్ ప్రాజెక్టుగా మూడు నెలలుపాటు ప్రైవేటు ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించేం దుకు సిద్ధపడుతోంది. దీన్ని బట్టి భవిష్యత్తులో ఘాట్ల విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అంచనాకు రావచ్చని భావిస్తోంది. వాస్తవానికి గోదావరి నది పరివాహక ప్రాంతం జలవనరుల శాఖ పరిధిలో ఉంటుంది. బయట ఘాట్లు, రోడ్ల వద్ద పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలు నగరపాలక సంస్థ కల్పించాల్సి ఉంటుంది. అయితే ఘాట్లను ఆనుకొని నది లోపలి భాగం స్నానాలకు అనుకూలంగా శుభ్రం చేయడంలో మున్సిపల్ కార్మికులకు అనుభవం లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో శిక్షణ పొందిన కార్మికులను ప్రైవేటు ఏజెన్సీల ద్వారా రప్పించి ఘాట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసే ప్రక్రియకు నాంది పలుకుతున్నారు.

**నిత్యం పరిస్థితి ప్రమాదకరం..**

గోదావరి ఘాట్ల వద్ద పరిస్థితి నిత్యం ప్రమాదకరంగా మారుతోంది. కాస్త ఆదమరిచి ఎవరైనా నదిలో స్నానానికి దిగితే లోతు తెలియక మునిగిపోయి మృత్యువాతపడుతున్నారు. ఇటీవల కాలంలో ఇటువంటి సంఘటనలు ఒకదాని వెంట మరొకటి చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఘాట్ల లోపల నదీ సమతుల్యత దెబ్బతినడమే ఇందుకు కారణం. ఊబలు పెరిగిపోవడం, ఘాట్ల వద్ద లోతు ఎక్కువగా ఉండడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదాలను అరికట్టాలంటే నదిలో ఎప్పటికప్పుడు ఎగుడుదిగుడులు సరిచేసి, లోతు ఎక్కువ ఉన్న చోట ఇసుక వేయాల్సి ఉంటుంది. అందుకోసం యంత్రాల సహాయంతో ప్రతీ రెండు నెలలకు ఒకసారి డ్రెడ్జింగ్ చేయాల్సి ఉంది. ఇవేమీ జరగకపోవడం వల్ల ఘాట్ల వద్ద స్నానాలు చేయాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఘాట్ల వద్ద మెట్లను మాత్రమే శుభ్రం చేస్తున్నారు. నదిలోకి దిగి లోతు ఉన్న చోట్ల ఇసుక వేయడం, డ్రెడ్జింగ్ పనుల్లో అనుభవం లేకపోవడంతో వారు నది లోపలికి దిగడానికి భయపడి పోతున్నారు. దీంతో ప్రైవేటు ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించనున్నారు.

**ప్రయోగాత్మకంగా అమలు..** పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తుల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా ఘాట్ల నిర్వాహణ ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే విధానం అమలు చేస్తున్నారు. ఇందుకు గోదావరి గట్టు వెంబడి మొత్తం 13 ఘాట్లను ఎంపిక చేశారు. వీటిని మూడు నెలలు పాటు ప్రైవేటు ఏజెన్సీకి అప్పగిస్తారు. నదిలోపల ఘాట్ల వద్ద స్నానాలకు అనుకూలంగా సిద్ధం చేయడంతోపాటు బయట పారిశుద్ధ్యం, ఇతర సేవలను అందించాల్సి ఉంటుంది. అందుకు సంబంధించి శిక్షణ పొందిన కార్మికులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రతీ ఘాట్‌కు నెలకు రూ.15 వేలకు పైగా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ అమలు చేస్తున్నట్లు కమిషనర్ కేతన్ గర్గ్ కు తెలిపారు.

# ఏకేయూకు జవసత్వాలు!



ఒంగోలు : ఒంగోలు నగరంలోని ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం (ఏకేయూ) బాలారిష్టాలను అధిగమించి అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. మూడేళ్ల కిందట ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయానికి గత వైకాపా ప్రభుత్వంలో నిధులివ్వకపోవడంతో పీజీ కేంద్రంలోనే అరకొర వసతులతో నడుస్తోంది. తరగతులు నిర్వహణకు గదులు సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపకపోవడంతో గడిచిన రెండేళ్లు వందల సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి. మూడేళ్ల కిందట వరకు ఉమ్మడి ప్రకాశంలోని అన్ని కళాశాలలు నాగార్జున విశ్వ విద్యాలయం పరిధిలో ఉండగా, ప్రస్తుతం ఏకేయూ గొడుగు కిందకు వచ్చాయి. మొత్తం 226 కళాశాలలతో పెద్ద విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాది వ్యవధిలో కొన్ని నిధులు సమకూరాయి. కళాశాల అఫ్లియేషన్ ఫీజులతోపాటు పీజీ విద్యార్థులు, స్కాలర్లు చెల్లిస్తున్న ఫీజులతో కొంత ఆర్థిక స్థిరత్వం లభించింది. దీంతో ఈ ఏడాది కొన్ని నిర్మాణపనులకు శ్రీకారం చుట్టారు.

ఒంగోలు నగర సమీపంలోని పేర్నమిట్ట కొండపైనున్న 110 ఎకరాల విశ్వవిద్యాలయం స్థలంలో భవన నిర్మాణాలు చేపట్టడానికి పాలనపరమైన ఉత్తర్వులందాయి. విశ్వవిద్యాలయం నిధులు రూ.9 కోట్లతో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అకడమిక్ బ్లాక్ నిర్మాణం జరగనుంది. గ్రౌండ్ ఫ్లోర్, పైఅంతస్తులో మొత్తం 40 గదులు నిర్మించనున్నారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ సంస్థకు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఇవన్నీ వచ్చే విద్యాసంవత్సరానికి అందుబాటులోకి రానున్నాయి. మంత్రులు, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు బాలికల వసతి గృహం భవన నిర్మాణానికి కలెక్టర్ మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.4.64 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు కూడా ఏపీఈడబ్ల్యూఐడీసీ చేపట్టడానికి టెండర్లు పిలిచింది. త్వరలో రూ.3 కోట్లతో పరిపాలన భవనం, రూ.79 లక్షలతో ఇండోర్ స్టేడియం నిర్మించాలని ప్రతిపాదించారు. ఇవన్నీ కూడా 2026 విద్యా సంవత్సరానికి అందుబాటులోకి వస్తాయని అంచనా.

**239కి పెరిగిన విద్యాలయాలు**

ఏకేయూ పరిధిలో ఈ విద్యాసంవత్సరం వివిధ కోర్సులతో 13 ప్రైవేటు కళాశాలలు రానున్నాయి. ఎంబీఏ, ఎంసీఏ రెండు, ఫార్మసీ రెండు, న్యాయవిద్య కళాశాలలు రెండు, బీఈడీ కళాశాలలు ఏడు ఏర్పాటు చేయడానికి అనుమతులకు అవసరమైన ఫీజులు చెల్లించారు. దీంతో మొత్తం కళాశాలల సంఖ్య 239కి చేరనుంది. ప్రస్తుతం విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 48 వేల మంది విద్యార్థులు చదువుతుండగా, 53 మంది రీసెర్చి స్కాలర్లు ఉన్నారు. ఈ ఏడాది పీజీ మొదటి బ్యాచ్, వచ్చే ఏడాది డిగ్రీ మొదటి బ్యాచ్ బయటకు రానుంది.

**తీరని ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్య**

ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పీజీ చేసే విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ సౌకర్యం ఉంది. ఏకేయూలో విద్యార్థులు తక్కువగా ఉన్న రెండు ఆర్ట్స్ కోర్సులకే వర్తింపజేశారు. మిగిలిన కోర్సులకు కూడా ఫీజు రీఎంబర్స్‌మెంట్ కల్పిస్తే ఎక్కువ మంది పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన దస్త్రం ఉన్నత విద్యామండలి వద్ద ఉంది. **రూ.215 కోట్లు కోరాం** భవనాల నిర్మాణం, సైన్స్ కోర్సులు, లైబ్రరీ, ఆటస్థలం అభివృద్ధి, రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు రూ.215 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం ఉన్న 13 కోర్సులకు అనుబంధంగా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎంఏ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, యోగా కోర్సులు ప్రవేశపెట్టాలని ప్రతిపాదించాం. పీజీసెట్ పూర్తయినందున త్వరలో ప్రవేశాలు ప్రారంభమవుతాయి. డీవీఆర్ మూర్తి, ఉపకులపతి

# సచివాలయాల్లో బదిలీల సందడి!




కందుకూరు : గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల చేయడంతో సందడి నెలకొంది. 2019, అక్టోబరు 2న గత వైకాపా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ అమల్లోకి తీసుకొచ్చింది. గతంలో సొంతూరులో పనిచేయకూడదన్న నిబంధన ఉంది. తాజాగా కూటమి ప్రభుత్వం సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వరాదని నిబంధనను అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో సచివాలయ ఉద్యోగులు ఎక్కువ మంది పొరుగు మండలాలకు బదిలీ కానున్నారు. గతేడాది సెప్టెంబరులో జరిగిన సాధారణ బదిలీల సమయానికి సచివాలయ ఉద్యోగులకు అయిదేళ్ల నిండలేదు. బదిలీల్లో భాగంగా రిక్వెస్ట్ పెట్టుకోవడానికి అవకాశం ఇవ్వడంతో కౌన్సెలింగ్ ద్వారా 20 శాతం మందికే స్థాన చలనం కలిగింది. తాజాగా ఇచ్చిన బదిలీల జీవో ద్వారా దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి స్థానచలనం కలగనుంది. 2025, మే నెలాఖరు నాటికి ఒకే సచివాలయంలో అయిదేళ్లకుపైగా పని చేస్తుంటే బదిలీ తప్పనిసరి. దీంతో 80 శాతానికిపైగా ఉద్యోగులు బదిలీ కానున్నారు. గత ప్రభుత్వం హయాం నుంచి పనిచేస్తున్న వారందరూ మరో చోటకు మారనున్న నేపథ్యంలో కొత్త వారిని తెచ్చుకునేందుకు స్థానిక అధికార పార్టీ నాయకులు ఆసక్తి చూపుతున్నారు. ఇదే సమయంలో పక్క మండలాలకు వెళ్లేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేల చుట్టూ సచివాలయ ఉద్యోగులు ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరైతే ఒక అడుగు ముందుకేసి తమకు తెలిసిన నాయకుల ద్వారా ఆసక్తి ఉన్న చోటుకు ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖలు తీసుకుంటున్నారు.

**హేతుబద్ధీకరణతో కలిపి ఒకేసారి...**

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయిలో మరింత మెరుగైన సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. జనాభా, ఆదాయం ఆధారంగా గ్రామ పంచాయతీలను ఇప్పటికే గ్రేడ్ల వారీగా విభజించేందుకు ప్రతిపాదించారు. మరోపక్క పౌర సేవలను మరింత సులభతరం చేసేవిధంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ నెలాఖరులోపు బదిలీల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండడంతో జిల్లా అధికారులు కసరత్తు ప్రారంభించారు. సచివాలయాల ఉద్యోగుల హేతుబద్ధీకరణతోపాటు, బదిలీలు ఒకేసారి జరుగనున్నాయి. గత ప్రభుత్వం సచివాలయానికి 8 నుంచి 11 మంది వరకు ఉద్యోగులను నియమించింది. తాజా మార్గదర్శకాలతో 'ఏ' కేటగిరి సచివాలయాల్లో ఆరుగురుబీ 'బీ'లో ఏడుగురుబీ 'సీ'లో ఎనిమిది మంది ఉద్యోగులు ఉండనున్నారు. మిగతా ఉద్యోగులను ఇతర శాఖలకు సర్దుబాటు చేయనున్నారు.

# యంత్రం కదలక.. సమస్య తొలగక!




కందుకూరు : కందుకూరు పట్టణాన్ని చెత్త సమస్య వీడటం లేదు. ఏళ్లుగా పేరుకుపోయిన చెత్త కొండను తలపిస్తుండగా– ఈ సమస్యకు పరిష్కారంగా ప్రారంభించిన ఎంఆర్ఎఫ్ (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్) నిరుపయోగంగా ఉంది. రూ. కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ఇప్పటి వరకు ఊరట ఇవ్వలేదు.

**కొండలా డంపింగ్ యార్డు**

మున్సిపాలిటీలో విలీన గ్రామాలు పోను.. మిగిలిన 30 వార్డుల్లో సుమారు 70వేల మంది జనాభా ఉన్నట్లు అంచనా. రోజూ పారిశుద్ధ్య కార్మికులు చెత్తను పోగు చేసి.. వాహనాల్లో గుర్రంవారిపాలెం సమీపంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. నిత్యం సుమారు 25 టన్నులు ఉత్పత్తి అవుతున్నట్లు అధికారుల అంచనా. 30వేల టన్నులు పోగుపడినట్లు గుర్తించినా.. వైకాపా ప్రభుత్వం అయిదేళ్లు కనీసం పట్టించుకున్నది లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఈ సమస్యపై దృష్టిసారించింది. అందులో భాగంగానే ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ.. వంద రోజుల్లో ప్రస్తుతం ఉన్న చెత్తను గుంటూరుకు తరలిస్తామని.. మరో నెల రోజుల తర్వాత రోజూ ఉత్పత్తి అయ్యే చెత్తను ప్రాసెస్ చేస్తామని చెప్పారు. అందులో భాగంగా చెత్త తరలింపునకు తరుణి అసోసియేట్స్‌కు టెండర్ అప్పగించారు. ఇప్పటికీ అడుగు ముందుకు పడలేదు.

**అడుగు పడకనే..**

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరుకు వచ్చిన ముఖ్యమంత్రి ఫిబ్రవరి 15వతేదీ ఎంఆర్ఎఫ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ నిర్దేశించిన ప్రక్రియ మార్చి ఒకటో తేదీ నుంచే ప్రారంభమవుతుందని ప్రకటించినా.. సదరు సంస్థ ఇంకా ప్రక్రియ మొదలుపెట్టలేదు. మరోవైపు రోజూ 30 టన్నుల చెత్తను గుంటూరుకు తరలించేందుకు కంప్రెస్డ్ వాహనం 50 శాతం రాయితీతో కందుకూరుకు మంజూరు చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ తెలిపినా.. అదీ రాలేదు. దాంతో సమస్య అలాగే ఉండిపోయిందని ప్రజలు అంటున్నారు. ఎంఆర్ఎఫ్ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి.. చెత్త సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**తరలింపునకు చర్యలు** డంపింగ్ యార్డులో ప్రస్తుతం ఉన్న చెత్త తరలింపునకు టెండరు పూర్తయింది. సదరు సంస్థ ఇటీవల వచ్చి సర్వే నిర్వహించింది. త్వరలోనే తరలింపు ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. కంప్రెస్డ్ వాహనం త్వరలోనే మంజూరవుతుంది. కె.అనూష, మున్సిపల్ కమిషనర్

# మెరక అన్నారు.. నిధులు మెక్కేశారు!

కాకినాడ: వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో మెరక పేరుతో ఆ పార్టీ నేతలు కొందరు మేసేశారు. కొండ దిగువన, లోతట్టు ప్రాంతాలు, సముద్రతీరం, మడ భూముల్లో స్థలాలు ఇవ్వడంతో వాటిని చదును చేసే క్రమంలో రూ.కోట్లను వెనకేసుకున్నారు. కొన్నిచోట్ల అరకొరగా లేఅవుట్లను పోల్చి మొత్తం చేసినట్లు బిల్లులు చేసుకున్నారు. వీటిపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ చేపట్టారు. తాజాగా మరోసారి జిల్లాలోని 300 లేఅవుట్లలో గ్రావెల్‌తో చేసిన పనుల్లో నాణ్యత ఎంతో నిగ్గుతేల్చడానికి సిద్ధమవుతున్నారు.

కాకినాడ జిల్లాలో 320కి పైగా లేఅవుట్లలో గ్రావెల్‌తో చదును పనులు చేశారు. ఇందుకు సుమారు రూ.300 కోట్ల పైనే ఖర్చుచేశారు. వాటిలో చాలావరకు గత ప్రభుత్వంలోనే బిల్లులు చేసుకున్నారు. ఇంకా కొంతమంది నేతలు తమకు బిల్లులు చేయాల్సి ఉందని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే చెల్లించిన సొమ్ము ఎక్కువగా ఉందని, అసలు క్షేత్రస్థాయిలో చేసిన పని, నాణ్యత చూసి నివేదిక ఇవ్వాలని ఆర్‌డబ్ల్యుఎస్, గృహనిర్మాణశాఖ, నరేగా నాణ్యత విభాగం అధికారులకు ఆదేశాలందాయి. 12 బృందాలతో విచారణకు సిద్ధమవుతున్నారు. ఆయా లేఅవుట్లకు వెళ్లి నిజంగా గ్రావెల్‌తో చదును చేశారా.? ఎం.బుక్‌లో రికార్డు మేరకు జరిగిందా? ఈ గ్రావెల్‌ను ఎక్కడి నుంచి తెచ్చారు.? నిబంధనల ప్రకారం బిల్లులు చెల్లించారా.? అనేది పరిశీలించాలి. గుత్తేదారులకు ఇంకా చెల్లించాల్సి ఉన్నా, అవకతవకలు జరిగినట్లు గుర్తించినా తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయాలి.

**కొమరగిరి, కరప లేఅవుట్లలో కనికట్టు**

కాకినాడ పట్టణం, గ్రామీణ నియోజకవర్గాల వారికి యు.కొత్తపల్లి మండలంలో సముద్రతీరానికి ఆనుకుని కొమరగిరి, కరప సమీప



లోతట్టు ప్రాంతంలో భారీ లేఅవుట్లు వేశారు. భూముల కొనుగోలులోనే భారీగా అక్రమాలు జరిగాయి. ఆయా లేఅవుట్లను అప్పటి ప్రజాప్రతినిధులే తమ అనుచరుల పేరుతో చదును పనులు చేయించారు. ఈ రెండు లేఅవుట్లకు సంబంధించే సుమారు రూ.150 కోట్ల వరకు గ్రావెల్‌తో లెవలింగ్ చేశామని లెక్కల్లో చూపించినట్లు తెలిసింది. అప్పట్లోనే సీఎంవో నుంచి ఓ ప్రత్యేకాధికారి పరిశీలించి ఇంత భారీ మొత్తంలో ఎందుకు ఖర్చుచేయాల్సి వచ్చిందనే అనుమానం వ్యక్తంచేశారు. బిల్లుల చెల్లింపుల్లో కొర్రీలు పెట్టారు. అయినా అధికారం అడ్డుపెట్టుకుని బిల్లులు చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

**లెక్కలు తేలుస్తారా..**

జిల్లాలోని మిగతా లేఅవుట్లలోనూ చదును పనుల పేరిట సొమ్ములు భారీగానే బొక్కేశారు. కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టినా నివేదిక ఇంకా బయటపెట్టలేదు. ఇప్పుడు ప్రత్యేక బృందాలతో మళ్లీ తనిఖీలు చేస్తున్నారు. డ్వామా పీడీ వెంకటలక్ష్మి వద్ద ప్రస్తావించగా కొంతమంది బకాయిలు కోసం న్యాయస్థానానికి వెళ్లడంతో వాటిని చెల్లించడానికి ముందు ఓసారి పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కలెక్టర్ సూచనలతో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

# అంతర్వేది.. సౌకర్యాల జాడేది!

అంతర్వేది: దక్షిణ కాశీగా.. నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన అంతర్వేదిలో లక్ష్మీనరసింహస్వామి, పార్వతీ నీలకంఠేశ్వర స్వామి, వశిష్ఠ.. ఇలా అనేక ఆలయాలతో పాటు దీపస్తంభం, గోదావరి సాగర సంగమం, గలగలపారే గోదావరిలో లాహిరి లాహిరి అంటూ సాగిపోయే బోటింగ్, సందర్శకులను కట్టి పడేసే వందలాది రకాల జలపుష్పాలు (చేపలు), ఫిష్ ల్యాండింగ్ సెంటర్, వేట దృశ్యాలు.. ఇలాంటి అనేక వనరులున్నాయి. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న ఈ ప్రాంతంలో అభివృద్ధి జాడ కనిపించకపోవడంతో ఇక్కడికి వచ్చే వేలాది మంది పర్యాటకులు అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

**ఇదీ పరిస్థితి..**

ముందుగా ఆలయాలను దర్శించుకుని అనంతరం బీచ్‌లో సరదాగా గడపడానికి వస్తుంటారు. వీరికి దుస్తులు మార్చుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి వసతులు, తాగునీరు లేదు. రక్షణ చర్యలు శూన్యం. దీంతో వచ్చిన వెంటనే వెనుదిరుగుతున్నారు.

దీపస్తంభం వద్ద ఏడాదిన్నర కిందట రూ.90 లక్షలతో కేంద్ర ప్రభుత్వం పార్క్ నిర్మించింది. ఇది సముద్రయాన, రక్షణశాఖ ఆధ్వర్యంలో ఉంది. ఇక్కడికి వెళ్లేందుకు కూడా సరైన రహదారి సౌకర్యం లేదు. దీంతో నిరుపయోగంగా మారింది.



**ఉపాధి అవకాశాలు మెండు**

అంతర్వేదిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. బీచ్‌కి వచ్చే సందర్శకులకు ఫొటోలు తీస్తూ, తినుబండారాలు విక్రయిస్తూ, పిల్లలు, పెద్దలకు గుర్రపుస్వారీ చేయించేవారు, ఏటీవీ వాహనాలు నడుపుతూ, బోట్లలో బోటింగ్ చేయిస్తూ ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నారు. ప్రభుత్వం మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే వందల సంఖ్యలో కుటుంబాల వారికి ఉపాధి కలుగుతుంది. దీనికితోడు పర్యాటకులు జలపుష్పాలను, ఎండుచేపలను చూసి కొలుగోలు చేసుకుంటున్నారు. వీటి విక్రయాలు పెరగడానికి సైతం అవకాశం ఉంటుంది. **టెంపుల్ టూరిజంగా తయారు చేస్తాం** అంతర్వేది పరిసర ప్రాంతాలను టెంపుల్ టూరిజంగా తయారు చేయడానికి ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి ఇచ్చాం. సఖినేటిపల్లి నుంచి నిర్మించబోయే 216 జాతీయ రహదారికి అనుసంధానంగా అంతర్వేదికి ప్రత్యేక రోడ్డు నిర్మిస్తాం. 2026 జనవరిలో బీచ్ ఫెస్టివల్ జరుపుతాం. వేలాది మంది సందర్శకులను ఆకర్షించేలా ఇక్కడ ఏర్పాట్లు చేస్తాం.

# విరామానికి సెలవు!

నక్కపల్లి : సుదీర్ఘ విరామానికి మత్స్యకారులు సెలవిచ్చే సమయం ఆసన్నమైంది. వేట నిషేధం గడువు ముగియనుండటంతో అగాధ జలరాశిలో నుంచి మళ్లీ వేటకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటివరకు బోసిపోయిన తీరప్రాంతంలో సందడి నెలకొంది. జిల్లాలోని పాయకరావుపేట మండలం పాల్మన్‌పేట నుంచి నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం తదితర మండలాల్లో పొడవైన తీరప్రాంతం ఉంది. దాదాపు 80 వేల మంది వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. కర్రతెప్పలు, ఇంజిన్ బోట్లు 2,360 ఉండగా వీటిపై నిత్యం వేట సాగిస్తుంటారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు 61 రోజుల పాటు సంద్రంలో చేపలపై నిషేధం కొనసాగుతోంది. వేట లేకపోతే మత్స్యకారులు ఉపాధి కోల్పోతారు. దీన్ని గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నడూ లేనివిధంగా మత్స్యకారులకు పరిహారాన్ని రూ.20 వేలకు పెంచింది. జిల్లాలోని పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో 12,644 మంది లబ్ధిదారులను గుర్తించి గతనెలలోనే నగదు జమ చేశారు. ఖాతాలు సక్రమంగా లేకపోవడం, ఆధార్ లింక్ తేడాలు తదితర కారణాలతో జిల్లాలో 800 మందికి నగదు జమ జరగలేదు. వీరంతా తమకు రావల్సిన లబ్ధికోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం నిషేధం గడువు ముగింపు దశకు చేరడంతో పాల్మన్‌పేట, రత్నాయంపేట, రాజానగరం, వెంకటన



గరం, రాజవరం, గజపతినగరం, పెంటకోట తదితర మత్స్యకార గ్రామాల పరిధిలో తీరప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసినా గంగపుత్రులు వలలను సిద్ధం చేసుకుంటున్నారు. కొంతమంది పడవలకు మరమ్మతు చేస్తూ వేటకు ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నారు. **త్వరలోనే నగదు జమ...** –ఎం.ప్రసాద్, మత్స్యశాఖ జిల్లా అధికారి మత్స్యకారులు యథావిధిగా వేటకు వెళ్లొచ్చు. మత్సకారుల సేవలో పథకానికి సంబంధించి కొందరికి ఇప్పటికి నగదు జమకాని మాట వాస్తవమే. ఇప్పటికే 400 మంది వరకు తమ వివరాలను సరిచేసి ఇచ్చారు. రెండు మూడు రోజుల్లో వీరి ఖాతాలకు పరిహారం సొమ్ము చేరుతుంది. మిగిలిన వారు వివరాలు సమర్పిస్తే త్వరలోనే నగదు జమవుతుంది.

# వే'గంగా' కుడి గట్టు

నంద్యాల : వైకాపా ప్రభుత్వం నిధులివ్వకుండా ఆపేసిన శ్రీశైలం కుడి ప్రధాన కాల్వ (ఎస్ఆర్ఎంసీ) విస్తరణ పనులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాల్వను ఏడువేల క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో నిర్మించారు. బనకచెర్ల నుంచి గోరుకల్లు జలాశయం వరకు 22వేల క్యూసెక్కుల నీరు పారేలా విస్తరించాలని 2006లో నిర్ణయించారు. కొనసాగుతున్న ఆ పనులను వైకాపా ఆపేసింది.. 34వేల క్యూసెక్కులు తరలించేలా కాల్వను పటిష్ఠం చేస్తామని ప్రగల్భాలు పలికింది. పోతిరెడ్డిపాడు నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు విస్తరణ పనులకు రూ.1,167 కోట్లు వెచ్చించనున్నట్లు ప్రకటించారు.


**పనుల పూర్తికి గడువు పెంపు**

2021లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పనులు 36 నెలల్లో పూర్తి చేయాలి. తాజాగా వచ్చే ఏడాది సెప్టెంబరు 30 నాటికి పనులు చేయాలని గడువు పెంచారు. సాధారణంగా శ్రీశైలం నీటిమట్టం 840 అడుగులకు చేరుకునే లోపే పనులు చేయాలి.. తర్వాత సాధ్యం కాదు. ఏప్రిల్ నుంచి జులై వరకు అంటే గరిష్ఠంగా నాలుగు నెలలే పనులు చేయడానికి వీలుంటుంది. 78 మీటర్ల వెడల్పు, 12.5 మీటర్ల లోతులో ఉన్న కాల్వలో పనులు చేయాలంటే ముందుగా మోటార్లు పెట్టి నీళ్లను తోడాల్సి ఉంటుంది.

**వైకాపా పైసాచికత్వం**

నిత్యం 80 వేల క్యూసెక్కుల కృష్ణా జలాలను పోతిరెడ్డిపాడు నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి బనకచర్ల సముదాయానికి తరలించాలి. ఇందుకు సంబంధించి ఎస్ఆర్ఎంసీను విస్తరించాల్సి ఉంది.

మొదటి ప్యాకేజీ కింద 0–16 కి.మీ.( పోతిరెడ్డిపాడు– బనకచర్ల), రెండో ప్యాకేజీ కింద 16వ కి.మీ. నుంచి గోరుకల్లు వరకు చేపట్టాలి. కాల్వను విస్తరించడంతోపాటు బెడ్‌లైనింగ్, ఇరువైపులా లైనింగ్ పనులు



చేయాలి. రూ.300 కోట్ల పనులు చేసినా గత వైకాపా ప్రభుత్వం పైసా ఇవ్వకపోవడంతో 2023లో గుత్తేదారు పనులు ఆపేశారు.

ఆగిన పనుల తీరును గతేడాది అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రూ.200 కోట్లు విడుదల చేసింది. ఏప్రిల్ నుంచి పనులు మొదలు పెట్టారు. రాత్రింబవళ్లు పనులు చేస్తున్నారు.

**దిగువకు చేరని నీరు** కృష్ణా వెనుక జలాలను 30 రోజుల్లోనే రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలో 210 టీఎంసీలను నిల్వ చేయడానికి ఉద్దేశించిన ఎస్ఆర్ఎంసీ పనులపై నాటి వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని కనబరిచింది. ఒక్క పైసా నిధులు విడుదల చేయలేదు. గతేడాది పదిసార్లకు పైగా శ్రీశైలం రిజర్వాయర్ నిండి గేట్లు ఎత్తి నీటిని దిగువ ప్రాంతానికి వదిలినా రబీలో సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. చివరి ఆయకట్టుకు నీళ్లు అందక అన్నదాతలు రోడ్డెక్కారు. పనులు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు.

**నిత్యం 7 టీఎంసీలు తరలించేలా** కృష్ణానదికి వరదలొచ్చే 30 రోజుల్లో నిత్యం 7 టీఎంసీల చొప్పున 80 వేల క్యూసెక్కుల నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాంతానికి తరలించాలని లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు. అంటే 30 రోజుల్లో 210 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం బనకచర్ల నుంచి నిత్యం వెలుగోడు రిజర్వాయర్‌కు 12 వేల క్యూసెక్కులు పంపిస్తున్నారు.. విస్తరణ పనులు పూర్తయితే 20 వేల క్యూసెక్కులు తరలిస్తారు. అదేవిధంగా గోరుకల్లు రిజర్వాయరు కు 30 వేలు, కేసీ కాల్వకు 30 వేల క్యూసెక్కుల చొప్పున పంపించనున్నారు.

# 'ఉక్కు' సంకల్పమే కీలకం




విశాఖపట్నం: విశాఖ ఉక్కులో పూర్తిస్థాయి ఉత్పత్తి దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం బ్లాస్ట్ పర్నేస్ (బీఎఫ్) 1, 2 నడుస్తున్నాయి. మూడో ఫర్నేస్‌ను ఈ నెల 23న ప్రారంభించేందుకు ప్రణాళిక చేశారు. అవసరమైన బొగ్గు, ఇనుపఖనిజం, ముడిసరకు సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల భారీ ప్యాకేజీ ప్రకటించాక తొలిసారి పూర్తిస్థాయి ఉత్పత్తికి విశాఖ ఉక్కు సిద్ధమైంది. ప్రస్తుతం రెండు ఫర్నేస్‌ల ద్వారా 14 వేల టన్నుల ఉక్కు ఉత్పత్తి జరుగుతోంది. గత నాలుగు నెలలుగా వందశాతానికి పైగా ఉత్పత్తి వస్తుండటం గమనార్హం.

**సీఎంతో చర్చల తర్వాత:** కడపలో మహానాడు నిర్వహించిన సమయంలో స్టీలుప్లాంటు అడిషనల్ ఛార్జి సీఎండీ సక్సేనా... సీఎం చంద్రబాబు నాయుడును ప్రత్యేకంగా కలిశారు. ఈ భేటీలో స్టీలు ప్లాంటు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. స్టీలు ప్లాంటు లాభాల బాట పట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ప్లాంటు ఉద్యోగులు, యాజమాన్యం సమన్వయంతో పనిచేసి ఫలితాలు రాబట్టాలని కోరారు. విద్యుత్ బిల్లుల బకాయిలు, నీటి సరఫరా ఇతరత్రా వంటివాటికి ఈక్విటీ రూపంలో రూ.2,660 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటుగా నిలిచింది. చర్చల తరువాత బ్లాస్ట్ ఫర్నేస్–3ని పునఃప్రారంభించేందుకు అన్ని శాఖల నుంచి జీఎం, డీజీఎం, ఏజీఎం స్థాయి అధికారులు 22 మందితో ఓ కమిటీని వేశారు.

**ఆ పరిస్థితి రాకుండా:** 2023 డిసెంబరులో బ్లాస్ట్‌ఫర్నేస్–3 ప్రారంభించినా ముడిసరకు కొరతతో మూడు నెలలకే మూతపడింది. ప్రస్తుతం రెండు, మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నట్లు సమాచారం. ఎన్ఎండీసీ నుంచి ప్రతిరోజూ స్టీలు ప్లాంటుకు 8 రేక్‌ల ఇనుప ఖనిజం సరఫరా చేయాల్సి ఉన్నా ఇప్పటికీ అరకొరగానే అవుతోంది. వర్షాకాలంలో ఇనుప ఖనిజం సరఫరా చేయడమూ కష్టమే. దీనిని దృష్టిలో పెట్టుకుని 1.50లక్షల టన్నుల పెల్లెట్‌లను కొనుగోలు చేసి నిల్వ చేశారు. అంతకు ముందు మరో 40వేల టన్నులు కొనుగోలు చేశారు.

**ఉత్పత్తి ఖర్చు పెరిగితే లాభాలు ఎలా?:** పూర్తిస్థాయి సామర్థ్యంతో స్టీలుప్లాంటును నడిపించినా... లాభాలు కచ్చితంగా వస్తేనే కర్మాగారం నిలదొక్కుకోగలుగుతుందని కార్మిక సంఘాలు అంటున్నాయి. ఎక్కువ విలువైన ఉత్పత్తుల కోసం పెల్లెట్ ఐరన్ వాడతారు. సొంత గనులు ఉండి, పెల్లెట్ యూనిట్ ఉంటే టన్ను రూ.3500–5000 వచ్చేస్తుంది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం ఒక్కో టన్ను రూ.10,500 ఉంది. ఫలితంగా ఉత్పత్తి ఖర్చు పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ఉత్పత్తి వ్యయం తగ్గాలంటే భారీ ఖర్చులు తగ్గించుకోవాల్సి ఉందని, అది వదిలేసి కార్మికుల తొలగించి ఖర్చులు తగ్గిస్తామంటే ఎలా అని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

# 'డబుల్ డెక్కర్' తరహాలో విశాఖ మెట్రో ప్రాజెక్టు



విశాఖపట్నం: నగరంలో ట్రాఫిక్ రద్దీ, ప్రయాణికుల అవసరాలు, భవిష్యత్తు విశాఖ ముఖచిత్రాన్ని దృష్టిలో పెట్టుకొని విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం పట్టాలెక్కిస్తోంది. ఈ నేపథ్యంలోనే 'డబుల్ డెక్కర్' తరహాలో నడిపేలా ఈ ప్రాజెక్టులో కీలక నిర్ణయం తీసుకున్నారు. అంటే.. పైన మెట్రో రైలు... కింద వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఇందులో భాగంగా నాలుగు వరుసలతో కూడిన పైవంతెనలు నగరం నడిబొడ్డున రానున్నాయి. ఈ మార్పు కొత్తగా చోటుచేసుకోవడంతో నాలుగు వరుసల పైవంతెనలు, మెట్రో లైనుకు కలిపి సంయుక్తంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి కన్సల్టెంట్ నియామకానికి ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఆసక్తి ఉన్న సంస్థల నుంచి తాజాగా దరఖాస్తులు ఆహ్వానించింది. ఆసియా మౌలిక వసతుల, పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ) ప్రతినిధులు రుణం ఇచ్చేందుకు ఆసక్తి చూపి.. మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డితో కలిసి విశాఖలో పర్యటించడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. (**ఆర్థిక భారం తగ్గి:** వాస్తవానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ట్రాఫిక్ రద్దీ సమస్యకు పరిష్కారంగా నగరంలో 12 పైవంతెనలు నిర్మించాలని గతంలో ప్రణాళిక చేసింది. వీటిని మధురవాడ నుంచి లంకెలపాలెం మధ్యలో నిర్మించేలా డీపీఆర్ తయారు చేశారు. ఇదే సమయంలో మెట్రో చేపడితే రెండు పనులతో ఇబ్బందులు వస్తాయి. ఖర్చూ అధిగమవుతుంది. ప్రాజెక్టు సంయుక్తంగా చేపడితే స్థలం, ఖర్చు ఆదా చేసినట్లవుతుందని నిర్ణయించారు. ఇప్పటికే డబుల్ డెక్కర్ తరహా మెట్రో దేశంలోని నాగ్‌పూర్‌లో నిర్వహిస్తున్నారు. ఆ ప్రాజెక్టుకు డీపీఆర్ తయారు చేసిన సంస్థ నుంచి వివరాలు సేకరించి జాతీయ రహదారుల సంస్థకు అధికారులు సమర్పించారు. దీంతో ఈ ప్రాజెక్టు వ్యయాన్ని ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్, ఎన్‌హెచ్ఏఐ భరించేలా పట్టాలెక్కించనున్నారు. మొత్తం పర్యవేక్షణ మెట్రో సంస్థ చేపట్టనుంది.

**20 కి.మీ.లలో..:** విశాఖ మెట్రో ప్రాజెక్టును మొత్తం 140.13 కి.మీ.లలో చేపట్టాలనేది ప్రతిపాదన. మొదటి దశలో మూడు కారిడార్లు 46.23 కి.మీ.లలో నిర్మించనున్నారు. ఇందులో 20.16 కిలోమీటర్లు డబుల్ డెక్కర్ తరహాలో పైవంతెనలు నిర్మిస్తారు. మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు, అలాగే గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ మధ్య రెండు భారీ వంతెనలు నిర్మిస్తారు. ఇక్కడ కింద రోడ్డు.. దానిపై పైవంతెన (ఫ్లైఓవర్), ఆపైన మెట్రో ట్రాక్ వస్తుంది. ఇది అందుబాటులోకి వస్తే ఆసియా ఖండంలోనే పొడవైన మెట్రో డబుల్ డెక్కరుగా గుర్తింపుపొందనుంది.

**వంతెనలను కలిపేసి:** కొమ్మాది– స్టీలుప్లాంటు, గురుద్వారా–పాతపోస్టాఫీసు, తాటిచెట్లపాలెం–చినవాల్తేరు.. మూడు కారిడార్లలో మొదటి దశ కింద విశాఖ మెట్రోకు ప్రణాళిక చేశారు. కొమ్మాది–స్టీల్‌ప్లాంటు మధ్య నిర్మించే 34.40 కి.మీ కారిడార్‌లోనే డబుల్ డెక్కర్ ట్రాక్ రానుంది. మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు 15.06 కి.మీ.లో వచ్చే కారిడార్‌ను 8 పైవంతెనలను అనుసంధానం చేసి ఒకే వంతెనుగా ఎన్‌హెచ్ఏఐతో కలిసి నిర్మిస్తారు. గాజువాక నుంచి స్టీల్‌ప్లాంటు మధ్య మరొకటి చేపడతారు.

# రాజాం రహదారి విస్తరణ ప్రారంభం




రాజాం : రాజాం రహదారి విస్తరణ పనులు తిరిగి ప్రారంభించారు. రూ.20 కోట్లతో గాయత్రీ కాలనీ నుంచి బొబ్బిలి కూడలి, అంబేడ్కర్ కూడలి నుంచి జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల వరకూ 80 అడుగుల వెడల్పున రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. రూ.8 కోట్ల వరకు బకాయిలు ఉండడంతో గుత్తేదారు పనులు నిలిపేశారు. ప్రచురితమైన కథనం జనం ఇబ్బందులను కళ్లకు కట్టింది. దీనిపై ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు రూ.2 కోట్లు, రూ.6 కోట్లు రెండు బిల్లులు ప్రభుత్వానికి నివేదించడంతో రూ.2 కోట్ల బిల్లు మంజూరు చేశారు. దీంతో గుత్తేదారు పనులు మొదలుపెట్టారు. బొబ్బిలి రహదారిలో భవనాలను తొలగించే పనులు చేస్తున్నారు. వర్షాకాలం మొదలవడంతో తొలుత వరద కాలువల నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. పోలీస్ స్టేషన్ రోడ్డు నుంచి బొబ్బిలి కూడలి వరకు కాలువ నిర్మించాల్సి ఉంది. అంబేడ్కర్ కూడలి నుంచి 150 మీటర్ల మేర కాలువలు పూర్తి చేయాలి. వీటి తర్వాత రహదారి మెటల్, తారుపూత పనులు చేపడతారు. త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ జేఈ నాగభూషణరావు తెలిపారు.

# కుళ్లుతున్న కూరగాయలు

ఆదోని : కూరగాయలు నీటిలో కొట్టుకుపోవడం.. మురుగంతా నిల్వ ఉండటం.. అడుగు తీసి అడుగు వేయలేనంతగా బురద పేరుకుపోవడం.. దీన్ని యథాస్థానానికి తెచ్చేందుకు అధికారులు, సిబ్బంది నానా అవస్థలు పడటం.. ఇది వర్షాకాలంలో తరచూ ఎదురయ్యే పరిస్థితి. ఆదోని రైతు బజార్‌లో ముంపు సమస్య రైతులు వ్యాపారులు, వినియోగదారులకు చిక్కులు తెచ్చిపెడుతోంది.

**ఎత్తు పెంచడమే పరిష్కారం**

పట్టణ నడిబొడ్డున, అదీ రైల్వేస్టేషన్, బస్టాండుతో పాటు వస్త్ర వ్యాపార సముదాయాలకు, షరాఫ్‌బజార్‌కు, వివిధ రకాల మార్కెట్ ప్రాంతానికి రైతుబజార్ దగ్గరగా ఉండటంతో పల్లె, పట్టణ వాసులంతా ఇక్కడే కూరగాయలు కొనుగోలు చేస్తారు.

ప్రధానంగా రైతుబజార్ ఎత్తు పెంచాలి. చుట్టూ షెడ్లు నిర్మించి, వ్యాపారులకు అనుకూలంగా మార్చాలి. ముందు భాగంలో ఆక్రమణలు తొలగించి సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలి. మరుగుదొడ్లు, తాగునీటి వ్యవస్థతో పాటు కేంద్రాన్ని ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత వాతావరణం తగ్గట్లు రూపురేఖలు మార్చడంతో పాటు ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి.



**కొర్రీలు పెడుతున్న పురపాలకశాఖ**

రైతు బజార్‌ను అభివృద్ధి చేయాలని గతంలో చేసిన ప్రతిపాదనలు అటకెక్కాయి. రైతు బజార్‌కు కేటాయించిన స్థలం పురపాలక సంఘానిది.. రైతుబజార్‌ను మార్కెటింగ్ శాఖ నిర్వహిస్తోంది. రెండు శాఖల మధ్య సమన్వయం లోపించింది. స్థలం బదలాయించడానికి పురపాలక శాఖ అధికారులు అంగీకరించడం లేదు.

**నెలకు రూ.50 వేల ఆదాయం**

1999లో తెదేపా ప్రభుత్వ హయాంలో పాత ఆకాశవంతెన ప్రాంతంలో 60 సెంట్ల స్థలంలో రైతుబజార్ నిర్మించారు. ఇక్కడ 30 స్టాల్స్, నాలుగు దుకాణాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 15 స్టాల్స్ కొనసాగుతున్నాయి. నెలకు అద్దెల రూపంలో రూ.40–50 వేలు ఆదాయం సమకూరుతోంది. రోజుకు 1500 మంది వినియోగదారులు ఇక్కడికి వస్తుంటారు.

**వంక ముంచుతోంది**

రైతుబజార్ లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షం నీరంతా కేంద్రంలోకి వచ్చి చేరుతోంది. దీనికి తోడు పక్కనే పెద్ద వంక పారుతోంది. ఆ పరిసరాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు, మర్చంట్ క్లబ్ ప్రాంతంలో మురుగు వంక ప్రవాహం తట్టుకోలేక నీరంతా వెనక్కి నెట్టి రైతు బజార్‌లోకి చొచ్చుకెళ్తోంది. ఫలితంగా మోకాలి లోతు నీరు చేరుతుండటంతో వ్యాపారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిల్వ ఉంచి వెళ్లిన కూరగాయలు వర్షంలో తడిసి నష్టం కలుగుతోంది. కిరాణం, ఇతర వ్యాపారుల పరిస్థితి ఇలానే ఉంది.

# అవసరం అధికం.. అందుతోంది సగం

నంద్యాల : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని నాలుగేళ్ల కిందట సర్వజన ఆసుపత్రిగా మార్చారు. ఇక్కడికొచ్చే రోగుల సంఖ్య పెరిగింది. వీరికి అవసరమయ్యే ముఖ్యమైన మాత్రలూ అందుబాటులో ఉండటం లేదు. సూపర్‌స్పెషాలిటీ సేవలందిస్తున్నట్లు చెబుతున్నా కనీసం మధుమేహానికి సంబంధించి ఔషధాలు ఇవ్వకపోవడంపై రోగులు మండిపడుతున్నారు. మందుల కొనుగోలుకు ఏటా రూ.3.2 కోట్లు కేటాయిస్తున్నారు. మూడు నెలలకు ఒకసారి రూ.80 లక్షలు విడుదల చేస్తారు. వాటిని వెచ్చించి సెంట్రల్‌డ్రగ్స్‌లో లేనివి కొనాలి. ఇక్కడ లేని ఔషధాలు వైద్యులు రాస్తుండటంతో డబ్బులిచ్చి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఒక్కోరోగిపై రూ.200 నుంచి రూ.500 వరకు భారం పడుతోంది.

1. మధుమేహంతో బాధపడుతున్న వ్యక్తికి రెండు రకాల ఔషధాలు రాసిచ్చారు. అవి నంద్యాల సర్వజన ఆసుపత్రిలో లేకపోవడంతో ప్రైవేటు దుకాణానికి వెళ్లారు..రూ.500 వెచ్చించి మందులు కొనుగోలు చేశారు.

2. నరాల సమస్యతో బాధపడుతూ బాధితుడు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికొచ్చారు. నాలుగు రకాల ఔషధాలు వాడాలని వైద్యులు రాసిచ్చారు. అందులో కొన్ని లేకపోవడంతో రూ.300



వెచ్చించి బయట తెచ్చుకొన్నారు.

అవసరమైన ఔషధాలు లేకపోవడంతో సర్వజన ఆసుపత్రికొచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు.

**అడిగినవి ఇవ్వకుండా**

సర్వజన ఆసుపత్రిలో నిత్యం 20కి పైగా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. యూరిన్ పైపు కూడా లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. పెద్దలకు, పిల్లలకు సెలైన్ ఎక్కించాలంటే అవసరమైన సామగ్రి కొరత వేధిస్తోంది.

చాలా మంది రోగులు డోలో 650 ఎంజీ అడుగుతుంటే...ఆసుపత్రిలో 500 ఎంజీ పారాసెట్‌మల్ ఇస్తున్నారు.. గ్లౌజ్‌లూ కొనాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు.

**జనరిక్‌కు తాళం వేసిన వైకాపా** ఆసుపత్రిలో లేని మందులు తెచ్చుకోవడానికి జనరిక్ దుకాణం గతంలో ఉండేది. గత వైకాపా ప్రభుత్వంలో రాజకీయ జోక్యంతో జనరిక్ మందుల దుకాణాలు మూతపడ్డాయి. వాటికి టెండర్లు వేసి ఏళ్లు గడుస్తున్నా..అతీగతీ లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తీరడం లేదు.




## అందాల హద్దులు దాటిన కీర్తి ఆ శృతి మించడం లేదు..!

మహానటి ఫేం కీర్తి సురేష్ కెరీర్ ఆరంభం నుంచి స్కిన్ షో కి దూరంగా ఉంటూ వచ్చింది. ముఖ్యంగా సినిమాల్లో అడుగు పెట్టిన కొన్ని సంవత్సరాల పాటు కనీసం నడుము అందాన్ని కూడా చూపించకుండా సినిమాల్లో నటిస్తూ వచ్చింది. కీర్తి సురేష్ కేవలం నటనతో గుర్తింపు దక్కించుకుంటుంది, అందాల ఆరబోత చేయకుండానే ఇంతటి పాపులారిటీని సొంతం చేసుకుంటే ఇక స్కిన్ షో చేస్తే ఏ స్థాయిలో ఈమె స్టార్‌డం దక్కించుకుంటుందో కదా అంటూ చాలా మంది కామెంట్ చేశారు. చాలా మంది చాలా రకాలుగా ప్రయత్నించినా కూడా కీర్తి సురేష్ కెరీర్ ఆరంభంలో స్కిన్ షోకి ఓకే చెప్పలేదు. ఏ ఒక్క సినిమాలో కనీసం చిన్న రొమాంటిక్ సీన్స్‌లో కూడా ఈమె నటించలేదు. స్కిన్ షోకి, రొమాంటిక్ సీన్స్‌కి దూరంగా ఉండటం వల్ల టాలీవుడ్‌లో ఆఫర్లు తగ్గాయి, కోలీవుడ్‌లోనూ ఈమెకు స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కడం లేదు. దాంతో మెల్ల మెల్లగా తాను కూడా రూట్ మారాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అందుకే స్కిన్ షో కి ఈ అమ్మడు రెడీ అయింది. ఆ మధ్య మహేష్ బాబు హీరోగా వచ్చిన సర్కారు వారి పాట సినిమాలో ఒక మోస్తరు స్కిన్ షో చేసింది. అంతే కాకుండా ఆ సినిమాలో కాస్త మహేష్ బాబుతో రొమాంటిక్ యాంగిల్ ఉన్న పాత్రలో కనిపించింది. కీర్తి సురేష్‌ను ఆ సినిమాలో చూసి చాలా మంది షాక్ అయ్యారు. ఇక బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన బాబీ జాన్ సినిమాతో మరో మెట్టు



ఎక్కింది. రొమాంటిక్ సీన్స్, స్కిన్ షోకి ఈ అమ్మడు దాదాపుగా ఓకే చెప్పినట్లే అని దాంతో క్లారిటీ ఇచ్చింది. సౌత్ ఇండియాలోనే కాకుండా ఎక్కడైనా సినిమాల్లో హీరోయిన్స్ అలరించాలంటే ఖచ్చితంగా స్కిన్ షో చేయాల్సిందే, స్టార్ డం దక్కాలంటే రొమాంటిక్ సీన్స్ చేయాల్సిందే. ఈ మధ్య కాలంలో స్టార్ హీరోల సినిమాల్లో లిప్ లాక్ సీన్స్ కామన్ అయ్యాయి. అందుకే చాలా మంది హీరోయిన్స్ లిప్ లాక్ సీన్స్‌కు ఇష్టం లేకున్నా ఓకే చెబుతున్నారు. ఆఫర్లు రావాలంటే కొన్ని విషయాల్లో చూసి చూడనట్లు ఉండాలని, అన్నింటికి ఓకే చెప్పాలని కొందరు హీరోయిన్స్ అంటూ ఉంటారు. అలా ఉంటేనే ఇండస్ట్రీలో ముఖ్యంగా కమర్షియల్ సినిమాల్లో నటించే అవకాశాలు వస్తాయని అంటారు. కీర్తి మాత్రం అందంగా కనిపించే విషయంలో హద్దులు దాటింది కానీ ముద్దు విషయంలో మాత్రం శృతి మించను అంటోంది. ఒక మోస్తరు వరకు స్కిన్ షో చేయడానికి ఈ అమ్మడు రెడీ అంటోంది. ఇప్పటి వరకు చేసిన దానితో పోల్చితే కీర్తి సురేష్‌ను ఇంకాస్త ఎక్కువగానే స్కిన్ షో లో చూసే అవకాశాలు ఉన్నాయి. కానీ రొమాంటిక్ సీన్స్ ముఖ్యంగా లిప్ లాక్ సీన్స్‌లో ఆమెను చూసే అవకాశం లేదని అంటున్నారు. పెళ్లి తర్వాత సహజంగా హీరోయిన్స్ స్కిన్ షో కి దూరంగా ఉంటారు. కానీ కీర్తి సురేష్ ఇన్నాళ్లు స్కిన్ షో చేయకుడా ఉండి, పెళ్లి అయిన తర్వాత ఇప్పుడు స్కిన్ షోకు ఓకే చెప్పడం విడ్డూరంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కీర్తి సురేష్ ముందు ముందు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి. త్వరలో ఈమె తెలుగులో విజయ్ దేవరకొండతో సినిమాను చేసే అవకాశాలు ఉన్నాయి. ఆ విషయమై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరో వైపు తమిళ్, హిందీలోనూ ఈమె ప్రాజెక్ట్‌లు చేస్తూనే ఉంది.

## బుట్టబొమ్మని గట్టెక్కించేది ఆ ఇద్దరేనా?

ఫిల్మ్ ఇండస్ట్రీలో కొంత మంది క్రేజ్ ఎంత రాకెట్ స్పీడుతో పెరుగుతుందో అంతే స్పీడుగా పడిపోతుంటుంది. ఇలియానా, శ్రీలీల ఇప్పుడు బుట్టబొమ్మ పూజా హెగ్డే. ఈ ముగ్గురు టాలీవుడ్‌లో ఎంత స్పీడుగా ఎదిగారో అంతే స్పీడుగా ఫ్లాపుల్ని ఎదుర్కొన్నారు. ఇప్పటికీ ఎదుర్కొంటున్నారు. దానికి కారణం వారు ఎంచుకున్న సినిమాలే. ఇలియాన రాకెట్ స్పీడుతో ఎదిగి అంతే స్పీడ్‌తో తెరమరుగైపోయింది. ఇప్పుడు ఆ పరిస్థితిని బుట్టబొమ్మ పూజాహెగ్డే ఎదుర్కొంటోంది. డీజే దువ్వాడ జగన్నాథంమూవీతో బిగ్ డైరెక్టర్ల దృష్టిని ఆకర్షించిన పూజా హెగ్డే అనతికాలంలోనే వరుసగా క్రేజీ ఆఫర్లని దక్కించుకుని టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలిచింది. బన్నీ అలవైకుంఠపురం%-% వరకు అదే హవాని కొనసాగిస్తూ భారీగా డిమాండ్ చేసిన పూజా హెగ్డే ఆ తరువాత నుంచి వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొంటూ కెరీర్ పరంగా ఎదురీదుతోంది. రాధేశ్యామ్, బీస్ట్, ఆచార్య, బాలీవుడ్‌లో సర్కస్, కిసీకి భాయ్ కిసీకి జాన్, దేవ వంటి సినిమాలతో వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొని షాక్



ఇచ్చింది. ఈ సినిమాలతో పూజా హెగ్డే వరుసగా రికార్డు స్థాయిలో 7 ఫ్లాపుల్ని దక్కించుకోవడం గమనార్హం. తాజాగా సూర్య, కార్తీక్ సుబ్బరాజ్‌ల రెట్రోతోనూ ఫ్లాప్‌ని ఎదుర్కోవడంతో బుట్టబొమ్మ కెరీర్ ఇక అంతేనా అనే అనుమానాలు మొదలయ్యాయి. తాజా పరిణామాల నేపథ్యంలో పూజా హెగ్డేకు టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలో అవకాశాలు తగ్గే అవకాశం ఉందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తనని, తన కెరీర్ ని కాపాడేది ఆ ఇద్దరే అనే చర్చ మొదలైంది. ఆ ఇద్దరు దళపతి విజయ్, రాఘవ లారెన్స్. విజయ్ తన చివరి సినిమా జన నాయగన్ చేస్తున్న విషయం తెలిసిందే. హెచ్.వినోద్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో విజయ్‌కి జోడీగా బుట్టబొమ్మ నటిస్తోంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ మూవీని వచ్చే ఏడాది జనవరి 9న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా ఫలితంపైనే పూజా హెగ్డే కెరీర్ ఆధారపడి ఉంది.


ఇక ఈ మూవీ తరువాత పూజా హెగ్డే హారర్ థ్రిల్లర్ కాంచన 4లో నటిస్తోంది. కాంచన ఫ్రాంచైజీలో భాగంగా రాఠవ లారెన్స్ రూపొందిస్తున్న ఈ మూవీ కూడా పూజా హెగ్డేకు కీలకంగా మారింది. తొలి సారి తను చేస్తున్న హారర్ థ్రిల్లర్ కావడం, కాంచన సీక్వెల్ కావడంతో అందరి దృష్టి ఈ ప్రాజెక్ట్‌పై పడింది. బుట్టబొమ్మకు ఈ రెండు సినిమాలు హిట్ ని అందిస్తే మరిన్ని సినిమాలు వచ్చే అవకాశం ఉంది. లేదంటే ఇక కెరీర్ ముగిసినట్టే అని ఇన్ సైడ్ టాక్.

## చిరు, బాలయ్య, పవన్.. ఉండేదెవరు? తప్పుకునేదెవరు?



టాలీవుడ్ లో బాక్సాఫీస్ వద్ద పరిస్థితి ఎప్పుడూ విచిత్రంగానే ఉంటుంది. చేయాలని ఫిక్స్ అయితే ఎంత పోటీ ఉన్నా ఒకరోజు సినిమాలు రిలీజ్ చేస్తారు. అలా ఒకే రోజు రెండు, మూడు సినిమాలు రిలీజ్ చేసిన సందర్భాలు ఉన్నాయి. లేదంటే బాక్సాఫీస్ ను ఖాళీగా ఉంచేస్తారు. అసలు రిలీజ్ మాటే ఎత్తరు. రీసెంట్ గా సమ్మర్ అలానే గడిచిపోయింది. ఎండాకాలం సెలవులను ఉపయోగించుకొని బాక్సాఫీస్ వద్ద సినిమాల సందడి ఉంటుందని అనుకుంటే, పరిస్థితి భిన్నంగా అయ్యింది. పలు కారణాలు వల్ల ఆయా సినిమాలు పోస్ట్ పోన్ అయ్యాయి. ఇక టాలీవుడ్ లో బడా హీరోలు టార్గెట్ చేసేది ఒకటి సంక్రాంతి, రెండు దసరా. తెలుగు రాష్ట్రాల్లో ఇవి రెండు పెద్ద పండగలు. అందుకే సినిమాలను కూడా ఈ పండగలకే రిలీజ్ చేసేలా ప్లాన్ చేసుకుంటారు. ఈ క్రమంలోనే రానున్న దసరాపై తెలుగు స్టార్ హీరోలు కన్నేశారు. ఈ సెప్టెంబర్లో పలు సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఢీ అంటే ఢీ అనేందుకు సిద్ధమవుతున్నాయి. అందులో నందమూరి బాలకృష్ణ అఖండ 2, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ, మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర ఉన్నాయి. ఈ ముగ్గురు బడా హీరోలు సెప్టెంబర్ లోనే వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈసారి అక్టోబర్ 02న దసరా పండగ ఉండనుంది. ఇందు కోసం వారం ముందు నుంచే సెలవులు ప్రకటిస్తారు. ఈ హాలీడేస్ ను దృష్టిలో ఉంచుకున్న ఆయా సినిమాల మేకర్స్ సెప్టెంబర్ 25 డేట్ పై కన్నేశారు. ఈ నేపథ్యంలోనే సెన్సేషనల్ డైరెక్టర్ బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న అఖండ 2 సెప్టెంబర్ 25 రిలీజ్ కానుంది. అయితే అందరి కంటే ముందే అఖండ మేకర్స్ ఈ తేదీని లాక్ చేసుకున్నారు. ఇక పవన్ కళ్యాణ్, సుజిత్ కాంబోలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ సినిమా ఓజీ కూడా అదే తేదీన థియేటర్లలోకి రానుంది. దీంతో రెండు సినిమాలు క్లాష్ అవుతున్నాయని అనుకునే లోపే రేస్ లోకి మూడో సినిమా రానుందని ఇన్ సైట్ టాక్ వినిపిస్తోంది. చిరంజీవి విజువల్ వండర్స్ విశ్వంభర కూడా సెప్టెంబర్ 25న వచ్చేందుకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. అయితే ఒకే రోజు రెండు సినిమాలు అంటే ఓకే. కానీ మూడు సినిమాలు, అవీనూ పెద్ద హీరోల సినిమాలు ఒకే రోజు రిలీజ్ అంటే థియేటర్ల అడ్జెస్ట్ మెంట్ కూడా కష్టమే. అటు ఫ్యాన్స్ కు కూడా కన్ ఫ్యూజనే. అందుకే ఈ రేస్ లో నుంచి ఒకరు తప్పుకునే ఛాన్స్ ఉన్నట్లు తెలిసింది. అందరికంటే ఆఖరుగా ఫిక్స్ అయిన విశ్వంభం మాత్రం రేస్ లో ఉంటుందట. మిగిలిన రెండు అఖండ 2, ఓజీలో ఏదో ఒకటి తప్పుకోనుందని తెలుస్తోంది. చూడాలి మరి దసర రేస్ లో ఉండేదెవరు? తప్పుకునేదెవరు? మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది!

## కూలీ.. డైరెక్ట్ గా సినిమా చూపిస్తారా..?




సూపర్ స్టార్ రజినీకాంత్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో వస్తున్న సినిమా కూలీ. ఈ సినిమాలో మన టాలీవుడ్ కింగ్ నాగార్జున, కన్నడ స్టార్ ఉపేంద్ర, బాలీవుడ్ స్టార్ అమీర్ ఖాన్ కూడా భాగం అవుతున్నారు. సినిమాలో ఎవరెవరు ఏయే పాత్రల్లో కనిపిస్తారు అన్నది ఇప్పటివరకు రివీల్ చేయలేదు. ఉపేంద్ర, అమీర్ ఖాన్ లవి గెస్ట్ రోల్స్ కాగా నాగార్జున మాత్రం నిడివి ఎక్కువ ఉన్న పాత్రలోనే కనిపిస్తారని తెలుస్తుంది. కూలీ సినిమాలో నాగార్జున రోల్ లో ఆయన్ని మాత్రమే ఒప్పించాలని లోకేష్ చాలా రిక్వెస్ట్ చేసి మరీ నాగార్జునని ఒప్పించారట. ఇదిలా ఉంటే స్టార్ సినిమా అయినా చిన్న సినిమా అయినా సినిమా పై ఒక అంచనా రావాలంటే ట్రైలర్ వదలాలి. ఐతే లోకేష్ కనకరాజ్ రజిని సినిమా అంటేనే అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. సినిమా ట్రైలర్ చూడకపోయినా సినిమాకు వెళ్తారు. అందుకే లోకేష్ కొత్తగా కూలీ ట్రైలర్ ని వదలకుండా సినిమాను రిలీజ్ చేయాలని చూస్తున్నారట. సినిమా గురించి ఎలాంటి ప్రమోషనల్ కంటెంట్ లేకుండా డైరెక్ట్ గా థియేటర్ కి వచ్చే ఆడియన్స్ థ్రిల్ అవ్వాలని అలా సెట్ చేస్తున్నాడట లోకేష్. ఓ విధంగా ఇది మంచి ప్లానే.. రజిని సినిమా కాబట్టి ఫ్యాన్స్ ఫస్ట్ షోకి ఎగబడతారు. అందులోనూ నాగార్జున, ఉపేంద్ర, అమీర్ ఖాన్ ఉన్నారంటే ఇంకాస్త క్రేజ్ ఉంటుంది. అందుకే లోకేష్ కూలీ సినిమా ట్రైలర్ లేకుండానే సినిమా వదలాలని అనుకుంటున్నారట. నిర్మాతలను ఈ విషయంలో కన్విన్స్ చేసే పనిలో ఉన్నారట. వాళ్లు నీ ఇష్టం అన్నారంటే మాత్రం లోకేష్ కూలీని డైరెక్ట్ గా థియేటర్ లోనే చూపిస్తాడని తెలుస్తుంది. సినిమా గురించి ఎలాంటి శాంపిల్ టీజర్, ట్రైలర్ లేకుండా రిలీజ్ చేయడం అంటే పెద్ద సాహసమే అని చెప్పాలి. లోకేష్ కనకరాజ్ కూలీ సినిమాను ఒక డైరెక్టర్ గా కాకుండా రజినికాంత్ వీరాభిమానిగా చేస్తున్నాడట. తప్పకుండా ఈ సినిమా అంచనాలను అందుకుంటుందనే చిత్ర యూనిట్ నమ్మకంగా ఉన్నారు. ఈ సినిమాలో పూజ హెగ్డే స్పెషల్ సాంగ్ చేస్తుండగా శృతి హాసన్ ఫిమేల్ లీడ్ గా చేస్తుంది. రజిని కూలీ సినిమా ఆగష్టు 14న రిలీజ్ లాక్ చేశారు. అదే డేట్ కి హృతిక్ రోషన్, ఎన్ టీ ఆర్ నటించిన వార్ 2 కూడా పాన్ ఇండియా భారీ రిలీజ్ అవుతుంది.

## రత్తాలు పరువాంపుల ప్రదర్శన

రత్తాలు ఏం చేసినా సంథింగ్ స్పెషల్ గానే ఉంటుంది. ఇటీవల రాయ్ లక్ష్మీకి అవకాశాల్లేవ్.. ఇంతకుముందులా టాలీవుడ్ పిలిచి అవకాశాలివ్వడం లేదు. కోలీవుడ్ లోను ఖాళీ అయిపోయింది. బాలీవుడ్ లో ఫ్లాపుల్లో నటించాక ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదు. అయితే సోషల్ మీడియా ఆర్జనలో రత్తాలు ఎంత మాత్రం తగ్గడం లేదు. నేటి యూత్ కి కిక్కెక్కించే వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తూ రాయ్ లక్ష్మీ చేస్తున్న రచ్చ మామూలుగా లేదు. 40 ప్లస్ లోను ఈ బ్యూటీ ఒక రేంజులో పరువాంపుల ప్రదర్శనతో మత్తెక్కిస్తోంది. దీంతో ఇన్‌స్టా సహా ఇతర సామాజిక మాధ్యమాల్లో భారీ ఫాలోయింగ్ ని పెంచుకుంటోంది. రాయ్ లక్ష్మీ ప్రస్తుతం లండన్ విహారయాత్రలో



ఉంది. లివ్ లవ్ లండన్ పేరుతో అక్కడ రెడ్ హాలిట్ లుక్ లో అదిరిపోయే ఫోటోషూట్ తో హృదయాలను కొల్లగొట్టింది. ఎరుపు రంగు మిడీలో రాయ్ లక్ష్మీ సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. ఓవైపు థై అందాలతో లండన్ బాబులను రెచ్చగొడుతున్న రాయ్ లక్ష్మీ అదిరిపోయే రెబలియన్ స్క్వాడ్రన్ గాగుల్స్‌తో మతులు పోగొడుతోంది. కొందరు లండన్ సెక్యూరిటీ అధికారులతో రాయ్ లక్ష్మీ ఫోజులు కిరాక్ పుట్టించాయి. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ యూత్‌లో వైరల్ గా మారుతోంది. రాయ్ లక్ష్మీ రచ్చ ఫలించి ఇకపై అయినా సౌత్ లో ఆశించిన అవకాశాలు తన దారికి వస్తాయేమో చూడాలి.

## ఎట్టకేలకు ఫరియా ఫిక్స్ చేసిందా?

జాతి రత్నాలు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఫరియా అబ్దుల్లా ఆ సినిమాతో మంచి హిట్ ను అందుకుంది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించి నటిగా మంచి పేరు తెచ్చుకున్న ఫరియా అబ్దుల్లా ఆఖరిగా మత్తు వదలరా2 లో కనిపించింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయినప్పటికీ ఆ తర్వాత ఫరియా నుంచి మరో సినిమా వచ్చింది లేదు. అయితే తాజాగా ఇప్పుడు ఫరియా ఇన్‌స్టాగ్రమ్ లో చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతుంది. ఫరియా ఓ ప్రొడక్షన్ హౌస్ నుంచి వచ్చిన ఓ టీజర్ ను తన ఇన్‌స్టాలో షేర్ చేసింది. ది టైటిల్ ఈజ్ హిజ్ నేమ్, అతని ఆటకు రెడీ గా ఉండు. మ్యాడ్‌నెస్ స్టార్ట్ కానుందంటూ ఆ పోస్టర్ కింద రాసి ఉంది. %వీజీవీ% మోషన్ పిక్చర్స్, బురా, సద్ది క్రియేటివ్ ఆర్ట్స్ బ్యానర్లు ఆ సినిమాను సంయుక్తంగా రూపొందిస్తున్నాయి. అమర్ బురా, జయకాంత్, వేణు సిద్ది ఈ



సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఫరియా నటిస్తున్నానని డైరెక్ట్ గా చెప్పకపోయినప్పటికీ ఆ టీజర్ ను ఆమె షేర్ చేయడం వెనుక ఉద్దేశం అదే అని ఆమె ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి సంవత్సరం తర్వాత ఫరియా సినిమా ఓకే చేసిందని, ఈ ప్రాజెక్టుతోనే ఫరియా మళ్లీ స్క్రీన్ పైకి రానుందని వారు భావిస్తున్నారు. ఫరియా షేర్ చేసిన ఆ టీజర్ డార్క్ కామెడీ మూవీ అని తెలుస్తోంది. ఫరియా పోస్ట్ ఆమె కంబ్యాక్ ను సూచిస్తే, తెలుగు మూవీ కొత్త పుంతలు తొక్కుతున్న ఈ టైమ్ లో ఆమె కూడా ఒక అధ్యాయంలోకి అడుగుపెట్టినట్టే అవుతుంది. మరి ఈ సినిమా అయినా ఫరియాకు మంచి హిట్ ను అందించి, తనను బిజీ ఆర్టిస్టుగా మారుస్తుందేమో చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536